శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము

వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

3వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-3

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

<u>Cover Photo:</u>

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

మరీచిర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః |
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతి: || (21)

191. మరీచిః

కాంతి కిరణము, తేజోమయుడు.

ఓం మరీచయే నమః

అంధేభ్యోऽపి చ జంతుభ్యః హంసగ్రీవావతారతః
ప్రకాశిత స్వరూపత్వాత్ మరీచిరితి కథ్యతే

గ్రుడ్డివారికి కూడా నిర్మలమైన హంసావతారముతో తన రూపమును ప్రకాశింపజేయువాడు.
'మరీచి' అనగా కిరణము. భగవంతుడు భౌతికమగు కన్నులకు (చర్మచక్షువులకు) కానరాడు. కాని భక్తుల భక్తినేత్రములకు శ్రీమన్నారాయణుడు కిరణమై దర్శనమొసగును అని శ్రీభట్టులు వివరించారు. వ్రతముల వలన, క్రతువుల వలన, శక్తియుక్తులవలన చిక్కనివాడు భక్తికి మాత్రము తనంత తాను పట్టుబడును. భక్తులకు భగవంతుని వెదుకనవసరము లేదు. ఆయనే వారికి దర్శనమిచ్చును.

ధర్మచక్రము రచయిత – భగవంతుని 'మరీచి' గుణము మనకు ధ్యాన మార్గమును ఉపదేశించును. ముందుగా ఇంద్రియములను నియంత్రించి, శారీరిక శక్తిని మానసిక శక్తిగా మలచుకొనవలయును. ఆపై మనస్సును నియంత్రించి ఈ శక్తిని వెలుతురుగా చేసికొని, ఆ వెలుతురులో ధ్యానమును సాగించవలెను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఇదే నామమునకు మరొకవిధముగా అర్థము చెప్పారు. 'మృ' – ప్రాణత్యాగే - మరణించుట, నశించుట – అనే మూలమునుండి, 'మరీచి' అనగా 'నాశనము చేయువాడు' అని అర్థము.

లయ కారకుడైనందున ఆయన 'మరీచి'యగును. సృష్టి, స్థితి, లయములను మూడును భగవంతుని కార్యములే.

గీత 2.25 – **జాతస్య హి ధ్రువో మృత్యుః, ధ్రువమ్ జన్మ మృతస్య చ** – పుట్టినివానికి మరణము నిశ్చయము. మరణించిన పిదప మరల జన్మయును నిశ్చయమే.
అథర్వ వేదము 5.24.13 – **మృత్యుః ప్రజానామ్ అధిపతిః**

192. దమనః

- సంసార భారమును తొలగించి, బంధవిముక్తి నొసగువాడు.
- అధర్మ మార్గమున చరించువారిని దండించి, శిక్షించువాడు.

ఓం దమనాయ నమః

దమయతి ఇతి దమనః – హరించువాడు దమనుడు.
శ్రీ భట్టులు 'మరీచిః' నామము వివరణను ఇంకొంత ముందుకు నడిపి, 'దమనః' నామమును వివరించారు. శ్రీమన్నారాయణుడు కాంతిమయుడు గనుక అజ్ఞానాంధకారములో, మాయామోహితులై, సంసారబంధమున కొట్టుమిట్టాడు భక్తులకు తరణోపాయమును చూపి వారిని భవపాశములనుండి విముక్తులను చేయును. **భవతాపస్య దమనాత్ కాన్త్యా దమన ఈరితః** – తనయొక్క చల్లని కరుణచేత (కాంతి అనే చల్లని గంగాప్రవాహము చేత) భవతాపమును నాశనము చేయువాడు దమనుడు. తమస్సునకు, అసత్యమునకు, మృత్యువునకు ఆయన దమనుడు. సచ్చిదానందమార్గమును తెలియజేయు మరీచి.

శ్రీ శంకరులు 'దమ్' – ఉపశమే – నెమ్మది పరచుట – అనే భావంలో 'దమనః' అనగా 'అణచివేయువాడు, శిక్షించువాడు' అని వ్యాఖ్యానించారు. **స్వాధికారాత్ ప్రమాద్యతః ప్రజాః వైవస్వాది రూపేణ దమయితు శీలమ్ యస్య స దమనః** – తమయొక్క కర్తవ్యమునుండి విముఖులైన ప్రజలను తాను యముడు మొదలైన రూపములలో శిక్షించే లక్షణము కలవాడు దమనుడు. భగవంతుడు పెక్కు విధములుగా అధర్మపరులను శిక్షించును. రాజుగా నేరస్తులను శిక్షించును. నొప్పి, దుఃఖము, భయము, మరణము – ఇవన్నీ జనులలోని విపరీత వర్తనమును అదుపుచేయు సాధనములు.

ధర్మ చక్రము రచయిత ఇదే భావమును మరొక కోణంలో చెప్పారు. (ఆహార వ్యవహారములలో) సాత్విక మార్గమును వదలినవారికి వ్యాధులు, బాధలు సంభవించును. అలా వ్యక్తులను సన్మార్గమున నడపించు ముండ్లకంచెయే ఈ దమనము.

భగవంతుని అవతారములలో ఆయన దుష్ట శిక్షకుడని విశదముగా తెలియుచున్నది.

193. హంసః

హంసవంటి గుణములు కలవాడు. హంసావతరమును ధరించినవాడు. '**సోऽహమ్**' అని చాటిచెప్పు పరబ్రహ్మము. అన్ని శరీరములందలి అంతర్యామి.

ఓం హంసాయ నమః

నీటినుండి పాలను వేరు చేసి, పాలను మాత్రమే స్వీకరించుట హంస లక్షణము. ఇంకా స్వచ్ఛత, అందము, అందమైన నడకలకు హంస ప్రసిద్ధము. అదే విధముగా భగవంతుడు కేవలము మంచితనమునకు ఆలవాలము. మంచి కానిది ఆయన దరి చేరదు. భగవంతుని సంకల్పము, వాక్కు, కార్యము సదా సుందరము. శుద్ధము. కనుక 'హంస' నామమున శ్రీహరిని నుతింపనగును.

భగవంతుని హంసావతారము గూర్చి 'సురానందః' నామమున వివరించడమైనది. ఈ 'హంస' నామము కూడ బ్రహ్మాదులకు జ్ఞానమునుపదేశించిన పుణ్యావతారముగా చెప్పవచ్చును.

శ్రీ శంకరుల వ్యాఖ్యను అద్వైతపరముగా అన్వయింపవచ్చును. '**సోऽహమ్**' లేదా '**అహమ్ సః**' అనే సూక్తి అద్వైతవాదమున తరచుగా చెప్పబడినది. నేనే బ్రహ్మమును - **సోऽహమ్** – అని గ్రహించినవానికి సంసార భయమును పోగొట్టువాడు గనుక పరమాత్ముడు హంసయగును. 'హన్-స'. 'హన్'-నాశనము చేయుట 'స'-సంసార బంధన భయములు.

నాలుగు వేదాలలోనూ నాలుగు మహావాక్యాలున్నాయి.

1. **ప్రజ్ఞానం బ్రహ్మ** – ఐతరేయోపనిషత్తు – ఋగ్వేదము.
2. **అహం బ్రహ్మాస్మి** – బృహదారణ్యకోపనిషత్తు – శుక్లయజుర్వేదము
3. **తత్త్వమసి** – ఛాందోగ్యోపనిషత్తు – సామవేదము
4. **అయమాత్మా బ్రహ్మ** – మాండూక్యోపనిషత్తు – అధర్వణ వేదము

ఈ వాక్యాలలో చరాచర జగత్తంతా పరమేశ్వర స్వరూపమేనని, ఆ పరమేశ్వరుడను నేనే (నీయందే ఉన్నాడు) అని చెప్పబడింది. తమ ఉపన్యాసములో శ్రీ కృష్ణప్రేమి ఒక పిట్టకథను చెప్పేవారు. ఒక శిష్యుడు వేదాంతజ్ఞానము కొరకు ఒక అద్వైతాచార్యుని వద్దకు, ఒక విశిష్టాద్వైతాచార్యునివద్దకు మార్చి, మార్చి వెళ్ళినాడట. వారు ఇలా చెప్పారట.

అద్వైత గురువు –	**సోऽహమ్** (సః + అహమ్)
విశిష్టాద్వైత గురువు –	**దాసోऽహమ్**

అద్వైత గురువు – **సదానోऽహమ్**

విశిష్టాద్వైత గురువు – **దాసదానోऽహమ్**

'స', 'ద' అక్షరములు చేర్చి ఇలా తత్వమును ఉపదేశించుట విచిత్రము.

'హంస' నామమునకు మరొక వ్యాఖ్య – **హన్తి గచ్ఛతి సర్వ శరీరేషు ఇతి వా హంసః** – సకల శరీరములందు నివసించి చరించువాడు 'హంస'.

194. సుపర్ణః

- చక్కనైన రెక్కలుగలవాడు. గరుత్మంతుడు. హంస.
- యోగులు సంసార సాగరమును దాటుటకు సహకరించేవాడు.
- ఏదైనా కదలడానికి శక్తినిచ్చేవాడు.
- వేద స్వరూపుడు (సంసారమనే అశ్వత్థ వృక్షానికి వేదములే ఆకులు – గీత)
- పచ్చని తులసి ఆకులచే అలంకృతుడైనవాడు.
- శ్రీలక్ష్మీదేవి సాన్నిధ్యం కారణంగా పచ్చని రంగు గలవాడు.
- శుద్ధమైన భక్తిచే సంతోషించువాడు.
- పరమానంద నిలయుడు (సు-పర్-ణః)
- ప్రళయకాలంలో చక్కని మఱ్ఱి ఆకుపై శయనించినవాడు.
- విశ్వమంతా పూర్తిగా వ్యాపించియున్నవాడు.
- సుపర్ణుడైన గరుడుని వాహనముగ కలిగినవాడు.

ఓం సుపర్ణాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

21వ శ్లోకము. 194వ నామము. సుపర్ణః – **మరీచిర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః**

91వ శ్లోకము. 859వ నామము. సుపర్ణః – **ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః**

పర్ణములనగా పక్షిరెక్కలు. అందమైన, శుభప్రదమైన, దృఢమైన రెక్కలు కలిగిన పక్షిరూపుడని ఈ నామమునకు అర్థము. ఇదే అర్థమును వివిధ భావాలలో అన్వయించారు.

శ్రీమద్భాగవతము (1.16.15)లో భగవంతుడు ఇలా చెప్పాడు – **సిద్ధేశ్వరాణామ్ కపిలః సుపర్ణోऽహమ్ పతత్రిణామ్** – సిద్ధులలో నేను కపిలుడను. పక్షులలో నేను గరుడను. భగవద్గీత (10.29)లోనూ ఇదే విషయం

ఉన్నది – **మృగాణామ్ మృగేంద్రోఽహమ్ వైనతేయశ్చ పక్షిణామ్** – మృగములలో నేను సింహమును. పక్షులలో వినతాసుతుడగు గరుత్మంతుని.

కనుక 'సుపర్ణ' అనగా గరుత్మంతుడనీ, అన్నింటిలోకి ఉత్తముడనీ చెప్పవచ్చును. ఇంకా ఇంతకుముందు నామమైన 'హంస' అవతారమునకు కూడ (సుందరమైన రెక్కలుగలవాడు) అన్వయింపవచ్చును.

శోభన పర్ణత్వాత్ సుపర్ణ ఇతి కథ్యతే
సంసారపార నయనాత్ సుపర్ణ ఇతి వా మతః

సంసారసాగరమును దాటించుటకై చక్కనైన రెక్కలతో వచ్చి భక్తులను ఆ దరికి మోసుకొని పోవును గనుక ఆయన సుపర్ణుడగును. ముండకోపనిషత్తు (3.1) లో జీవాత్మ, పరమాత్మలను వివరించు వర్ణన సుప్రసిద్ధము.

ద్వా సుపర్ణా సాయుజా సఖాయా సమానమ్ వృక్షమ్ పరిష్వజతే
తయోరన్యః పిప్పలమ్ స్వాదన్తి అనశ్నమ్ అన్యో అభిచాకశీతి

ఒకే చెట్టుపై రెండు చక్కనైన పక్షులు (సుపర్ణములు) ఉన్నవి. అందు ఒక పక్షి (రావి)పండును భుజించుచున్నది. రెండవ పక్షి కేవలము చూచుచున్నది. రెండు పక్షులు అత్యంత స్నేహము కలిగినవి.

ఇక్కడ శరీరమే వృక్షము. దానిపైన మొదటి పక్షి 'జీవుడు'. రెండవ పక్షి 'ఈశ్వరుడు'. సంసారమునందలి కర్మఫలమే పండు. జీవాత్మ కర్మఫలముననుభవించును. పరమాత్మ సంగరహితుడు, సాక్షిమాత్రుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి గారు మొదటి పక్షిని మహాభోగి (పేరింబమ్) అనీ, రెండవ పక్షిని మహాజ్ఞాని (పేరఱివు) అనీ చెప్పారు. రెండవ పక్షిని 'సుపర్ణ' నామము ద్వారా గ్రహింపనగును.

(మరింత వివరణ 859వ నామమునకు చెప్పబడినది.)



గరుడునిపై అధిరోహించిన విష్ణువు - బ్యాంకాక్ లో విగ్రహము. (వికీపీడియానుండి)

195. భుజగోత్తమః

- ఆదిశేషునకు ప్రభువు.
- సర్పములలో ఉత్తముడు. (అనంతుడు, వాసుకి)
- వ్యాపనము, చలనము కలిగినవానిలో ఉన్నతుడు (సర్వవ్యాపి)

ఓం భుజగోత్తమాయ నమః

భుజేన గచ్ఛన్తి ఇతి భుజగాః – (కాళ్ళతో కాక) భుజములతో కదలునది భుజగము.
'ఉత్తమ' అనగా పైస్థానమున ఉన్నవాడు, ప్రభువు.
'భుజగోత్తమ' అనగా భుజగములలో శ్రేష్ఠుడు.
భగవద్గీతలో '**సర్పాణామస్మి వాసుకిః**' అనియు (10.28), మరియు '**అనంతశ్చాస్మి నాగానాం**' అనియు (10.29) భగవానుడు సెలవిచ్చెను. వాసుకి సర్పములకు రాజు, భగవద్భక్తుడు. కనుక సర్ప శ్రేష్ఠుడు. ఆదిశేషుడు (అనంతుడు) నాగజాతికి ప్రభువు. వేయి పడగలవాడు. శ్రీమహావిష్ణువునకు శయ్యగానుండి అనవరతము ఆయనను సేవించును. భగవంతునకు పరమభక్తుడు. పెక్కు పర్యాయములు ఆయనకు తోడుగా అవతారములను దాల్చి భగవల్లీలలయందు పాలు పంచుకొన్నవాడు. ఇతడు భగవానునినుండియే ఉద్భవించెను.

'భుజగోత్తమ' నామమునకు శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు ఇచ్చిన వివరణ మిగిలిన వ్యాఖ్యానాలకంటె కొంత వైవిధ్యము కలిగియున్నది. ఇందుకు వారు వ్యాకరణమునుండి, శ్రుతులనుండి పెక్కు ఆధారములు చూపారు. 'భుజ్' అనే ధాతువునకు వంగుట, మలుపు తిరుగుట (కౌటిల్యే) అనే అర్థములు ఉన్నాయి. వంగునవి, మలుపు తిరిగినవి (అనగా విస్తరించినవి) అయినవానిలో అత్యుత్తముడు గనుక భగవానుడు భుజగోత్తముడు. ఆయన చరించని ప్రదేశము, చొరరాని చోటు లేదు. పక్షులు, గాలి, విమానములు, రాకెట్లు ఏవయినా సరే. వాని చలనశక్తికి ఆధారము భగవంతుడు.

ఆయన ఆదిశేషునకు ప్రభువు. శేషాద్రిపై వెలసిన శ్రీనివాసుడు. శేషశాయియైన శ్రీరంగనాథుడు. శ్రీరామానుజులచేత నుతింపబడిన శ్రీమహావిష్ణువు.

196. హిరణ్యనాభః

బంగారమువంటి, కళ్యాణప్రదము, మనోహరమునగు నాభియందు చతుర్ముఖ బ్రహ్మకు ఆధారమైనవాడు.

ఓం హిరణ్యనాభాయ నమః

హిరణ్యమనగా బంగారము. శ్రీమహావిష్ణువు బొడ్డు బ్రహ్మకు జన్మ స్థానము. ఆ చతుర్ముఖ బ్రహ్మయే చతుర్వేద జ్ఞాని. సకల జీవరాశులను సృష్టించి, శ్రీమన్నారాయణుని సేవించు భాగ్యము కలిగినట్టి మహానుభావుడు. అట్టి బ్రహ్మకు జన్మస్థానమైన నాభి కలిగినందున విష్ణువే హిరణ్యనాభుడు.

197. సుతపాః

- అత్యుత్తమ జ్ఞానమునకు ఆలవాలము.
- మూర్తీభవించిన తపస్సు.
- బదరికాశ్రమమున తపస్సును ఆచరించినవాడు.

ఓం సుతపసే నమః

'తపస్సు' అనగా 'జ్ఞానము' అనే అర్థంలో శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. సకల విద్యలు, యోగములు, జ్ఞానము, విజ్ఞానము జనార్దనుని అధీనములోనుండును గనుక ఆయన సుతపస్వి.

శ్రీ శంకరులు మహాభారతము (12.242.4) నుండి ఉదాహరించారు. **మనశ్చేంద్రియాణామ్ చ హ్యైకాగ్ర్యమ్ పరమమ్ తపః** – మనస్సును, ఇంద్రియములను, బుద్ధిని ఏకాగ్రము చేయుటయే తపస్సు. ఇట్టి తపోసాధన భగవంతుని అనుగ్రహమువలన కలుగును. దానివలన బ్రహ్మజ్ఞానము కలుగును.

శ్రీ చిన్మయానంద గారు ఉపనిషత్తులనుండి ఉదాహరించారు. **స తపః తప్త్వా ఇదమేతదసృజత్** – ఆయన తపమాచరించెను (సంకల్పించెను). తపము చేసి ఇదంతా సృజించెను.

అన్ని బలములకంటె తపోబలము అత్యంత శక్తివంతమైనదని వివరిస్తూ ధర్మచక్రము రచయిత పెక్కు ఉదాహరణలు ఇచ్చారు. వశిష్ఠుని తపోబలము ముందు విశ్వామిత్రుని సైన్యము నిర్వీర్యమయ్యెను. పిదప తపమువల్లనే విశ్వామిత్రుడు బ్రహ్మజ్ఞానము పొందగలిగెను. తపస్సు ద్వారానే ధ్రువుడు వాసుదేవుని అనుగ్రహమును, నిశ్చల తారాస్థానమును పొందెను. ఇట్టి తపస్సు భగవానుని స్వరూపము. తపోరూపమున భగవానుడు భక్తులకు కార్యసిద్ధి, సంకల్పసిద్ధి చేకూర్చును. కనుక ఆయన సుతపస్వి. తాపసులకు దిక్కు. స్వయముగా మహాతపస్వి. బదరికాశ్రమమున నరనారాయణులుగా సుదీర్ఘకాలము భగవానుడు తపమునాచరించెను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు 'తప్' అనగా 'భరించుట' (క్లేశమును సహించుట) అనే అర్థంలో వ్యాఖ్యానించారు. తల్లి నవమాసములు బిడ్డను గర్భమున మోసి, ప్రసవ వేదన సహించి, బిడ్డకు జన్మనిచ్చి పెంచుటయే తపస్సు. సూర్యాదుల వేడిమిని భరించి, మనుష్యులకు తగినంత వేడిమిని మాత్రమే భూమికి అందజేయుట తపస్సు. ఇవన్నీ భగవంతుని మహాతపస్సులు. కనుక ఆయన సుతపస్వి.

198. పద్మనాభః

- బొడ్డున (బ్రహ్మకు జన్మస్థానము అయిన, పృథివీ సంబంధమైన) తామరపూవు కలవాడు.

- అందరి హృదయ కమలములందు వసించువాడు.

- జ్ఞానమునకు నిలయము. బహు మనోహరుడు.

ఓం పద్మనాభాయ నమః

ఈ నామము మూడుమార్లు వస్తుంది.

6వ శ్లోకము. 48వ నామము. పద్మనాభః – **అప్రమేయో హృషీకేశః పద్మనాభః అమరప్రభుః**

21వ శ్లోకము. 198వ నామము. పద్మనాభః – **హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః**

38వ శ్లోకము. 348వ నామము. పద్మనాభః – **పద్మనాభః అరవిందాక్షః పద్మగర్భః శరీరభృత్**

48వ నామమునకు – నాభియందు పద్మము గలవాడు. ఆ పద్మమునుండి బ్రహ్మ జనించెను. బ్రహ్మవలన సృష్టి కావింపబడెను – అని అర్థము చెప్పబడినది.

పార్థివం భూరి పద్మస్తు నాభావష్టదళం మహత్
య స్స హేమమయీ దివ్యాకర్ణికా మేరురుచ్యతే
యస్య నాభౌ తదుత్పత్తి పద్మనాభ స్స ఉచ్యతే
బంగారుమయమైన మేరుపర్వతము దుద్దుగా కలిగి, ఎనిమిది దళాలతో అలరారుతున్న పృథివీ సంబంధమైన పద్మమును నాభియందు గలవాడు.

ఈ 198వ నామము 'పద్మనాభః' కు శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడు అందరి హృదయ కములమునందు వసించును. నాభి అనగా మధ్యభాగము.

ధర్మచక్రము రచయిత ఇదే నామమునకు రమ్యమైన మరొక అనుభవమును పంచినారు. పద్మము వికసించినపుడు తుమ్మెదలను, తేనెటీగలను ఆకర్షించును. అలాగే పద్మనాభుడు జీవులను తనవైపు ఆకర్షించును. పద్మము అత్యంత సుందరమైన పుష్పము. అలాగే పద్మనాభుడు అందమునకు అందమైనవాడు. శ్రీలక్ష్మీదేవి శుభమంగళయై భృంగాంగనవలె పులకభూషణమైన హరి శరీరమును ఆశ్రయించును. ఆయన సీతాముఖాంభోరుహ చంచరీకుడు. రుక్మిణీవల్లభుడు. గోపీజనప్రియుడు. శ్రీనివాసుడు. శ్రీవరాహమూర్తి. అందమునకు రూపము. శ్రీ కంబ మహాకవి **'తాళ్ కందాట్ తాళె కందాట్'** అని శ్రీరాముని చక్కదనమును వర్ణించెను. అట్టి పద్మనాభుని సౌందర్యము భక్తులను ఆనందాంతరంగులనొనర్చి,

సన్మార్గమున నడిపి, ముక్తిని ప్రసాదించును. ఆయన ప్రహ్లాద మానస సరోవరమున వికసించిన శ్రీనారసింహమూర్తి. పద్మనాభుడు. పద్మావతీనాధుడు.

శ్రీ సత్యదేవోవాసిష్ఠగారు ఇదే నామమును మరొక దృక్పథమునుండి వ్యాఖ్యానించారు. 'పద్మము' అనగా 'జ్ఞానము' అని కూడ అర్థము. **పద్యతే జ్ఞాయతే అనేన పద్మమ్ జ్ఞానమ్.** సకల విద్యలకు, సర్వ జ్ఞానమునకు కేంద్రము, నిలయము అయినందున, అఖిల విద్యలు ఆయన అధీనములో నున్నందున ఆయనను పద్మనాభుడు అని నుతింతురు.

199. ప్రజాపతిః

సకల జీవులకును ప్రభువు.

ఓం ప్రజాపతయే నమః

8వ శ్లోకము. 70వ నామము. ప్రజాపతిః – **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

21వ శ్లోకము. 199 వ నామము. ప్రజాపతిః – **హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః**

తద్ పద్మోద్భవ ప్రభృతానామ్ ప్రజానామ్ పతిః – శ్రీహరియే సకల ప్రజలకును, పద్మ సంభవుడైన బ్రహ్మకును అధిపతి. కాలముతో పునరావృతమగు సృష్టి, లయ కార్యములు పద్మనాభుని అధీనములు. నైమిత్తిక కృషిలో సృష్టింపబడిన పరబ్రహ్మ మొదలైనవారికి రాజైనవాడు ప్రజాపతి.

నైమిత్తి కేత్రు యే సృష్టాః ప్రజా బ్రహ్మముఖాస్తథా
తేషాం చైవ పతిస్స్వామీ ప్రజాపతిరిహోచ్యతే

'పతి' అనగా తండ్రి అని కూడ చెప్పవచ్చును. సకల జీవరాశులును ఆయననుండియే, బ్రహ్మద్వారా సృజింపబడినవి గనుక హిరణ్యనాభుడే ప్రజాపతి. ప్రజాపాలనార్థము, ధర్మరక్షణార్థము ఆయన అవతరించును.

గీత 9.17 – **పితామహస్య జగతః**

గీత 11.43 – **పితాసి లోకస్య చరాచరస్య**

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాధారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగం
లక్ష్మీకాంతం కమల నయనం యోగిహృద్ధ్యానగమ్యం
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైక నాధమ్

తులసి (వనమాల) ప్రాశస్త్యము

http://www.vedics.net "Ramanuja Darshan" Vol-3 Issue-1 (Jan-Mar 2005)

"రామానుజ దర్శనము"లో శ్రీ జి. శేషాద్రి అయ్యంగార్ రచన నుండి గ్రహించినది.

శ్రీమహావిష్ణువు వనమాలను, పంచాయుధములను ధరించియుండును. తులసిమాల (వనమాల) శ్రీవాసుదేవుని అసాధారణ చిహ్నములలో ఒకటి. శ్రీమన్నారాయణునికి తులసితో గల అనుబంధము ప్రగాఢమైనది. ప్రతి సాలగ్రామ పూజ (విష్ణుపూజ)యందును తులసీదళములు సమర్పింపబడును. తులసి ప్రాశస్త్యమును గూర్చి కొన్ని ఆసక్తికరమైన విషయములు.

- ఇంటిలో తులసిమొక్కను పెంచుటయే శ్రీనివాసుని అర్చించుటకు సమానమగును.
- తులసియున్నచోట విష్ణువు వసించును.
- ఉదయమే తులసిని దర్శించినట్లయితే, అప్పటివరకు చేసిన పాపములు నశించును.
- ఏకాదశి ఉపవాసానంతరము ద్వాదశి పారణ తులసి తీర్థముతో ఆరంభింతురు.
- చాలా గృహములందు తులసిమాతను ప్రత్యక్ష మహాలక్ష్మిగా అర్చింతురు.
- తులసీజలముతో అర్పించిన దానము ఫలవంతమగును.
- శ్రీమద్భాగవతములో తులాభార సందర్భమున సత్యభామాదేవి తన సకలసర్వాభరణములతోను ఆ జగన్నాధుని తూచలేకపోయినది. రుక్మిణీదేవి తులసిదళముతో భగవానుని భారమును సమమొనర్చినది.
- త్రిపద్ రామాయణమున తులసి వైకుంఠమును గురించిన ప్రస్తావన యున్నది.
- శ్రీ నమ్మాళ్వార్ గారు తమ 'తిరువైమొళి'(4.2)లో తులసి మహాత్మ్యమును విపులముగా కీర్తించారు. శ్రీమన్నారాయణుని పాదసన్నిధిలో తులసివలె తరించవలెనని ఆకాంక్షించారు.
- శ్రీ తిరుమంగైయాళ్వారువారు తమ 'సిరియ తిరుమండల్' (58-59)లో ఆ భగవంతుని పదములచెంతనున్న తులసిదళము కొరకు ఆక్రోశించారు.
- శ్రీ అళవందార్ (యమునాచార్యులు)గారు తమ స్తోత్రరత్నమున భగవంతుని '**లసత్తులస్యా వనమాలయోజ్జ్వలమ్**' అని వర్ణించారు. నాలాయిర దివ్య ప్రబంధములో అందరు ఆళ్వారులు తమ పాశురములలో తులసిని అర్చించారు.
- గ్రీకు తత్వవేత్త అయిన అరిస్టాటిల్ మహాశయుడు (క్రీ. పూ. 384-322) తులసిమొక్కకు 'Sanctum Basil' అని నామకరణము చేసెను. ఆయన 'Sanctum' అనగా 'పవిత్ర' అనే పదమును మరే మొక్కకు వాడలేదు. ఆయుర్వేదములో తులసికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది.
- శ్రీ త్యాగరాజస్వామివారు తులసితల్లిని ఆరు కీర్తనలలో ఆరాధించారు. తులసిని జగజ్జననియని, సకల తీర్థములకు స్వర్గమని కీర్తించారు. బ్రహ్మాదులు కూడ తులసితో అర్చించి శ్రీమన్నారాయణుని ప్రసన్నము చేసికొనిరి. శ్రీరాముని ఉరమున, కరమున, ముఖమున, శిరమున, భుజమున, నేత్రమున, చరణయుగమున తులసి వెలుగొందుచున్నది. తులసియే భగవంతుని శరీరము. తురీయ బ్రహ్మము. శ్రీహరికి పరమ ప్రియము. అండాళ్ తల్లిని శ్రీరంగనాథునితో కలిపిన నేస్తము.
- పద్మపురాణములో ఇలా ఉన్నది – తులసి మొక్కలు ఉన్న ఇంటిలోనికి ప్రవేశించడానికి యముడు సాహసింపడు.

తులసీ స్తోత్రము

చిత్రం. మళయాళం వికీపీడియానుండి.

ఓం జగద్ధాత్రీ నమస్తుభ్యం విష్ణోశ్చ ప్రియవల్లభే | యతో బ్రహ్మాదయో దేవాః సృష్టి స్థిత్యంత కారిణీ ||
నమస్తులసీ కళ్యాణీ నమో విష్ణుప్రియే శుభే | నమో మోక్షప్రదే దేవి నమ స్సంపత్ప్రదాయికే ||
తులసీ పాతుమా నిత్యం సర్వాపద్భ్యోపి సర్వదా | కీర్తితావాపి స్మృతాపి పవిత్ర యతి మానవమ్ ||
నమామి శిరసా దేవీం తులసీం విలసత్తమమ్ | యాదృష్ట్వా పాపినో మర్త్యా ముచ్యంతే సర్వకిల్బిషాత్ ||
తులస్యా రక్షితం సర్వం జగదేకచ్చరాచరమ్ | యావినిర్హంతి పాపాని దృష్ట్వావా పాపిభిర్నరైః ||
నమస్తులస్యతి తరాం యస్యై బద్ధాంజలిం కదా | కలయంతి సుఖం సర్వం స్త్రీ యో వైశ్యాస్తథాపరే ||
తులస్యానాపరం కించిద్దైవతం జగతీతలే | యయా పవిత్రితో లోకో విష్ణుసంగేన వైష్ణవః ||
తులస్యాః పల్లవం విష్ణోః శిరస్యా రోపితం కలౌ | ఆరోపయతి సర్వాణి శ్రేయాంసి వరమస్తకే ||
తులస్యాం సకలదేవా వసంతి సంతతం యతః | అతస్తామర్చ యేల్లోకే సర్వాన్దేవా న్సమర్చయన్ ||
నమస్తులసి సర్వజ్ఞే పురుషోత్తమవల్లభే | పాహిమాం సర్వపాపేభ్య సర్వసంపత్ప్రదాయికే ||
ఇతి స్తోత్రం పూరాగీతం పుండరీకేణ ధీమతా | విష్ణుమర్చయతాం నిత్యం శోభనైస్తులసీదళైః ||

అమృత్యుః సర్వదృక్సింహః సంధాతా సంధిమాన్ స్థిరః |
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా || (22)

200. అమృత్యుః

మరణము, నాశనము లేనివాడు.

ఓం అమృత్యవే నమః

మృత్యుః యస్య న అస్తి ఇతి అమృత్యుః – ప్రతి వస్తువునకు జననము (ప్రారంభము), వృద్ధి, క్షీణత, వ్యాధి, మరణము (అంతము) అనే 5 దశలు తప్పవు. పుట్టినదెల్ల గిట్టక మానదు. కాని భగవంతుడు అజుడు (పుట్టుక లేనివాడు), అమరుడు, అమృత్యుడు, షడ్భావ వికార శూన్యుడు.

ధర్మ చక్రము రచయిత వ్యాఖ్య - ఈ నామ స్మరణమునందు మనము ఆత్మ (జీవాత్మ) నాశనము లేనిదని గుర్తించవలయును. కనుక నశ్వరమగు శరీరమునే జీవునిగా తలంపక, పరమాత్మను ధ్యానించి అమృతత్వమును (జనన మరణ చక్రమునుండి ముక్తిని) సాధింపవచ్చును.

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ
ఓం శాంతిః శాంతిః శాంతిః

201. సర్వదృక్

సమస్తమును చూచుచుండువాడు.

ఓం సర్వదృశే నమః

శ్రీ వాసుదేవుడు సర్వాంతర్యామియై సకల భూతములందును, సకల ప్రదేశములందును సమస్తమును సర్వదా చూచుచుండును. ఆయన పట్ల భక్తి కలిగినవారికి, భగవంతుని నిరసించినవారికి, దైవారాధన పట్ల ఆసక్తి లేనివారికి – అందరికీ వారివారి బుద్ధి, కర్మల అనుసారముగా తగు ఫలితములను ప్రసాదించును.

ధర్మచక్రము రచయిత ఒక సర్వ సాధారణమైన, కాని ప్రాముఖ్యత కలిగిన సత్యమును పదే పదే గుర్తుంచుకొనవలెనని నొక్కి వక్కాణించారు. మనము మనస్సులోను, మాటలలోను, చేతలలోను సదాచారమును ఎల్లప్పుడూ పాటించి తీరవలెను. ఎవరూ చూడడములేదని, ఎవరికీ తెలియదనీ, ఏమీ పరవాలేదనీ అనుకోవడం మూర్ఖత్వము. శ్రీమన్నారాయణుడు సర్వస్థితుడు. సర్వాంతర్యామి. సర్వసాక్షి. సర్వదృక్కువు. సర్వేశ్వరుడు.

202. సింహః

- సింహము.
- పాపములను నశింపజేయువాడు.

ఓం సింహాయ నమః

22వ శ్లోకము. 202వ నామము. సింహః – **అమృత్యుః సర్వదృక్ సింహః సంధాతా సంధిమాన్ స్థిరః**
52వ శ్లోకము. 489వ నామము. సింహః – **గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – మనిషి, సింహముల రూపమును ధరించినందున శ్రీహరి 'సింహము' అనే నామముతో స్తవనీయుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **హినస్తి ఇతి సింహః, హినస్తి స్మరణ మాత్రేణ సమస్త పాపాన్ ఇతి సింహః** స్మరించినందువల్లనే సకల పాపములను నాశనము చేయువాడు 'సింహః'. ఇక్కడ పాణిని వ్యాకరణ సూత్రము (6.3.109) ప్రకారము అక్షరములను తారుమారు చేయుటవలన 'హింస' అను పదము 'సింహ' యగును. (పృషోదరాదీని యతోపదిష్టమ్)

శ్రీ చిన్మయానంద 'సింహము' అనే సామాన్య అర్థములోనే వ్యాఖ్యానించారు. సింహము మృగరాజు. దానిని చూచినంతనే అడవిలోని జంతువులు పలాయనమగును. భగవంతుని నామస్మరణము మాత్రమున బుద్ధి అనే అరణ్యములోని క్రూర, మూర్ఖ, కామములనే దుష్టజంతువులు పారిపోవును.

గీత 10.30 – **మృగాణాంచ మృగేంద్రోఽహమ్** – జంతువులలో నేను మృగరాజును (సింహమును).

ధర్మచక్రము రచయిత – ఈ పుణ్యనామ స్మరణము వలన మనకు మనసా, వాచా, కర్మణా మంచిని ఆచరించుటకు, చెడును త్యజించుటకు అవుసరమగు బలము, ధైర్యము లభించును. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములను దూరముగా నెట్టివేయుటకు, చెడు ఆలోచనలను అణచివేయుటకు, చెడు మాటలు మానివేయుటకు, చెడు కార్యములు చేయకుండుటకు ఎంతో బలము, ధైర్యము కావలెను. ఇట్టి ధైర్య, స్థైర్యములు నరసింహ రూపుడైన, సింహ నామధేయుడైన నందకిశోరుని అనుగ్రహమున మనకు లభించును.

శ్రీయుత మూర్తి! పురుష సింహమ! – అని రుక్మిణీదేవి తన రాయబారమున యదునాధుని సంబోధించినది.

ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖమ్
నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుమ్ నమామ్యహమ్

మాతర్నమామి కమలే కమలాయతాక్షి
శ్రీ విష్ణుహృత్కమల వాసిని విశ్వమాత
క్షీరోదజే కమల కోమల గర్భగౌరి
లక్ష్మీ ప్రసీద సతతం నమతాం శరణ్యే

203. సంధాతా

- భక్తులను తనలో కలుపుకొనువాడు.
- జీవులను వాని కర్మఫలములకు ముడివేయువాడు (అనుసంధానించును).

ఓం సంధాత్రే నమః

సంధత్తా ఇతి సంధాతా – కలుపువాడు, సమన్వయపరచువాడు.

మొదటి భావము (భక్తులను తనలో కలుపుకొనువాడు సంధాత) శ్రీ భట్టుల వ్యాఖ్యానములో ప్రహ్లాదుని ఉదాహరణగా చెప్పబడినది. ప్రహ్లాదుడు నిరంతర హరిచింతనామృత పాన మత్తుడు. రాగవిద్వేష

రహితుడు. మృదు వినయశీలి. అట్టి భక్తునకు ఆపన్నత కలుగకుండ, అతనిమాట వొల్లుపోకుండా కాచుటకై నరహరిగా అవతరించిన శ్రీహరి తన భక్తునకు సాయుజ్యమును ప్రసాదించెను.

శ్రీ శంకరుల వ్యాఖ్య భగవంతుని కర్మఫల ప్రదాతృత్వమును సూచించును. కర్మఫలములనధిగమించుట సాధ్యము కాదు. కనుక భగవంతుని పరమాత్మగా నెఱిగి, ఆప్తునిగా ఆయనను శరణుజొచ్చి, దుష్టకర్మలను త్యజింపవలెను.

నిరుక్తిలోని వర్ణన – **ప్రహ్లాదాద్యైః సంధాతా సంశ్లేష కరణాచ్చ సః.**

ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుక శౌనక హృన్నివాస
భక్తానురక్త పరిపాలన పారిజాత
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్

204. సంధిమాన్

భక్తులందు ఐక్యమై యుండువాడు.

ఓం సన్ధిమతే నమః

'సంధి' అనగా కలయిక. భగవంతుడు భక్తులందు కలిసిపోవును గనుక ఆయన 'సంధిమాన్' అని శ్రీ భట్టుల వివరణ. హరిదాసులను హరిమూర్తులుగా గ్రహింపనగును.

నిరుక్తిలో ఇలా చెప్పారు – **ప్రహ్లాదాద్యైః నిత్య సంధిః యస్య స్యాత్ సంధిమాన్ స్మృతః** – ప్రహ్లాదాదులయందు ఐక్యమైయున్నందున 'సంధిమాన్' అనబడును.

205. స్థిరః

- భక్తుల పట్ల బాంధవ్యము నిలకడగా కలిగినవాడు.
- నిశ్చలుడు, నిర్వికారుడు, నిత్యుడు.

ఓం స్థిరాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అపచారేఽపి అచల్యత్వాత్ సంధానే స్థిర ఉచ్యతే.** భక్తులు అపచారములొనర్చినను, వారిపట్ల కరుణతో మన్నించి, వారియెడల వాత్సల్యానురాగములు ఏమాత్రము చెదరని ప్రజాపతి. ఆ శేషశైల శిఖామణి మన అశేష అజ్ఞాన దోషములను క్షమించి కొండలంత వరములు క్రుమ్మరించును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సదైక రూపత్వాత్ స్థిరః.** ఎల్లప్పుడూ ఒకే రూపంతో ఉండేవాడు. ఆయన జన్మ రహితుడు. ఆద్యంత రహితుడు. దేశకాలములతో మార్పుచెందడు. ఆయనే నిత్యము. సత్యము. నిరంతరము. పరమపదము. స్థిరము. తిరువేంకటగిరిపై మోపిన పాదము. పరబ్రహ్మము.

206.అజః

- పుట్టుక లేనివాడు (స్తంభమునుండి అవతరించిన శ్రీనృసింహమూర్తి).
- అడ్డంకులను తొలగించువాడు.
- భక్తుల హృదయములందు చరించువాడు.
- భక్తుల మనములందలి అజ్ఞానమును హరించువాడు.
- సకల శబ్దములకు మూలము ('అ'కారము)

ఓం అజాయ నమః

ఈ పవిత్ర నామము ఈ స్తవరాజములో మూడు పర్యాయములు (96వ, 206వ, 524వ నామములుగా) స్తుతించబడినది.

11వ శ్లోకము. 96వ నామము. అజః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిరచ్యుతః**
22వ శ్లోకము. 206 వ నామము. అజః – **ఆజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా**
11వ శ్లోకము. 524వ నామము. అజః – **అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః**

పుట్టుక లేనివాడు. **న జాయతే ఇతి అజః** – ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన శృతి ప్రమాణము - ఋగ్వేదము 1.81.5 – **న జాతో న జనిష్యతే.** ఆయన ఇంతకుముందు జన్మింపలేదు. ఇకముందు జన్మింపబోడు.

న హి జాతో న జాయేఽయం న జనిష్యతే కదాచన
క్షేత్రజ్ఞః సర్వభూతానాం తస్మాదహం అజస్మృతః - మహాభారతము శాంతిపర్వము 330.9
నేను పూర్వము జన్మించియుండలేదు. ఇప్పుడు జన్మించినవాడను కాను. భవిష్యత్తులో జన్మించను. నేను సర్వభూతములందును క్షేత్రజ్ఞుడను. కనుక నన్ను 'అజుడు' అని యందురు.

శ్రీ భట్టుల వివరణ – భగవంతుడు శ్రీనారసింహమూర్తియై స్తంభమునుండి ఆవిర్భవించెను. తక్కిన జీవజాలమువలె ఆయన జన్మింపడు.

'అజ్' అనే ధాతువునకు 'చలనము','తొలగించుట' అనే అర్థాలు కూడా ఉన్నాయి (**అజౌ గత క్షేపణయోః**) ఈ భావములో మరికొన్ని వ్యాఖ్యానాలు మనకు లభించాయి.

శ్రీ భట్టులు – పరమపద ప్రాప్తికై తపించు ముముక్షువుల మార్గమునుండి అన్ని విఘ్నములను తొలగించి అనుగ్రహించువాడు భగవంతుడు. అజుడు.

శ్రీ శంకరులు – **అజతి గచ్ఛతి క్షిపతి ఇతి వా అజః**. భక్తుల హృదయమున ప్రవేశించి చరించువాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – మన అజ్ఞానమును తొలగించువాడు. తన భక్తుల చెంతకు చేరి, వారిని తన పరంధామమువైపు నడిపించువాడు.

ఇంకా – **అకార వాచ్యతయా జాతః అజః** – 'అ'కార వాచకముచే తెలుపబడినవాడు అజుడు. అన్న భావములో కూడ ఈ నామమునకు వ్యాఖ్యానాలు ఉన్నాయి.

207.దుర్మర్షణః

ఎదురు లేనివాడు. అడ్డు లేనివాడు.

ఓం దుర్మర్షణాయ నమః

దుష్కరమ్ మర్షణమ్ అస్య ఇతి దుర్మర్షణః. ఆయనను ఏ శత్రువులైనా అడ్డుకొనలేరు. ఎంతటివారైనా జయించలేరు. కాలము గాని, ప్రాంతము గాని, బలము కాని – ఏదీ ఆయనను నిలువరించజాలదు. ఆయన శాసనమును అతిక్రమించదగదు. కనుకనే ఆయన దుర్మర్షణుడు. దుష్ట శిక్షకుడు. దురితాపహారి.

శ్రీ చిన్మయానందగారు ఇదే అర్థమును మరొక చక్కని దృక్పథములో వ్యక్తీకరించారు – మనము ఇంద్రియ వాంఛలకు దాసులమై సన్మార్గమును తప్పవచ్చును. సంసార చక్రమున మత్తులమై చరింపవచ్చును. కాని జన్మలనెత్తి, ఎత్తి, తుదకు విష్ణుపద పథగాములుగా కాక తప్పదు. క్రిమికీటకాది జన్మలలో ఆధ్యాత్మిక సాధనలకు అవకాశము లేకపోవచ్చును. కాని అనేక జన్మల అనంతరము బుద్ధి కలిగి, సద్గురు కృప లభించి, సాధననవలంబించి, శ్రీహరికి శరణాగతులమై సచ్చిదానంద పరబ్రహ్మమునకై తపించెదము. వేరు దారి లేదు. వేరు నాధుడు లేడు.

ఈ నామమునకు మూల ధాతువు 'మృష్' - సహనే - సహించుట. 'దుర్మర్షణుడు' అనగా (శత్రువులకు) దుస్సహమైనవాడు. శ్రీమన్నారాయణుడు శతకోటి సూర్యాధిక తేజోమూర్తి. అనంత బల సంపన్నుడు. అప్రమేయుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారి వివరణ – ప్రకృతిలోని ప్రతిశక్తికిని మరొక శక్తి భగవానుని అనంత శక్తిని గుర్తు చేయుచునే యుండును. సూర్యకాంతి ముందు చంద్రుని వెన్నెల వెలవెల బోవును. చంద్రునికాంతియందు తారల మెరుపులు క్షీణించును. నిప్పును నీరు ఆర్పివేయును. నీటిని అగ్ని ఆవిరి చేయును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారి మరొక వివరణ – 'మర్షితుమ్' అనగా 'జ్ఞాతుమ్' - తెలిసికొనుట - అని అర్థము గలదు. ఆయనను తెలిసికొనుట సులభము కాదు. సాధన, దీక్ష, భక్తి, గురుకృప, భగవదనుగ్రహము కావలెను. **దుఃఖేన మర్షితుమ్ శక్యః దుర్మర్షణః.** శ్రమతో మాత్రము తెలియబడువాడు దుర్మర్షణుడు.

ధర్మ చక్రము రచయిత వ్యాఖ్య – దుష్టులైన అసురులను వినాశనమొనర్చువాడు (మృ - మృత్యు - చంపుట) గనుక శ్రీహరి దుర్మర్షణుడు. ఈ భావమును మనసులోనుంచుకొని ఈ నామమును స్మరించినట్లయితే భక్తుల మనసునుండి దురాలోచనలు దూరమై, మనసు నిర్మలమై, భక్తి నిశ్చలమై, దీక్ష సత్ఫలితములనిచ్చును. కిరాతుడైన వాల్మీకి రామనామ స్మరణము వలన ఋషియై ఆదికావ్యస్రష్టయై మోక్షమార్గ దర్శకుడయ్యెను.

కూజంతం రామరామేతి మధురమ్ మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్

యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్ తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్
బాష్పవారి పరిపూర్ణలోచనమ్ మారుతిమ్ నమత రాక్షసాంతకమ్

208. శాస్తా

- బోధించువాడు. జగద్గురువు.
- శాసించువాడు. భక్తులమార్గమును అవరోధించువారిని శిక్షించువాడు.

ఓం శాస్త్రే నమః

ఈ నామమునకు మూల ధాతువు 'శాసు' - అనుశిష్టౌ - బోధించుట, ఉపదేశించుట, పాలించుట, సరిచేయుట. 'శాస్త్రము', 'శిక్ష' అను పదములు ఇదే ధాతువునుండి వ్యుత్పన్నములు.

శ్రీకృష్ణభగవానుడు గురువులకు గురువు. సమస్త జ్ఞానమునకు మూలము. వేదవిదుడు. వేదవేద్యుడు. తల్లిదండ్రుల రూపమున, గురువుల రూపమున, శృతుల రూపమున, స్మృతుల రూపమున విద్యలన్నింటిని బోధించును. అంతర్యామియై విద్యలను బుద్ధిలో నిలుపును. భక్తుల మార్గమునకు అడ్డుపడువారికి తగు గుణపాఠము చెప్పును.

గోపికానాం కుచద్వంద్వ కుంకుమాంకిత వక్షసమ్
శ్రీ నికేతం మహేష్వాసం కృష్ణం వందే జగద్గురుమ్.

209. విశ్రుతాత్మా

- జగమంతయు విస్మయముతో ఎవరి అద్భుత లీలా మహాత్మ్యములను గానము చేయునో ఆ దేవదేవుడు. సుప్రసిద్ధమైన చరితము గలవాడు.
- సత్యము, జ్ఞానము, పరబ్రహ్మము – ఇత్యాది విశిష్టమగు నామములచే స్తుతింపబడు అనంతగుణ సంపన్నుడు.
- వివిధ స్వరూపములుగా కీర్తింపబడు ప్రజాపతి.
- విశేష, షడ్గుణ్య పరిపూర్ణ, పరమాత్మ.

ఓం విశ్రుతాత్మనే నమః

విస్మయేన స్మృతం దేవైః సైంహం యస్యాపదానకమ్
శీలం తైర్విశ్రుతాత్మానః మహత్కీర్తి ప్రదో మనుః

దేవతలందరూ ఆశ్చర్యముగా చెప్పుకుంటున్నటువంటి శ్రీనృసింహావతారములో అద్భుత వ్యాపారములు చేసినవాడు. ఈ నామస్మరణము మహత్కీర్తిని ప్రసాదిస్తుంది. ఓం విశ్రుతాత్మనే నమః.

ఈ నామమునందు 'వి', 'శ్రుత', 'ఆత్మ' అనే మూడు ధాతువులున్నాయి. 'వి' ధాతువునకు వ్యాఖ్యాతలు చెప్పిన అర్థాలనుబట్టి మొదటి మూడు భావములను వివరింపవచ్చును.
శ్రీ భట్టులు – 'వి' – విస్మయేన – అబ్బురముగా.
శ్రీ శంకరులు – 'వి' – విశేషణ – ప్రత్యేకమైన.
శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'వి' – వివిధైః – పెక్కు రూపములతో.
రెండవ ధాతువు – 'శ్రు' – శ్రవణే – వినిపించుట, స్తుతించుట, కీర్తించుట, పేరు కలిగియుండుట.
మూడవ ధాతువు – 'ఆత్మ' – గుణము, స్వరూపము, నామము, సర్వాంతర్యామియైన పరమాత్మ.

విశ్రుతాత్మ – అందరు విస్మయముతో అద్భుతమంది కీర్తించు లీలావినోది. సుప్రసిద్ధమైన శ్రీనృసింహమూర్తిగా ఆయనను దేవతలు స్తుతిస్తారు. ఆయన గోవర్ధనగిరినెత్తినవాడు. బ్రహ్మచే గోవులు, గోపాలకులు దాయబడగా తానే వేరుసృష్టి చేసిన నందనందనుడు. కుచేలుని అటుకులతో సంతుష్టుడైనవాడు. రెండడుగులతో బ్రహ్మాండము నతిక్రమించినవాడు. తండ్రిమాటకై వనవాసము చేసినవాడు. ఆపదమ్రొక్కులవాడు.

విశ్రుతాత్మ – విశేష నామములతో శ్రుతులందు స్తుతింపబడినవాడు. ఆయనే జ్ఞానము, జ్ఞేయము, మార్గము, మార్గదర్శి, మార్గవర్తి, గమ్యము. నరుడు. నారాయణుడు. శ్రీధరుడు. శ్రీనివాసుడు. వేదము. వేదవిదుడు. వేదవేద్యుడు. పరమపదము. వాసుదేవుడు. రాముడు. శివుడు. వామనుడు. త్రివిక్రముడు.

విశ్రుతాత్మ – వివిధ స్వరూపములుగా, సూర్యునిగా, చంద్రునిగా, తల్లిగా, తండ్రిగా, గురువుగా, అర్చామూర్తిగా, అంతర్యామిగా, ధర్మముగా, జ్ఞానముగా, తపముగా, ప్రభువుగా, సర్వముగా, సర్వేశ్వరునిగా వ్యక్తమగువాడు.

తదేవాగ్ని స్తదాదిత్య స్తద్వాయు స్తదుచంద్రమాః

తదేవ శుక్రమ్ తద్ బ్రహ్మ తాऽऽపః స ప్రజాపతిః – యజుర్వేదము 32.1

ఇంకా అయనను గానము, అర్చనము, వేదపఠనము వంటి బహుసాధనములద్వారా నుతింపవచ్చును గనుక ఆయన విశ్రుతాత్మ.

విశ్రుతాత్మ – **విశేషేణ శ్రుతః (జ్ఞాతః) ఆత్మా యేన స విశ్రుతాత్మా** – జీవాత్మకంటె భిన్నమై, సర్వజ్ఞుడై, సర్వశక్తుడై, షడ్గుణ్యపరిపూర్ణుడై, కర్మాదిసంగరహితుడైన పరమాత్ముడు. పురుషోత్తముడు.

చిన్నతిరుపతిలోని శ్రీనృసింహస్వామి శిల్పం.

210. సురారిహా

దేవతల శత్రువులను సంహరించువాడు.

ఓం సురారిఘ్నే నమః

సుర-అరి-హా – దేవతల శత్రువులను అంతముచేయువాడు 'సురారిహా'. హిరణ్యకశిపుని సంహరించిన శ్రీనృసింహావతారమును ఈ నామవివరణలో శ్రీ భట్టులు ప్రస్తావించారు. ఎన్ని వరములు ప్రోగుచేసుకొన్నా గాని, ఎంత బలము కూర్చుకొన్నాగాని ఆ సురారికి శ్రీనరహరి చేత మరణము తప్పలేదు.

శ్రీ చిన్మయానంద – ఈ నామ స్మరణ ధ్యానములవలన మన దీక్షకు అడ్డుపడు అంతశ్శత్రువులు నశించును. శారీరిక రాక్షస వాంఛలు, అహంకార భూతములు, కామక్రోధాది పిశాచములు దూరముగా పారిపోవును. ముముక్షువుల పురోగతికి శత్రువులైన అరిషడ్వర్గములను, అహంకారమును హరించును గనుక ఆయన సురారిఘ్నుడు. పాపములను, తాపములను నాశనము చేయు శ్రీనారసింహుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు – **పాహి నో అగ్నే రాక్షసః ....** అని మొదలయ్యే ఋగ్వేద మంత్రము (1.36.15)ను ప్రస్తావిస్తూ, ఈ మంత్ర జపము వలన సకల దుష్టశక్తులు తొలగిపోవుట తమ స్వానుభవంలో జరిగిందని తెలియజేశారు.

ఈ శ్లోకములోని అన్ని నామములను – **అమృత్యుః, సర్వదృక్, సింహః, సంధాతా, సంధిమాన్, స్థిరః, అజః, దుర్మర్షణః, శాస్తా, విశ్రుతాత్మా, సురారిహా** – నామములను శ్రీనృసింహావతార గుణ వైభవ పరముగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

పోతన భాగవతము –

నీకు దిక్కెవ్వరు? బలమెవ్వరు? అని ప్రశ్నించిన హిరణ్యకశిపునకు ప్రహ్లాదుడిచ్చిన సమాధానము.

బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకును
బలమెవ్వండట్టి విభుడు బలము సురేంద్రా!

దిక్కులు నే కాలముతో నే
దిక్కున లేకుండ గలుగు దిక్కుల మొదలై
దిక్కు గల లేనివారికి
దిక్కెయ్యది యదియు నాకు దిక్కు మహాత్మా!

శ్రీ వేదాంత దేశికుల కామాశికాష్టకము

RAMANUJA DARSHANAM. A VEDICS JOURNAL. *Volume 3 Issue 2: June – Aug 2005*

Vedics Foundation* http://www.vedics.org. *(old web site:* http://www.vedics.net *not working now). **శ్రీ కళియర్ నారాయణన్ గారి వ్యాసమునకు అనువాదము.**

కాంచీపురములో వేళుక్కాయి దివ్యదేశములో చక్కని శ్రీనృసింహమందిరము ఉంది. 'వేళుక్కాయి' అనగా ఎంచుకొన్న నివాసస్థలము. ఈ నృసింహ స్వామిని స్తుతిస్తూ స్వామి వేదాంత దేశికులవారు 'కామాశికాష్టకము'ను రచించారు (కామ – కోరుకొన్న, ఆశిక – నివాసము). ఈ నృసింహమూర్తి వేదవేదాంత వందితుడు. త్రినేత్రుడు. భక్త రక్షకుడు. దుష్ట శిక్షకుడు. వరదుడు.

శ్రుతీనాముత్తరమ్ భాగమ్ వేగవత్యాశ్చ దక్షిణమ్
కామాద్ అధివసన్ జీయాత్ కశ్చిదద్భుత కేసరి

వేదముల ఉత్తర భాగమున (ఉపనిషత్తులలో) కీర్తింపబడిన దేవదేవుడు అద్భుత కేసరి రూపమును దాల్చి వేగవతి (నది) దక్షిణ భాగమున ఉండుటకు ఇచ్ఛగించినాడు.

తపనేంద్వాగ్ని నయనః తాపానపచినోతు నః
తాపనీయ రహస్యానామ్ సారః కామాసికా హరిః

కామాసికా హరి 'నృసింహ తాపనీయ ఉపనిషత్తు'లో చెప్పబడిన విధమున సూర్య, చంద్ర, అగ్ని నయనములు గలవాడు (త్రినేత్రుడు). తాపత్రయములను హరించువాడు. (ఆధ్యాత్మిక తాపము, అధిభౌతిక తాపము, అధిదైవిక తాపము – వీనిని తాపత్రయములు అందురు).

ఆకాంఠమ్ ఆది పురుషమ్ కంఠీరవమ్ ఉపరికుంఠితారాతిమ్
వేగోప కంఠ సంగాత్ విముక్త వైకుంఠ బహుమతిమ్ ఉపాసే

వైకుంఠమును వదలివచ్చి వేళుక్కాయిలో వెలసిన ఆదిపురుషునకు, నరహరి మూర్తికి, దేవదేవునకు పెక్కు వందనములు.

బంధుమ్ అఖిలస్యజంతోః బంధుర పర్యంక బంధ రమణీయమ్
విషమ విలోచనమీడే వేగవతీ పులిన కేళి నృసింహమ్

నృసింహదేవుడే సకల జీవులకును నిజమైన బంధువు. ఆయన పర్యంక బంధము (ఒక యోగముద్ర) యందు ఆసీనుడై యున్నాడు. భక్తుల యోగక్షేమ రక్షణయందు నిమగ్నుడై యున్నాడు.

స్వస్థానేషు మరుద్గణాన్ నియమయన్ స్వాధీన సర్వేంద్రియః
పరయంక స్థిర ధారణా ప్రకటిత ప్రత్యన్ ముఖావ స్థితిః
ప్రాయేణ ప్రణిపేదుషామ్ ప్రభురసౌ యోగమ్ నిజమ్ శిక్షయన్
కామానాప్నుదాత్ అశేష జగతామ్ కామాసికా కేసరి

వేళుక్కాయి నరకేసరి పశ్చిమ ముఖుడై పర్యంక స్థిరముద్రలో యోగమగ్నుడైనాడు. ఆయన సర్వేంద్రియములను నిగ్రహించిన హృషీకేశుడై, ముముక్షువులందరికిని శ్రీమన్నారాయణ ప్రాప్తి కలిగించు యోగసాధనమును వ్యక్తపరచుచున్నాడు.

వికస్వర నఖ స్వరుక్షత హిరణ్య వక్షస్థలే
నిరర్గళ వినిర్గళద్రుధిర సింధు సంధ్యాయితాః
అవంతు మదనాశికా మనుజ పంచ వక్త్రస్య మామ్
అహమ్ ప్రథమికామితః ప్రకటితాహవా భావః

హిరణ్యకశిపుని వక్షస్థలమును చీల్చుటవలన రక్తము ధారలుగా కారినందున ఎఱ్ఱబడిన వజ్రనఖములతో శోభించు వరదాభయప్రదమగు హస్తము మన సకల భయములను నశింపజేయును.

సటాపటల భీషణే శరభసాట్టహాసోద్భటే
స్ఫురత్క్రుధిప్రిస్ఫుటాద్ భృకుటికేపి వక్త్రేకృతే
కృపాకపట కేసరిన్ దనుజ డింభ దత్తస్తనా
సరోజ సదృశా ధృశా వ్యతిబిషజ్య తేవ్యాజ్యతే

హిరణ్యకశిపుని యపచారములవలన కోపించిన స్వామి ముఖమున భృకుటి ముడివడి, భీకరగర్జనలతో, జూలు సడలించుచు, శత్రువులకు దుర్నిరీక్షమై భయానకమై యున్నది. అదే స్వామి ముఖము బాలుడైన ప్రహ్లాదుని పట్ల మాతృప్రేమాభరితమై కృపామృతమును జల్లుచున్నది. అట్టి కృపాకపటకేసరికి నమస్కృతులు.

త్వయి రక్షతి రక్షకైః కిమన్యైః
తయిచాऽరక్షతి రక్షకైః కిన్నన్యైః
ఇతి నిశ్చిత ధీః శ్రయామి నిత్యమ్
నృహరే వేగవతీ తటాశ్రయమ్ త్వామ్

వేగవతీ తటమున వేంచేసిన శ్రీనరహరీ! వేళుక్కాయి స్వామీ! నీ రక్షణ యున్నవారికి వేరు రక్షకుల అవుసరము లేదు. నీవు రక్షింపనియెడల వేరు రక్షకులవలన ప్రయోజనము లేదు. ఈ విషయము ఖచ్చితముగా తెలిసికొని నిన్నే శరణు వేడుచున్నాను. శ్రీ నరకేసరి స్వామీ! శరణు! శరణు!.

ఇత్థమ్ స్తుతః సకృదిహాష్టభిరేష పద్యైః
శ్రీ వేంకటేశ రచితైః త్రిదశేంద్ర వంద్యః
దుర్దాంత ఘోర దురిత ద్విరదేంద్ర భేదీ
కామాశికా నరహరి ర్వితనోతు కామాన్

(ఫలశ్రుతి) శ్రీ వేంకటేశునిచే (వేదాంత దేశికులచే) రచితమగు ఈ స్తోత్రముతో భగవంతుని ఒక్కమారు స్తుతించినంతనే కామాశికా నృసింహుడు సమస్త ఘోర పాపములను నాశనమొనర్చి సకల కామితార్థములను ప్రసాదించును.

గురుర్గురుతమో ధామః సత్యః సత్యపరాక్రమః |
నిమిషోఽనిమిషః స్రగ్వీ వాచస్పతిరుదారధీః || (23)

200. గురుర్గురుతమః

గురుః

గురుతమః

గురువులకు గురువు. గురువులందు సర్వశ్రేష్ఠుడు.

ఓం గురుతమాయ గురవే నమః

ఓం గురవే నమః

ఓం గురుతమాయ నమః

'గురువు' అనగా తన్నాశ్రయించిన శిష్యులకు వేదములను, జ్ఞానమును, ధర్మమును, మోక్షమార్గమును ఉపదేశించు ప్రత్యక్ష దైవము. 'గురుతముడు' అనగా గురువులలో అత్యుత్తముడు. శ్రీ శంకరుల వ్యాఖ్యానుసారము '**గురుః**', '**గురుతమః**' అనేవి రెండు నామములు. శ్రీ భట్టులు మాత్రము 'గురుతమ' శబ్దమును విశేషణముగా స్వీకరించి, '**గురుతమ గురువు**' అనే ఒకే నామముగా వ్యాఖ్యానించారు.

లోకములకు వేదములొసగిన దేవుడు బ్రహ్మ. ఆ బ్రహ్మకు జన్మనిచ్చి, వేదములను ప్రసాదించిన శ్రీమన్నారాయణుడు గురువులకును, బ్రహ్మకును ఆదిగురువు. **యో బ్రహ్మాణామ్ విదధతి పూర్వమ్ యోవై వేదాన్ శ్చ ప్రహిణోతి తస్మై** – అని శ్వేతాశ్వరోపనిషత్తు (6.18) నందు గానము చేయబడెను.

త్రిపద్ విభూతి మహానారాయణోపనిషత్తు 8.15 – **గురుః క ఇతి గురుః సాక్షాత్ ఆదినారాయణః**

శ్రీ శంకరాచార్యుల (అద్వైత) గురుపరంపరయందు ప్రధమ గురువు నారాయణుడు. **నారాయణమ్ పద్మభువమ్ వశిష్ఠమ్ శక్తిమ్ చ తత్పుత్ర పరాశరమ్ చ వ్యాసమ్ శుకమ్ .... శ్రీ శంకరాచార్యమ్.**

శ్రీ వైష్ణవ గురుపరంపరయందును ప్రప్రధమాచార్యుడు శ్రీమన్నారాయణుడే. నరనారాయణావతారమున శ్రీమన్నారాయణుడు సద్గురువై నరునకు 'మూలమంత్రము'నుపదేశించెను. ఆ జగన్నాధుడే శ్రీ దేవికి 'ద్వయమంత్రము'ను ఉపదేశించెను. ఆ పద్మనాభుడే శ్రీకృష్ణునిగా గీతాచార్యుడై అర్జునునకు 'చరమశ్లోకము'ను ఉపదేశించెను. **కృష్ణం వందే జగద్గురుమ్**.

శ్రీ వైష్ణవ గురుపరంపర –

శ్రీధరుడు (శ్రీమన్నారాయణుడు)

శ్రీ (మహాలక్ష్మి, జగన్మాత)

శ్రీ విష్వక్సేనులు

శ్రీ శఠగోపముని (నమ్మాళ్వారు)

శ్రీ నాతముని

శ్రీ పుండరీకాక్షులు

శ్రీ రామమిశ్రులు.

శ్రీ యమునాచార్యులు (అళవందార్)

శ్రీ పరాంకుశ స్వామి

శ్రీ రామానుజాచార్యులు (విశిష్టాద్వైత సిద్ధాంతకర్త)

శ్రీ ఎంబార్

శ్రీ పరాశర భట్టు

శ్రీ నన్ జీయర్ స్వామి

శ్రీ నమ్ పిళ్ళై

శ్రీ వడక్కు తిరువీధి పిళ్ళై

శ్రీ పిళ్ళై లోకాచార్యులు

శ్రీ తిరువైమొళి పిళ్ళై

శ్రీ మనవాళ మహాముని (వరవరముని)

ధర్మచక్రము రచయిత మరింత ఆసక్తికరమైన వ్యాఖ్యనిచ్చారు – శ్రీహరి లేనిచోటు లేదు. ఆయన విశ్వవ్యాపి. విశ్వము. విష్ణువు. విశ్వాంతరాత్ముడు. కనుక జ్ఞానమునుపదేశించమని కోరుటకు ఆయనను

వెదుకనవుసరము లేదు. భక్తి కలిగి, వినయ విధేయతలు కలిగి, అహంకారమును విడచినవారు జ్ఞానము కొఱకు తపించినయెడల ఆ వాసుదేవుడు తానై వచ్చి గురువై కరుణించును. కనుకనే ఆయన గురుతముడు.

ప్రసన్న పారిజాతాయ తోత్రవేత్రైక పాణయే
జ్ఞానసముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః

శ్రీవత్సాంకం మహోరస్కం వనమాలా విరాజితమ్
శంఖచక్రధరమ్ దేవమ్ కృష్ణం వందే జగద్గురుమ్

అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలకయా
చక్షురిన్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః

శ్రీ సద్గురువులకు నమస్కారము.

ఈ శ్రీవిష్ణుసహస్రనామ వివరణ అనువాద కార్యమును నేను ఫిబ్రవరి 2005లో ప్రారంభించి సెప్టెంబరు 2011లో పూర్తి చేశాను. అక్టోబరు 2011న కంప్యూటర్...లో టైపు చేయడం మొదలుపెట్టాను. ఈ నాటి తేదీ 11 ఏప్రిల్ 2012.

మొదట్లో చెప్పినట్లుగా ఈ వివరణా సంకలనం ప్రధానంగా శ్రీ నరసింహన్ కృష్ణమాచారిగారి ఆంగ్లరచనకు అనువాదం. శ్రీ కృష్ణమాచారి గారితో నాకు అసలు పరిచయం లేదు. యదాలాపంగా అంతర్జాలంలో వెదుకుతూ వారి రచనను చూసి, (బహుశా 2004లో) ప్రింట్ చేసుకొన్నాను. 2005లో ఈ మెయిల్ ద్వారా వారి అనుమతిని, ఆశీస్సులను తీసికొని ఈ అనువాద కార్యక్రమాన్ని ఆరంభించాను. మధ్యలో ఇంకొక్కమారు మాత్రం నా ప్రగతిని గురించి వారికి వ్రాశాను. తరువాత వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. అసలు ఆయన ఎక్కడుంటారో నాకు తెలిదు.

2010లో 800 నామములు అనువాదం పూర్తి చేసిన తరువాత నా రచనను స్కాన్ చేశాను. ఆ పిడిఎఫ్ ఫైళ్ళ సి.డి.ని వారికి పంపాలనుకొని వారి అడ్రసు కావాలని మెయిల్ రాశాను. కాని జవాబు రాలేదు. తరువాత మళ్ళీ 2012లో మెయిల్ వ్రాశాను. జవాబు రాలేదు. ఈ రోజు (11 ఏప్రిల్ 2012న) ఇంటర్నెట్ లో వెదుకుంటే తెలిసిన విషయం. శ్రీ నరసింహన్ కృష్ణమాచారిగారు డిసెంబర్ 2008లో భగవత్సాన్నిధ్యాన్ని పొందారు. ఈ రచనకు సంబంధించినంతవరకు వారే నాకు సద్గురువులు. వారికి నమస్సులు. –

సుధాకర బాబు

From: malolan_net [mailto:malolan_net] On Behalf Of Dr.V.Sadagopan
Sent: 19 à®Ÿà®¿à®šà®®à¯ à®ªà®°à¯ 2008 01:51
To: Ponnappan; Sgt; SG; Rajeev@...; Swami; IRS; DS; RamanujaandDesika ; Kalyani Krishnamachari
Cc: Robert Evans
Subject: Fw: Sri Narasimhan Krishnamachari

Dear Aathma Bhandhus :
It is with great sadness that I learnt from friends at Chicago that SrimAn NarasimhanKrishnamachari attained his AchAryan Thiruvadi this Morning after a short illness. He has blessed us with the fruits of his deepresearch on Sri VishNu Sahasra Naamams, PaancharAtra Aagamam, Taatparya RatnaavaLiand number of other SrI Sooktis. He dedicated himself to the many Kaimkaryams at the Aurora Temple for many years. His was a model life as a SrI VaishNavan and endeared himself to many, many SrivaishNava Families. On this sad occasion, adiyEn extends to his dear wife and family all of our sincere condolences. A tall tree has fallen in the forest of Sri VaishNavas. Our prayers are with the family for bearing this unbearable personal loss with the anugrahams of Srimath Srirangam Andavan and Sri BhUmi Devi SamEta Sri Oppiliappan.

adiyEn , V.Sadagopan

----- Original Message -----
From: "Robert Evans" evans.robert.d@...
To: "Dr. Sadagopan" <yennappan (AT) computer (DOT) net>
Sent: Thursday, December 18, 2008 10:07 AM
Subject: Sri Narasimhan Krishnamachari

Dear Dr. Sadagopan,
Below is the note I received from the Sri Venkateswara Swami Temple (Aurora) religious committee chair person about Sri Narasimhan Krishnamachari's attainment of the Lord's lotus feet. He will be missed by everyone here in the Chicago area and by devotees all over the world who benefited from his scholarship.
With Sadness,
Bob Evans

Dear Friends:
I just learnt that Sri Krishnamachari, a very long term committed and dedicated devotee of our temple reached the lotus feet of Sriman Narayana early this morning. As a "Prapanna" (a Pious and beloved devotee of Bhagavan), his "JIvatman" is now united with "Paramatman". His soul has attained "Moksha", (liberation) and is rejoicing the bliss of "Vaikuntha", the abode of Sriman Narayana Let us offer our prayers to Sri Balaji for his soul to rest in peace. Let us all join as the "Balaji Family" and extend our deepest sympathies to Sri Krishnamachari's family, and provide our solidarity of support. At times like this, the family needs our support. After I have further details, I will pass them along.
Regards,
Ranganathan Hemmige

212. ధామః

- పరమపదము. అత్యుత్తమ నివాస స్థానము. మార్గదర్శి.
- పరంజ్యోతి. దివ్య ప్రకాశము.
- సకల కామితార్థములకును నిలయము.

ఓం ధామ్నే నమః

62వ నామమైన 'త్రిక-కుద్-ధామ' నామ వివరణలో 'ధామ' శబ్దముయొక్క భావము కొంతవరకు చెప్పబడినది. శ్రీ భట్టుల వ్యాఖ్యననుసరించి 211వ నామమైన 'గురుర్గురుతమః' నుండి భగవంతుని శ్రీమత్స్యావతార వైభవ వర్ణనా నామములు ప్రారంభమగుచున్నవి.

చిన్న తిరుపతిలో శ్రీమత్స్యావతార శిల్పము

ప్రళయ కాలమున సకల చరాచర జీవములను మోయు నావను తన శృంగమునకు కట్టుకొని మహోదధిని దాటించినవాడు 'ధామః'. నడిసంద్రమున చిక్కుకొని కొట్టుమిట్టాడు సంసార నావను నవజీవన మార్గమున నడిపించు ప్రభువు.

శ్రీ శంకరులు 'ధామ' అనగా 'ప్రకాశము' అనే అర్థమును గైకొని భగవానుడు దివ్య కాంతి స్వరూపుడు, మార్గమును చూపువాడు అని వ్యాఖ్యానించారు. భగవద్గీతలోని విభూతియోగములోని శ్లోకము (10.12)

పరంబ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్

పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్

ఇక్కడ 'పరంధామ' నామమునకు దివ్యమైన, అనన్యమైన, పరమ ప్రకాశము, తక్కిన అన్ని వెలుగులకు మూలము అని శ్రీ రామానుజులు తమ గీతాభాష్యమున అర్థము తీసుకొన్నారు. **ధామశబ్దో జ్యోతిర్వచనః పరంజ్యోతిః**

నారాయణ పరోజ్యోతిః – నారాయణోపనిషత్తు.

పరంబ్రహ్మ పరంధామ – బృహదారణ్యకము.

జ్యోతిషామపి తజ్జ్యోతిః – భగవద్గీత (13.18)

'పరమజ్యోతి' అనే భావమును ధర్మచక్రము రచయిత మరింత విపులీకరించారు. సూర్యుని కాంతివలన మనము కంటితో చూడగలము. కాని పరమ సత్యమును, పరమాత్ముని చూచుటకు కన్నులు, సూర్యకాంతి చాలవు. అందుకు కావలసినది భగవంతుని కృప, అంతశ్చక్షువులు, జ్ఞాననేత్రము. ఇదే శ్రీమహావిష్ణువు. ఆయనను తెలిసికొనుటకు ఆయనే సాధనము. ఆయనను దర్శించుటకు ఆయనే కన్నులు. ఆయనను చేరుకొనుటకు ఆయనే మార్గము.

మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోऽసి మే – గీత 18.65
ఓ అర్జున! నీవు నాయందే మనస్సును నిలుపుము. నా భక్తుడవు కమ్ము. నన్నే సేవింపుము. నాకు ప్రణమిల్లుము. ఇట్లు చేయుట వలన నన్నే పొందగలవు. ఇది ప్రతిజ్ఞాపూర్వకముగా నేను చెప్పుచున్న మాట. ఏలనన నీవు నాకత్యంత ప్రియుడవు.

ఇంకా కొన్ని భావములు చెప్పబడినవి.
కోరుకున్నంటివాని కన్నింటికి నిలయము ధామము. అన్ని కర్మములకు ఆధారము. వరముల పెన్నిధి.

'ధామ' అనగా అత్యున్నత స్థానము (కొండ కొమ్ము) అనే భావములో శ్రీ చిన్మయానందగారు చెప్పిన అర్థము – అందరూ చివరకు చేరదగిన అత్యున్నత స్థలము. పరమ పదము. కోనేటిరాయని కోవెల. శ్రీనివాసుని సన్నిధి.

213. సత్యః

మంచియైనది. మేలు చేయువాడు.

ఓం సత్యాయ నమః

ఈ పవిత్ర నామము ఈ స్తవరాజములో మూడు మారులు – 107, 213, 873వ నామములుగా గానము చేయడమైనది.

12వ శ్లోకము. 107వ నామము. సత్యః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

23వ శ్లోకము. 218వ నామము. సత్యః – **గురుర్గురుతరో ధామః సత్యః సత్యపరాక్రమః**

93వ శ్లోకము. 873వ నామము. సత్యః – **సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాక్రమః**

107వ నామ వివరణలో చెప్పుకొన్న అర్థములు (1) నిజము (2) ప్రాణము, అన్నము, సూర్యుడు రూపములలో నుండువాడు. (3) సత్ప్రవర్తనయందు ప్రీతి గలవాడు.

మత్స్యావతార గుణగాన సందర్భముగా ఈ 213వ నామమునకు శ్రీ భట్టులు చెప్పిన భావము – మనువు వంటి సత్పురుషుల ప్రార్థనలను మన్నించి, వారిపట్ల సాధు భావముతో సంచరించి, వారికి హిత మొనర్చినవాడు – **మన్వాదిష్వసి సాధుత్వాత్ సత్య ఇత్యభిధీయతే**.

107వ నామమునకు శ్రీ సత్యదేవో వాసిష్ఠగారి వ్యాఖ్యానము ఆధారముగా – 'సత్య' అనగా 'సత్' అనబడు అన్నింటిలోను అత్యుత్తమము (పాణిని సూత్రము 4.4.98). వేనిని 'సత్' అనవచ్చునో భగవద్గీతలో శ్రీకృష్ణుడే సెలవిచ్చినాడు. (17.26,27)

సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ ప్రయుజ్యతే
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుచ్యతే
యజ్ఞే తపసి జ్ఞానే చ స్థితిః సదితి చోచ్యతే
కర్మచైవ తదర్థీయమ్ సదిత్యే వాభిధీయతే

ఓ పార్థ! 'సత్' అను పరమాత్మ నామము సత్య భావమునందును, శ్రేష్ఠ భావమునందును, అనగా పరమాత్ముడు నిత్యుడు, శ్రేష్ఠుడు అను భావమనందును ప్రయోగింప బడుచుండును. ఉత్తమ కర్మాచరణము నందున 'సత్' అను శబ్దము ప్రయుక్తమగుచుండును. యజ్ఞ దాన తపః క్రియల యందలి నిష్ఠ, ఆస్తిక భావమును 'సత్' అనియందురు. పరమాత్మను ఉద్దేశించి చేయబడు నిశ్చయాత్మక కర్మలను గూడ 'సత్' అనియందురు.

ఇట్టి 'సత్' అని సంభావింపదగిన అన్నింటిలోను అత్యుత్తముడు గనుక శ్రీమహావిష్ణువు సత్య నామధేయుడు.

214. సత్య పరాక్రమః

- నిజమైన, అనన్యమైన, తరుగులేని పరాక్రమము కలవాడు.

- సత్ప్రవర్తనకు అండగా నిలుచు పరాక్రమము కలవాడు.

ఓం సత్యపరాక్రమాయ నమః

మత్స్యావతార భజనను కొనసాగిస్తూ శ్రీ భట్టులు భగవంతుడు మన్వాదుల కొఱకు నిర్వహించిన సత్య, శౌర్య కార్యములను ప్రస్తావించారు.

ధర్మ చక్రము రచయిత రెండు విధముల పరాక్రమములను ఉదాహరించారు – సజ్జన రక్షణార్థము, సత్కార్య నిర్వహణకై, ధర్మబద్ధమైనది సత్యపరాక్రమము. శ్రీరాముని రూపములో మూర్తీభవించిన భగవద్గుణము. అట్లు కాక దంభము, దర్పము, పరపీడనము, స్వార్ధములతో కూడిన పరాక్రమము రావణుని లక్షణము.

శ్రీమహావిష్ణువు ధ్యానము వలన సత్యపరాక్రమము వర్ధిల్లును.

215. నిమిషః

కనులు మూసుకొని ఉన్నవాడు. అనగా –

- యోగనిద్రలోనున్నవాడు.
- తన భక్తుల శత్రువులపై తనయొక్క కటాక్ష వీక్షణమలను పడనీయనివాడు.

ఓం నిమిషాయ నమః

న ఈక్షతే ఇతి నిమిషః – ఆ భక్తవరదుని చూపు సకల కళ్యాణప్రదము. అన్ని భయములను తొలగించును. కామతార్ధమలను వర్షించును. మోక్షమునకు దారి చూపించును. కాని ఆ చల్లని చూపు అయన భక్తులకు కీడు కలిగించు దుష్కృతులపై పడదు. అట్టి దుర్జనులకు భగవంతుని రక్షణాభాగ్యము లభించదు. **యోఽసౌ సతాం నేక్షతే హి నిమిషస్స విరోధినం**

శ్రీ శంకరులు చెప్పిన అర్థము – యోగనిద్రలోనున్న ఆయన కన్నులు సదా నిమీలితములైయుండును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతునకు చూచుటకు (భౌతికమైన) కన్నులు అవుసరము లేదు. వినుటకు చెవులు అవుసరము లేదు.

ధర్మచక్రము రచయిత – భగవంతుడు విశ్వము. విశ్వవ్యాప్తుడు. సర్వాంతర్యామి. సర్వసాక్షి. కనుక నిద్రలోనున్నను అంతటిని ఎల్లపుడు చూచుచునేయుండును. శ్రీమహావిష్ణువుయొక్క యోగనిద్రను స్మరించి. కనులు మూసికొని ధ్యానము చేయువారి మనస్సు క్రమముగా అంతర్ముఖమై, ఆత్మదర్శనొంది, పరమాత్మునివైపు మరలును.

216. అనిమిషః

ఎల్లప్పుడు కనులు తెరచియుండువాడు.

ఓం అనిమిషాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – చేపల కనులకు రెప్పలుండవు. మత్స్యావతారమూర్తియై ఎన్నడును కనులు మూయనివాడగుటచేత అనిమిషుడనబడును. అయన సదా భక్తుల యోగక్షేమములను కనిపెట్టుకొనియుండును. **సద్రక్షణే జాగరూకః స్మృతోహ్యనిమిషశ్చ శః**

శ్రీ శంకరుల వ్యాఖ్య – (1) భగవానుడు నిత్యజాగరూకుడు. జ్ఞానమూర్తి. ఏమరుపాటు లేనివాడు. (2) భగవానుడు ఆత్మస్వరూపుడు. ఆత్మకు నిద్రాది అవస్థలు వర్తించవు. కనుక భగవానుడు అనిమిషుడు.

ధర్మచక్రము రచయిత – ఈ పుణ్యనామమును ధ్యానించినవారి ఆధ్యాత్మిక సాధనము బలహీనపడదు. దురాలోచనలు వారిని చెరపజాలవు. వారు జాగరూకులై సత్కర్మలను సాధింతురు.

శ్రీ తిరుప్పాణాళ్వారు వారి చివరి పాశురము (అమలనాధిపిరన్ లోనిది) ఇక్కడ స్మరింపదగినది. గుడిలో భగవంతుని సౌందర్యమును చూచుచు ఆయన పరవశించిపాడినపాట అంతర్నేత్రమునకు కూడ వర్తించును.

217. స్రగ్వీ

- వైజయంతీ మాలను ధరించినవాడు.
- సూర్య చంద్రాది సమస్త లోకములను మాలగా ధరించినవాడు.

ఓం స్రగ్విణే నమః

'స్రక్' అనగా పూలమాల. పాణిని సూత్రము (అష్టాధ్యాయి 5.2.121) ప్రకారము – **మాయా మేధా స్రజో వినిః** – 'స్రజ్' తరువాత 'విన్' ప్రత్యయము వచ్చినందువలన 'స్రగ్వీ' అనగా 'మాలతో సంబంధము కలిగినవాడు' అని అర్థము. శ్రీమహావిష్ణువు సదా దివ్యపరిమళ భరితమగు వైజయంతీమాలను ధరించినందున 'స్రగ్వీ' యనబడును.

పరత్వ సూచనీయా చ వైజయన్తీతి కీర్తితా
తయా స్రజా నిత్యయోగాత్ స్రగ్వీతి పరికీర్త్యతే
మత్స్యావతార మూర్తి అయినప్పటికీ పరతత్వాన్ని సూచించడానికి వైజయంతిమాలను (వనమాలను) నిత్యము ధరించువాడు స్రగ్వీ.

ఆచార్య శ్రీనివాస రాఘవన్ గారి వివరణ ప్రకారము వైజయంతీమాల ఐదు రత్నములచే కూర్చబడి యుండును – ముత్యము, కెంపు, పచ్చ, పుష్యరాగము, వజ్రము (Pearl, Ruby, Emerald, Sapphire and Diamond)

శ్రీ శంకరుల వ్యాఖ్యానుసారము వైజయంతీమాల పంచతన్మాత్ర స్వరూపము. పంచభూతముల మూలగుణములైన రుచి, ఆకారము, శబ్దము, వాసన, స్పర్శ అనునవే ఈ పంచతన్మాత్రలు. ఇందుకు శ్రీరాధాకృష్ణశాస్త్రిగారు విష్ణుపురాణము (1.2.72) నుండి ప్రమాణమును ఉదాహరించారు.

పంచ స్వరూప యా మాలా వైజయంతీ గదా భృతః
సా భూత హేతు సంగాతా భూతమాలా చ వై ద్విజః

మనము పంచతన్మాత్రలను, అనగా సర్వేంద్రియ జ్ఞాన విషయములను భగవంతునికి అలంకారములుగా అర్పించవలయునని ధర్మచక్రము రచయిత సూచించారు. విష్ణురూపమే కన్నులకు పండుగ. నారాయణ భజనమే వీనులకు విందు. దేవునికర్పించు ధూపదీపములే సుగంధభోగములు. శ్రీహరికి నివేదించిన ప్రసాదమే మృష్టాన్నము. తులసి తీర్థమే మహాభాగ్యము. శ్రీనివాసుని అర్చించుటయే రాజభోగము. అలమేలు మంగను పూజించుటయే అష్టైశ్వర్యములను అనుభవించుట. శ్రీరంగనాధునకు సమర్పింపనున్న పూలమాలను ముందుగా తాను ధరించి అండాళ్ తల్లి ఆ దేవునికి అలంకారము సరిగానుండునో లేదో ముందుగా నిర్ధారించుకొనెడిది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు మరొక విశిష్ఠమైన అర్థమును చెప్పి 'స్రగ్వీ' నామధారియే విశ్వధరుడని వివరించారు. సకల నక్షత్రములు, గ్రహములు, సూర్యచంద్రులు, నక్షత్ర మండలములు, చతుర్దశ భువనములు అన్నియు ఆయనచే సృజింపబడి నిలిచియున్నవి గనుక ఆయన స్రగ్వి. దండనుండి విడివడిన పూవు నిలువజాలదు. అలాగే సకల లోకములు కలిసి స్రగ్వి యగును. ఆ స్రగ్వియే శ్రీమహావిష్ణువు. ప్రముఖులకు పూలమాలలు వేసి సన్మానించుట ఆచారము. విశ్వరూపునకు చతుర్దశ భువనములే తగిన మాల.

218. వాచస్పతి

వాక్కునకు ప్రభువు.

ఓం వాచస్పతయే నమః

ఈ నామము మరల 579వ నామముగా కీర్తింపబడినది.

23వ శ్లోకము. 218వ నామము – వాచస్పతిః – **నిమిషోఽనిమిషః స్రగ్వీవాచస్పతిరుదారధీః**

61వ శ్లోకము. 579వ నామము – వాచస్పతిః – **దివస్పృక్ సర్వదృగ్ వ్యాసో వాచస్పతిరయోనిజః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీమన్నారాయణుడు మత్స్యపురాణమున వేదములనుపదేశించెను. ఆయన గురువులకు గురువు. విద్యలకు విద్య. వేదములకు మూలము. కనుక వాచస్పతి. **వేదోప బృహణత్వాద్ధి వాచస్పతిరితి శ్రుతిః** – వేదములకు ఉపబృహణములైన ధర్మశాస్త్రములను, పురాణములను, ఇతిహాసములను ప్రవర్తింపజేసినవాడు వాచస్పతి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'వాచస్పతి', మరియు తరువాత వచ్చే 'ఉదారధీ' అనే నామములను కలిపి 'వాచస్పతిరుదారధీ' అనే ఒకే నామముగా పరిగణించారు. 'ధీ' అనగా జ్ఞానము. 'ఉదారధీ' అనగా పరమశ్రేష్ఠమగు దివ్యజ్ఞానము. 'వాచస్పతి' అనగా విద్యాధిపతి. 'వాచస్పతిరుదారధీ' అనగా పరమోత్తమ జ్ఞానస్వరూపుడైన విద్యాధినాధుడు.

పెక్కు వ్యాఖ్యానకర్తలు 'వాచస్పతి + ఉదారధీ'ని ఏకనామముగానే పరిగణించారు. శ్రీ సత్యదేవో వాశిష్ఠగారు విడివిడి నామములుగా వ్యాఖ్యానము చెప్పి, లెక్కకు మాత్రము ఒకే నామముగా పరిగణిస్తూ, సరిగా వేయి నామములు లెక్క సరిపోవడానికి ఈ పద్ధతిని అనుసరించినట్లు వివరించారు. అయితే శ్రీ భట్టులు 'గురుర్గురుతమ' వంటి మరికొన్ని నామములను ఏకనామములుగా పరిగణించినందువలన వారి లెక్క వేయికి సరిపోతుంది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారి సత్యభాష్యము ప్రకారము – 'వాచస్పతి' అనగా వేదములను, విద్యలను కాపాడువాడు. వానికి ప్రభువు, గతి, పతి.

219. ఉదారధీః

ఉదారమగు (కరుణాపూరితమగు) బుద్ధి (గుణము) కలిగినవాడు.

ఓం ఉదారధయే నమః

ధీ – బుద్ధి, జ్ఞానము, స్వభావము.

ఉదార – దయ కలిగిన, మితిలేని, దాతృత్వము

భగవంతుడు భక్తులపట్ల దయగల దాత. భక్తుల తప్పులను మన్నించి, ఒక్క దండముతోను, ఒక్క పూవుతోను సంతృప్తుడై వారి పాపములను హరించి, అభయమునిచ్చి, వరములు క్రుమ్మరించును. అనంత గుణవైభవమూర్తిని ఒక్క నామముతో స్మరించిన చాలును. గంగానదికి జన్మనిచ్చిన వానికి గిన్నెడు తీర్థము నైవేద్యము చాలును. మాయామోహితులైన జనుల బలహీనతలను గుర్తెరిగిన ఆయన వారి తప్పులను మన్నించుచునే యుండును. విద్యాది సంపదలు ప్రసాదించుచునే యుండును. అజ్ఞాన మోహితుడైన అర్జునునిపై కరుణించి, ఉదారధియే గీతోపదేశమును కావించెను.

సర్వోపజీవ్య సార్వజ్ఞ్యా దుచ్యతే స ఉదారధీ – లోకంలో అందరూ జీవించాలనే సంకల్పము కలవాడు. కర్మక్షయం కానివారందరికీ కర్మక్షయం చేసి మోక్షమును ప్రసాదించాలనే కోరికతో సృష్టి చేసినవాడు కాబట్టి శ్రీమన్నారాయణుడు 'ఉదారధి' అనబడుచున్నాడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అగ్రణీర్గ్రామణీః శ్రీమాన్ న్యాయో నేతా సమీరణః |
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ || (24)

220. అగ్రణీః

ముందుండి గమ్యస్థానమునకు దారి చూపువాడు (మార్గదర్శి)

ఓం అగ్రణ్యే నమః

అగ్రే నయతి ఇతి అగ్రణీః – ఆధ్యాత్మిక సాధకులకు తాను ముందుగా నడచుచు గమ్యస్థానము చేర్చువాడు అగ్రణి. అనగా ముముక్షువులకు మార్గదర్శి – అని శ్రీ భట్టులు, శ్రీ శంకరులు కూడ వ్యాఖ్యానించారు.

మహోదారతయా భక్తాన్ అగ్రిమం పశ్చిమం (పరమం?) పదమ్
నయతీత్యగ్రణీః ప్రోక్తో మోక్షప్రదోమనుః

పరమేశ్వరుడు కడు ఉదార స్వభావుడు కాబట్టి తన భక్తులకు పరమోత్కృష్టమైన పరమపదమును ఇస్తాడు. ఈ నామ స్మరణము మోక్షమును ప్రసాదిస్తుంది. ఓం అగ్రణ్యే నమః.

మోక్షసాధన పరముగా జీవులను నాలుగు విధములుగా విభజింపవచ్చునని 'ధర్మచక్రము' రచయిత వివరించారు. ఈ సందర్భముగా బెస్తవాని వలకు తగులుకునే చేపలను ఉదాహరణగా చెప్పారు.

1. నిత్యసూరులు – అసలు సంసారబంధములో తగులుకొననివారు. వేటగాని ఎరకు ఆశపడక ఎల్లప్పుడూ వలకు దూరముగా ఉండే చేపలవంటి జీవులు.

2. ముక్త జీవులు – సాధనయందు సఫలురై, సంసార బంధమునుండి బయటపడి మోక్షమునందుకొన్నవారు. వలలో పడికూడ, ప్రయత్నించి బయటపడ్డ చేపలవంటి జీవులు.
3. ముముక్షువులు – మోక్షముకొరకు సాధన చేయుచున్నవారు. బంధములనుండి బయటపడుటకు విలవిలలాడుచున్న చేపలవంటి జీవులు.
4. బద్ధజీవులు – సంసార బంధమున తగులుకొని, మాయామోహితులై, అందే సుఖమును వెతుకుకొనువారు. వేటగాని ఎరనే రుచికరముగా భావించి, చివరకు వేటగానికి ఆహారమగు చేపలవంటి జీవులు.

ఇందు ముముక్షువులు సంసార బంధముల ప్రాబల్యమును గ్రహించి, భగవంతునకు, గురువులకు శరణాగతులై, అహంకార మమకారములను త్యజింపనెంచి, శ్రీమన్నారాయణుని ధ్యానించు సాధకులు. వారికి భగవంతుడందించు చేయూతయే ఇక్కడ 'అగ్రణీః' నామమున స్తుతింపబడినది. నీట మునిగినవాడు ఊపిరికై ఎంత తపించునో అంతగా ముముక్షువు భగవత్ప్రాప్తికై సాధన చేయవలయును. అప్పుడే అగ్రణి దయ లభించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు ఇక్కడ శ్రీమహావిష్ణువుయొక్క 'ముందుకు నడిపించు గుణము'ను మరింతగా ప్రస్తావించారు. ఇది జీవితములో పలు సందర్భములందు ప్రస్ఫుటముగా కనిపిస్తుంది. కాలము ముందుకే నడుస్తుంది. గడచిన సమయము తిరిగిరాదు. సూర్యచంద్రాదులు భగవంతుని అభీష్ఠానుసారమే వర్తించుచున్నవి.

221. గ్రామణీః

సకల సముదాయములకు (జీవులకు, దేవతలకు, ముముక్షువులకు) నాయకుడు. అందరికీ మోక్షమును చూపు పెద్దదిక్కు.

ఓం గ్రామణ్యే నమః

గ్రామమ్ సమాజమ్ నయతి ఇతి గ్రామణీః – (భక్త) సమాజమును, సమూహమును నాయకత్వము వహించి ముందుకు నడుపువాడు గ్రామణి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు 'గ్రామ' పదమును మరింత వివరించారు. 'గ్రామ' అనగా ఏదైనా సముదాయము, గుంపు అని చెప్పవచ్చును. ఇండ్ల సముదాయము (ఊరు), ఇంద్రియ సముదాయము (దేహము), సంగీత సాధనముల సముదాయము (**సప్తస్వరాస్తయో గ్రామా** – నారదీయ శిక్ష). ఇలాగే సృష్టింపబడిన సకల భూత సముదాయము గ్రామము. సకల గ్రామములకు శరణ్యైనవాడు, భూతభావనుడు, భూతేశుడు, దేవదేవుడు, జగత్పతి గనుక భగవానుడు 'గ్రామణి'యగును.

ధర్మచక్రము రచయిత చక్కని ఉదాహరణ చెప్పినారు – ఒక అడవిలో తప్పిపోయి తిరుగాడుచున్నవాడు అదే విధముగా తడుముకొనే మరొకరిని ఆశ్రయించినందువలన ప్రయోజనము లేదు. అలాగునే సంసార ఘోరాటవిలో పడి కొట్టుకొనువారు ఇతర బద్ధ జీవులను ఆశ్రయించి లాభము లేదు. వారు కేవలము శ్రీమహావిష్ణువునకు శరణాగతులైన యెడల వారిని ఆయన మోక్షమార్గమున నడిపించును.

శ్రీ లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రము సారాంశము

శ్రీలక్ష్మీనృసింహుడు మనకు చేయూతనిచ్చి కాపాడు దేవుడు. యోగీశుడు. శాశ్వతుడు. శరణ్యుడు. భవసాగరమునుండి కాపాడువాడు. లక్ష్మీవల్లభుడు. దేవేంద్ర వంద్యుడు. సంసార సాగరమున ఇంద్రియ మాయలో కొట్టు మిట్టాడువారిని తరింపజేయు నావ. సంసార ఘోరాటవిలో చిక్కుకున్నవారిని రక్షించు గ్రామణి. అగాధ సంసార కూపమున బడి దుఃఖించువారికి చేయూతనిచ్చి ఉద్ధరించు ఆత్మబంధువు. సంసార భీకర కరీంద్రముచే పీడింపబడువారిని కాపాడు నరహరి. సంసార విషసర్పపు కోరలందు చిక్కుబడినవారి సకల దుఃఖములను హరించు అమృతమూర్తి, పక్షీంద్ర వాహనుడు. సంసార జాలమున బంధితులైనవారిని విడిపించు కరుణామయుడు. సంసార వృక్షమున కర్మ, మోహ, పాప ఫలముల యందు మత్తులైనవారికి చేయూతనిచ్చి మేల్కొలుపు మిత్రుడు. సంసార సాగరమున మనిగిన దీనుల సకల ఖేదములను పరిమార్చు మంగళమూర్తి. సకల భయహరుడు. సమస్త శుభకరుడు. లక్ష్మీపతి. జనార్దనుడు. కేశవుడు. వాసుదేవుడు. ప్రహ్లాద వరదుడు. నారద సంగీత లోలుడు. పుష్కరాక్షుడు. అంబరీషనాథుడు. వ్యాసునికి, శుకునకు, శౌనకునకు హృదయవిహారి. భక్తానురక్త పరిపాలన పారిజాతము. శంఖచక్రములు ధరించి, లక్ష్మీసమేతుడైన వరదాభయమూర్తి.

---

22. శ్రీమాన్

'శ్రీ' అనగా కాంతి, తేజస్సు, వైభవము, సంపద.

- సకల సంపదలు మూర్తీభవించిన మూర్తి. సిరిగలవాడు.
- సమస్త వైభవము గలవాడు. శ్రీ, ధృతి, స్మృతి, కీర్తి గలవాడు.
- ప్రకాశించువాడు. తేజోమూర్తి.
- శ్రీమహాలక్ష్మీపతి.
- వక్షస్థలమున శ్రీమహాలక్ష్మిని నిలుపుకొన్నవాడు.
- సకల శక్తిమంతుడు.

ఓం శ్రీమతే నమః

ఈ మంగళకర నామము 22వ నామముగాను, 180వ నామముగాను, మరల ఈ 222వ నామముగాను కీర్తింపబడినది. ఈ మూడు సందర్భములలోను ప్రముఖ వ్యాఖ్యాతల అనుభవం ఆసక్తికరంగా వ్యక్తమైనది.

శ్రీ శంకరుల వ్యాఖ్యప్రకారము 'శ్రీమాన్' నామము నాలుగుమార్లు (3వ, 19వ, 24వ, 65వ శ్లోకములలో) వస్తుంది. శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము ఈ నామము 3 మార్లు (3వ, 19వ, 24వ శ్లోకములలో) వస్తుంది. 65వ శ్లోకములో శ్రీభట్టులు 'శ్రేయశ్శ్రీమాన్' అనే ఒకే నామముగా పరిగణించారు.

3వ శ్లోకము. 22వ నామము – శ్రీమాన్ – **నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః**
శ్రీ భట్టుల వ్యాఖ్య: అతిమనోహర సుందర శ్రీ నారసింహ స్వరూపము
శ్రీ శంకరుల వ్యాఖ్య: వక్షస్థలమున శ్రీలక్ష్మిని ధరించినవాడు.

19వ శ్లోకము. 180వ నామము – శ్రీమాన్ – **అనిర్దేశ్యవపుః శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృక్**
శ్రీ భట్టుల వ్యాఖ్య: దివ్యాభరణములతో, దివ్య మాల్యాంబరములతో శోభిల్లువాడు.
శ్రీ శంకరుల వ్యాఖ్య: సకలైశ్వర్య సంపన్నుడు

24వ శ్లోకము. 222వ నామము – శ్రీమాన్ – **అగ్రణీః గ్రామణీః శ్రీమాన్ న్యాయోనేతా సమీరణః**
శ్రీ భట్టుల వ్యాఖ్య: శ్రీయుత మత్స్య మూర్తి. అన్ని సంపదలను కలిగినవాడు.
శ్రీ శంకరుల వ్యాఖ్య: అనన్య తేజోమయుడు.

65వ శ్లోకము – 619వ నామము. శ్రీమాన్ / శ్రేయశ్శ్రీమాన్ – **శ్రీధరః శ్రీకరః శ్రేయఃశ్రీమాన్ లోకత్రయాశ్రయః**
శ్రీ భట్టుల వ్యాఖ్య: **శ్రేయశ్శ్రీమాన్** – సకల సంపదలను ప్రసాదించు లక్ష్మీదేవిని నిత్యము కలిగియున్న శ్రీధరుడు.
శ్రీ శంకరుల వ్యాఖ్య: **శ్రీమాన్** – సకల వైభవములు, సమస్త భోగభాగ్యములు, సకల విభూతులు, సకల సద్గుణములు, సర్వశక్తులు, సర్వనిధులు తనయందే కలిగియున్న శ్రీమంతుడు.

'శ్రీ' అనగా సంపద అన్న అర్థములో శ్రీభట్టులు వ్యాఖ్యానము చెప్పారు. **మత్స్యః కమల లోచనః** – పద్మాక్షుడైన మత్స్యావతారమూర్తి శ్రీమంతుడు. పరమాత్ముడు. విపత్తులను తొలగించి సంపదలు వర్షించు కరుణామయుడు.

'శ్రీ' అనగా కాంతి అనే అర్థంలో శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. భగవంతుని ప్రకాశము అనితరము. ఆయన వెలుగులకు వెలుగు. చదువులకు మూలము. **సర్వాతిశయాని శ్రీః కాంతి అస్య**

శ్రీ చిన్మయానంద – 'శ్రీ' అనగా జగన్మాతయగు లక్ష్మీదేవి. అన్నిశక్తులకు, సంపదలకు, వైభవములకు ఆలవాలము. అట్టి సకల శక్తి సంపదలు శ్రీమహావిష్ణువునందు గలవు గనుక ఆయన 'శ్రీమాన్'.

‘శ్రీమాన్’ అనగా శ్రియఃపతి. మహాలక్ష్మీవల్లభుడు. ఆయన వక్షస్థలమున ‘శ్రీ’ వసించును గనుక అందమంతా ఆయనయందే పొందగును.

ధర్మచక్రము రచయిత – ప్రకృతి, పురుషులను విడదీయ సాధ్యము కాదు. అట్లే లక్ష్మీనారాయణులు సదా ఏకమైయుందురు. వారొకే పరబ్రహ్మము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ‘శ్రీ’ అనగా సేవింపదగినది. ‘శ్రీ’ అనగా శోభ. ‘శ్రీ’ అనగా కాంతి. ‘శ్రీ’ అనగా సంపద. శ్రీనివాసుడే అందరిచేత సేవింపబడువాడు. ప్రకృతియందు కానవచ్చు సౌందర్యమంతా ఆయనను స్మరింపుమని చెప్పు గురుతులే. ఆయన ప్రకాశము సూర్యచంద్రాగ్నులకు వెలుగునిచ్చును. ఆయనే తరుగులేని సంపద.

223. న్యాయః

- భక్తులకు తగురీతిలో (మోక్ష) ఫలము నొసగువాడు.
- పరబ్రహ్మ జ్ఞానమునకు దారిచూపు తర్కము, యుక్తి.
- విశ్వమందు అంతటిని సక్రమముగా నియమముగా నడుపు శక్తి.

ఓం న్యాయాయ నమః

‘న్యాయము’ అనగా ధర్మము ననుసరించి ఇచ్చు ఫలము (Justice). న్యాయము అనగా తర్కశాస్త్రములో ప్రమాణము (Logical Rule).

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు భక్తులకు సదా న్యాయము చేయును. వారికి తగిన ఫలములను ప్రసాదించును. వారికి కీడు రాకుండ కాచును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – ప్రమాణానుగ్రాహకములందు తర్కమును, యుక్తియును ఆయనే. ‘ప్రమాణానుగ్రాహకములు’ అనగా విజ్ఞానమునకు మౌలిక సూత్రములు. ‘తర్కము’ అనగా శాస్త్రానుసారముగ మంచి చెడులను వేరు చేయుట. ‘యుక్తి’ అనగా తత్వ విచార మార్గము, సాధనము. కనుక జ్ఞానసాధనకు మార్గము ఆయనే. గమ్యము ఆయనే. తిరుగు లేని వాదన ద్వారా (వేదప్రమాణము ద్వారా?) మార్గనిర్దేశనము చేయును గనుక భగవానుడు ‘న్యాయము’ అని శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు వివరించారు.

ఈ భావాన్ని ధర్మచక్రము రచయిత మరింత విపులీకరించారు – తర్కములో వాదము, వితండము, జల్పము అనే మూడు విధాలున్నాయి. వాదము - సత్యశోధనకై శ్రద్ధతో, వినయముతో సాగించు సాధన; వితండము - ప్రతివాదిని కంగారుపెట్టి, అహంకారముతో జరుపు విధము; జల్పము - అధికార మదముతో

ప్రతివాదిని భయపెట్టు పద్ధతి. ఇందు 'వాదము' అనునది శాస్త్రానుగుణముగా, ఉచితముగా సాగించు జ్ఞానసముపార్జనా విధానము. మహావిష్ణువును అర్చించువారు శ్రద్ధ, వినయములు కలిగి సముచితముగా తర్కమును సాగించి జ్ఞానమును పొందుట తథ్యము. మాయా మోహములనుండి వారు విముక్తు లగుదురు. గీతోపదేశమును విన్న అర్జునుడు ఈ విధముగాపలికెను (గీత 18.73)

నష్టో మోహః స్మృతిర్లబ్ధాత్వత్ప్రసాదాన్మయాచ్యుత

స్థితోఽస్మి గత సందేహః కరిష్యే వచనం తవ

ఓ అచ్యుత! నీ కృపచే, నా మోహము పూర్తిగా తొలగినది. స్మృతిని పొందితిని. ఇప్పుడు సంశయ రహితుడనైతిని. కనుక నీ ఆజ్ఞను తల దాల్చెదను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'న్యాయము' అనగా 'నియమము ప్రకారము నడచు విధము' అనే భావములో కూడ వివరించారు. 'నియతి' అనగా శాసించుట, అధికారము నెరపుట. **నీయతే ప్రాప్యతే ఇతి న్యాయః**. విశ్వములో అంతయును నియమానుసారముగ వర్తించుటకు కారణము గనుక శ్రీమన్నారాయణుడే న్యాయము. సూర్య చంద్రాదుల గతులకు, ఇంద్రియముల ప్రవర్తనకు, సకల జీవుల స్వభావములకు నియంతయైనందున భగవంతుడే న్యాయము.

'గీతా – తత్వ వివేచనీ వ్యాఖ్య' చివరిలో శ్రీ జయదయాల్ గోయందకాగారి మధుర సందేశము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు.

ఆనంద చిద్ఘనుడు, షడ్గుణైశ్వర్య సంపన్నుడు, చరాచర వందితుడు, పరమ పురుషోత్తముడు ఐన సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుని దివ్యవాణియే 'శ్రీ మద్భగవద్గీత'. ఇది అనంత రహస్యములకు రత్నాకరము. శ్రీకృష్ణభగవానుని కృపానుగ్రహములు ప్రసరించినప్పుడే ఇందలి రహస్యాంశములలో యత్కించిత్ సుబోధకము కాగలదు. అనన్య భక్తి శ్రద్ధాదరములు పొంగి పొరలుచున్న హృదయములు గలవారే భగవత్కృపాకటాక్షములను ప్రత్యక్షముగా అనుభవించి, గీతయొక్క నిజ స్వరూపాంశమును (గీతయొక్క పరమ తత్వార్థ లేశమునైనను) దర్శింపగలరు.

కనుక నిజ శ్రేయస్కాములైన స్త్రీ పురుషులు భక్తాగ్రేసరుడైన అర్జునుని ఆదర్శముగా గైకొనవలెను. మఱియు అర్జునునివలె దైవీగుణములను పెంపొందించుకొని, భక్తి, శ్రద్ధలతో గీతా శ్రవణ, మనన, అధ్యయనములను చేయవలయును. అంతే గాక భగవదాజ్ఞానుసారము యథాయోగ్యమయిన తత్పరత్వముతో సాధనయందు నిమగ్నులు కావలెను.

ఇట్లు సాధన చేసినవారు తమ అంతఃకరణములయందు నిత్య నూతనములైన, పరమానంద దాయకములైన నిరుపమాన దివ్యభావ స్ఫురణలకు నోచుకొందురు. ఇంకను వారు సర్వథా పవిత్రాంతఃకరణములు గలవారై భగవంతునియొక్క అలౌకిక కృపామృత రసాస్వాదనము చేయుదురు. అచిరకాలములోనే (శీఘ్రముగనే) భగవత్ప్రాప్తినందుదురు.

జయ భగవద్గీతే, జయ భగవద్గీతే
హరి హియ కమల విహారిణి, సుందర సుపునీతే
కర్మ సుమర్మ ప్రకాశిని కామాసక్తిహరా
తత్త్వ జ్ఞాన వికాశిని విద్యా బ్రహ్మపరా
హరిః ఓం

224. నేతా

- భక్తుల కోరికలు తీర్చువాడు.

- విశ్వమునందన్ని వ్యవహారములను నిర్వహించు అధికారి.

ఓం నేత్రే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **నియుక్తమ్ కరోతి ఇతి నేతా**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **జగద్-యంత్ర నిర్వాహకః నేతా**

ధర్మచక్రము రచయిత వివరణ – ఒక చక్రము తిరుగునపుడు దానికి అతికించిన వస్తువులు కూడ తిరుగుచుండును. అలాగే భగవత్సంకల్పమున కనుగుణముగా సకలము వర్తించుచుండును, అందరము ప్రవర్తించుచుందుము. కాని మన శక్తి సామర్థ్యముల వలన, ఇష్టానుసారము మనమిలా చేయుచున్నామని ప్రజలు భ్రమింతురు. ఈ నామస్మరణము ద్వారా ఈ మోహమును, భ్రాంతిని విడిచి, సర్వము తానెయైన పరమేశ్వరునకు శరణాగతులు కావచ్చును.

శ్రీకృష్ణభగవానుడు రథమును, రథములోని అర్జునుని నడపుచుండెను. రథమునకు తానే చలనశక్తియను భ్రాంతి లేదు. కాని జీవాత్మయగు అర్జునునకు మాత్రము తానే యుద్ధముచేయు శక్తియను మోహము క్రమ్మివేసెను. అప్పుడు భగవంతుడు 'నన్నే నమ్ముకొనుము. నాకే నమస్కరించుము. నిన్ను కాపాడెదను' అని యుపదేశించెను.

శ్రీకృష్ణపరమాత్ముడు ఆయుధమును ధరింపలేదు. యుద్ధము చేయలేదు. ఊరకే చూచుచున్నట్లుండెను. ఆయన సర్వసాక్షి. విశ్వత్మకుడు. అంతర్యామి. అంతటిని గమనించుచుండును. అన్నింటిని నిర్వహించుచుండును. అంతా ఆయన సంకల్పానుసారమే సంభవించును. అందరికిని నేత ఆయనే.

225. సమీరణః

- అద్భుతమైన, మనోహరమైన కార్యములను నిర్వహించువాడు.

- సకల జీవుల శ్వాసను, తదితర చైతన్యమును నడపువాడు.

ఓం సమీరణాయ నమః

'ఈర్' అనే ధాతువునుండి 'ఈరణ' అనగా 'చలింపజేయుట' అనే అర్థము వచ్చును.



శ్రీ మత్స్యావతార మూర్తి – 1910నాటి రాజా రవివర్మ ప్రెస్ చిత్రం. వికీపీడియానుండి

వైవస్వత మన్వంతర ప్రారంభ కాలమున వేదములను దొంగిలించిన హయగ్రీవుడను దైత్యుడు ప్రళయాంభోనిధిలోనికి ఉరికినాడు. శ్రీమహావిష్ణువు మహామత్స్యాకృతుడై ఆ రాక్షసుని వెదకి చంపి శృతులను బ్రహ్మకొసగిన మహాద్భుత కార్యమును ఈ నామ వివరణయందు శ్రీ భట్టులు ప్రస్తావించినారు.

ఈ మత్స్యావతారమునందే మాధవుడు సత్యవ్రతుని, ముని బృందమును, ఓషధులను, సృష్టిబీజములను కలిగిన నావను తన కొమ్ముతో ప్రళయమహాసాగరమును దాటించిన వైనము 'సమీరణ' నామ గుణగానమని శ్రీరాధాకృష్ణశాస్త్రి వ్యాఖ్యానించారు.

శ్రీమద్భాగవతము 8వ స్కంధము 24వ అధ్యాయములోని 33వ శ్లోకము

త్రైలోక్యమ్ లీయమానామ్ సంవర్తాంభసి వై తదా

అప్స్థాస్యతి నౌః కాచిత్ విశాలా త్వామ్ మయా ఈరితా

ముల్లోకములు సాగరగర్భమున అదృశ్యమగునపుడు ఒక పెద్ద నావ నాచే నీవైపుకు లాగబడును. ఇక్కడ 'ఈరితా' అన్న పదమును గమనించదగును.

'సమీరణ' నామమునందలి చలనమును సకల ప్రాణులయందలి శ్వాసగా శ్రీ శంకరులు అన్వయించారు. ఊపిరి సాధనముగా సమస్త జీవుల కర్మములను అధీనమందుంచుకొనువాడు గనుక శ్రీమన్నారాయణుడే సమీరణుడు.

ఈ అర్థమును శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు మరి కొంచెము ముందుకు లాగారు. సృష్ట్యాదినుండి కల్పాంతము వరకు మనిషికి 32 పండ్లు ఉండును. సూర్యచంద్రాదులు తమతమ గతులయందు వర్తించును. ఇదంతా భగవంతునికి చైతన్యముపై గల నియంత్రణకు సంకేతము.

పోతన భాగవతమునందు శ్రీమత్స్యావతార వర్ణనము. (శ్రీ మడుగుల నాగఫణిశర్మ 'పోతన భాగతవ కవితాసుధ' ఆడియో క్యాసెట్టు నుండి విని వ్రాసినది. మరియు తెలుగు వికీపీడియానుండి)

ఒకనాటి కల్పాంత సమయమున మహాయుగసంధిలో (చాక్షుస మన్వంతరము ముగిసి, వైవస్వత మన్వంతరము ఆరంభమగుటకు ముందు) జరిగిన కథ ఇది.

వివస్వతుడు అనే సూర్యుని పుత్రుడు సత్యవ్రతుడు. అతనికి శ్రాద్ధదేవుడు అనే పేరు కూడ గలదు.
ఆ సత్యవ్రతుడు కృతమాలిక అనే నదిలో అర్ఘ్యం ఇస్తున్నాడు. అప్పుడు అతని చేతిలోనికి ఒక చేపపిల్ల వచ్చింది. దానిని తిరిగి వదలి పెట్టబోగా అది తనను కాపాడమని కోరింది. సరే అని ఇంటికి తీసికొని వెళ్ళగా అది ఒక్క ఘడియలో చెంబుకంటె పెద్దదయ్యింది. ఇంకా పెద్ద పాత్రలో వేస్తే ఆ పాత్ర కూడా పట్టకుండా పెరిగింది. చెరువులో వేస్తే చెరువు చాలనంత పెరిగింది. నదిలో వేస్తె ఇంకా పెద్దయ్యింది. అప్పుడు రాజు "నీవెవరవు?" అని ఆ చేపను ప్రార్థించగా ఆ చేప తాను మత్స్యాకృతి దాల్చిన విష్ణువునని చెప్పింది. "శ్రీ లలనాకుచవీధీ కేళీ పరతంత్రబుద్ధిన్ క్రీడించు శ్రీహరీ! తామసాకృతిన్ ఏలా మత్స్యంబవైతివి?" అని రాజు ప్రశ్నించాడు.

అప్పుడా మత్స్యం ఇలా జవాబిచ్చింది. "రాజా! నేటికి 7వ దినమునకు బ్రహ్మదేవునకు ఒక పగలు పూర్తియై రాత్రి కావస్తున్నది. అప్పుడు సకల ప్రపంచమూ జలమయమౌతుంది. నా మహిమ వల్ల ఆ ప్రళయసాగరంలో ఒక నావ వస్తుంది. ఆ నావలో నిన్నూ, తపోమూర్తులైన సప్తర్షులనూ, ఓషధులను, తిరిగి సృష్టికోసం అవుసరమైన మూలబీజాలనూ పదిలం చేసి నా శృంగము (ఒంటి కొమ్ము) తో ఆ నావను లాగి ప్రళయాంబోధిని దాటింతును" అని చెప్పెను.

ఎడతెరిపిలేని సృష్టి కార్యంలో అలసిన బ్రహ్మ ఆ కల్పాంత సాయంసంధ్యలో రవ్వంత కునుకు తీసెను. ఇదే అదనుగా చూసుకొని హయగ్రీవుడనే రాక్షసుడు బ్రహ్మ దగ్గరనుండి చతుర్వేదాలను చేజిక్కించుకొని మహాజలరాశి గర్భంలోనికి ఉరుకెత్తాడు. మీనాకృతియైన శ్రీమహావిష్ణువు వేదచౌర్యమొనర్చిన రాక్షసుని వెంటాడిన విధము

ఒకమాటు జలజంతు యూథంబుతో గూడు
ఒకమాటు దరులకుం బుదికివచ్చు
ఒకమాటు మింటికి ఉరగి ఉల్లంఘించు
ఒకమాటు లోపల నొదిగి యుండు
ఒకమాటు వారాసి నొడలు ముంపమి నూపు
ఒకమాటు బ్రహ్మాండ మొరయ దలచు
ఒకమాటు ఝుషకోటి నొడిసి యాహరించు

ఒకమాటు జలముల నుమిసిపైచు

కనులు సారించు మీసలు గడలు గొలుపు
ఒడలు మెరిపించు కన్నుల పలపమార్చు
ఒడలు ఝుళిపించు తళతళ లొలయ
మీనవేషి పెన్నీటి నిగమ గవేషి యగుచు

ఉరకంభోనిధిలోని వేదముల కుయున్ దైత్యున్ జూచి వే
గరులాడించి ముఖంబు సాచి పలువీతన్ తోక సారించి మేన్
మెరయన్ దౌడలు గీరి మీసలడరన్ మీనాకృతిన్ విష్ణుడ
క్కరటిన్ దాకి వధించె ముష్టి దళిత గ్రావున్ హయగ్రీవున్

అలా శ్రీమన్నారాయణుడు మత్స్యరూపంలో ఆ రాక్షసుని వెదకి, చంపి, వేదములను తిరిగితెచ్చి బ్రహ్మకిచ్చాడు.

ఆ యాదినారాయణుని సత్యవ్రత రాజేంద్రుడు ఇలా ప్రస్తుతించాడు.

చెలిపై చుట్టమపై మనస్థితుడపై చిన్మూర్తిపై ఆత్మపై
వలనై కోర్కెల పంటపై విభుడపై వర్తిల్లు నిన్నొల్లకే
పలువెంటన్ బడి లోకమక్కటా వృధా బద్ధాశమై పోయెడున్
నిలువన్నేర్చునె హేమరాశి గనియున్ నిర్భాగ్యుడంభశ్శయ్యాపహా!

ఆలింపుము విన్నపమిదె
వేలుపు గమి రేయి నిన్ను వేడికొనియెదన్
నాలోన్ చిక్కు మానిచి
నీలోనికి గొంచుపొమ్ము నిఖిలాధీశా!

సత్య వ్రతుని సంస్తుతులకు సంతసించి పురాణపురుషుడైన మాధవుడు అతనికి సాంఖ్యయోగ క్రియను, పురాణ సంహితను ఉపదేశించెను. కృపానిధియై మహామత్స్యశరీరుడు సత్యవ్రతుని, మునిబృందమును, ఓషధులను, మూలబీజములను కల్గిన నావను ప్రళయాంభోనిధిని దాటించెను. వివస్వతుని పుత్రుడైన సత్యవ్రతుడు శ్రీహరి అనుగ్రహమువలన ప్రస్తుతం నడుస్తున్న "వైవస్వత మన్వంతరానికి" అధిపతి అయ్యాడు.

ప్రళయాంభోనిధిలోన మేన్ మరచి నిద్రంజెందు వాణీశు
మోల వేదంబులు గొన్న దైత్యున్ మృతిన్ బొందించి సత్యవ్రతుం
డలరన్ బ్రహ్మమ మాటలన్ దెలిపి సర్వాధారుడై మీనమై
జలధిం గ్రుంకుచు తేలుచున్ మెలగు రాజన్మూర్తికిన్ మ్రొక్కెదన్

ఈ చరిత్ర విన్నచో కలుగు ఫలశ్రుతి

జనవిభుండు తపసి సత్యవ్రతుండును

మత్స్యరూపియైన మాధవుండు

సంచరించినట్టి సదమలాఖ్యానంబు

విననవాడు బంధవిరహితుండు.

మన్వంతరము

(శ్రీ జయదయాల్ గోయందకా గారి గీతా తత్త్వవివేచనీవ్యాఖ్య నుండి – మరియు తెలుగు వికీపీడియా నుండి)

దేవతల కాల ప్రమాణము మన(మానవ) కాలప్రమాణమునకు 360 రెట్లు అధికము. అనగా మన ఒక సంవత్సరకాలము దేవతలకు ఒక దివారాత్రము (పగలు + రాత్రి). మన 30 సంవత్సరములు దేవతలకు ఒక నెల. మన 360 సంవత్సరములు వారికి ఒక (దివ్య) సంవత్సరము. ఇట్టి 12,000 దివ్య సంవత్సరములు వారికి ఒక దివ్య యుగము (మహాయుగము). ఇది మనకు ఒక చతుర్యుగకాల సమానము. ఈ విధముగా లెక్క పెడితే మన 43,20,000 సంవత్సరములు ఒక మహాయుగము అగును.

యుగము	**దివ్య సంవత్సరములు**	**మానవ సంవత్సరములు**
కృత యుగము	4,800	17,28,000
త్రేతా యుగము	3,600	12,96,000
ద్వాపర యుగము	2,400	12,96,000
కలియుగము	1,200	4,32,000

మొత్తము 12,000 దివ్య సంవత్సరములు = 43,20,000 మానవ సంవత్సరములు = ఒక దివ్య యుగము (చతుర్యుగము, మహాయుగము). ఇలాంటి వేయి దివ్య యుగములు బ్రహ్మదేవునకు ఒక పగలు. బ్రహ్మ పగలును కల్పము (సర్గము) అంటారు. మరొక వేయి దివ్య యుగములు బ్రహ్మదేవునకు ఒక రాత్రి. ఈ రాత్రిని ప్రళయము అంటారు. అటువంటి 360 దివారాత్రములు బ్రహ్మకు ఒక సంవత్సరము. అటువంటి 100 సంవత్సరములు బ్రహ్మ ఆయుఃకాలము.

కాలమానము	**సౌర (మానవ) సంవత్సరాలు**	**దివ్య సంవత్సరాలు**
ఒక చతుర్యుగము	43,20,000	12,000
71 చతుర్యుగములు	30,67,20,000	8,52,000
ప్రతి కల్పాదియందు వచ్చు సంధ్య	17,28,000	4,800
14 సంధ్యా కాలములు	2,41,92,000	67,200
ఒక సంధ్యాకాలముతో పాటు ఒక మన్వంతరము	30,84,48,000	8,56,800
14 సంధ్యలతో పాటు కలిపిన 14 మన్వంతరములు	4,31,82,72,000	1,19,95,200
14 మన్వంతరములు + కల్పాది సంధ్య = ఒక కల్పము = బ్రహ్మకు ఒక పగలు	4,32,00,00,000	1,20,00,000
బ్రహ్మకు ఒక రాత్రి	4,32,00,00,000	1,20,00,000
బ్రహ్మకు ఒక దివారాత్రము (ఒక రోజు)	8,64,00,00,000	2,40,00,000
బ్రహ్మకు ఒక సంవత్సరము	311040,00,00,000	864,00,00,000

మన్వంతరముల పేర్లు

1. స్వాయంభువ మన్వంతరము
2. స్వారోచిష మన్వంతరము
3. ఉత్తమ మన్వంతరము
4. తామస మన్వంతరము
5. రైవత మన్వంతరము
6. చాక్షుష మన్వంతరము
7. **వైవస్వత మన్వంతరము (ప్రస్తుతము జరుగుచున్నది)**
8. సూర్యసావర్ణి మన్వంతరము
9. దక్షసావర్ణి మన్వంతరము
10. బ్రహ్మసావర్ణి మన్వంతరము
11. ధర్మసావర్ణి మన్వంతరము
12. భద్రసావర్ణి మన్వంతరము
13. దేవసావర్ణి మన్వంతరము
14. ఇంద్రసావర్ణి మన్వంతరము

---

226. సహస్రమూర్ధా

వేయి శిరసులు గలవాడు

ఓం సహస్రమూర్ధ్నే నమః

228. సహస్రాక్షః

వేయి కన్నులు గలవాడు

ఓం సహస్రాక్షాయ నమః

229. సహస్రపాత్

వేయి పాదములు గలవాడు

ఓం సహస్రపదే నమః

శ్రీ భట్టులు ఈ మూడు నామములకు కలిపి వ్యాఖ్యానము చెప్పారు. ఇక్కడ శిరసులు, కన్నులు, పాదముల ప్రస్తావన అనగా సకలములైన జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములను గూర్చి చెప్పినట్లు భావింపవలెను. ఇంకా 'వేయి' అనగా 'లెక్కపెట్టలేనన్ని, అంతులేని' అని అర్థము చెప్పుకొనవలెను.

తద్వారా భగవంతుని విశ్వవ్యాప్తిత్వము ప్రస్తుతింపబడుచున్నది. అనంత జ్ఞానేంద్రియ యుతుడైనందున శ్రీహరికి తెలియని విషయముండదు. అనంత కర్మేంద్రియములు కలిగినందున ఆయనకు సాధ్యముకాని పని లేదు. ఎక్కడైనను, ఎప్పుడైనను మన మొనరించు పూజా నమస్కార నామస్మరణములను ఆయన అంగీకరించును. మనమర్పించు నైవేద్యమును స్వీకరించును. భక్తులకు వరములు ప్రసాదించును. అభయము నొసగును.

ఈ మూడు నామములకు శ్రుతులనుండి పెక్కు ఆధారములు గలవు.

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ – పురుష సూక్తము.

సర్వతః పాణిపాదమ్ తత్ సర్వతోఽక్షి శిరోముఖమ్ – గీత 13.13

విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో విశ్వతోబాహురుత విశ్వత్స్పాత్ – తైత్తరీయారణ్యకము 10.1

అనేక వక్త్ర నయనమ్ అనేకాద్భుత దర్శనమ్ – గీత 11.10

రూపమ్ మహత్ తే బహువక్త్రనేత్రమ్ .. .. బహు బాహూరుపాదమ్ – గీత 11.23

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – తల్లి గర్భములో ముందుగా తల రూపుదిద్దుకొనును. జన్మ సమయమున ముందుగా తల బయటకు వచ్చును. కనుక ముందుగా 'సహస్రమూర్ధా' అను నామము చెప్పడమైనది. ఇంకా జ్ఞాన, కర్మేంద్రియములలో జ్ఞానశక్తి, క్రియాశక్తి నుపయోగించుటలో వానికున్న ప్రాముఖ్యతవలన శిరస్సు, నేత్రములు, పాదములు ఇచ్చట స్తుతింపబడినవి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఈ మూడు మహానామములు భగవంతుని సర్వవ్యాప్తిత్వమును, సర్వాంతర్యామిత్వమును, సర్వశక్తిత్వమును కీర్తించుచున్నవి. ఆయన లేని చోటు లేదు. ఆయనే సర్వసాక్షి. మరియు అనంతమైన శిరస్సులు అనంతమైన బుద్ధికి కూడ సంకేతము. మనమందరము శ్రీమన్నారాయణుని శరీరమునందు భాగములు (ఆవయవములు) గనుక అందరి తలలు ఆయన తలలే. ఇందువలన కూడ భగవంతుడు సహస్రమూర్ధ్నుడు. సర్వాంతర్యామి, సర్వసాక్షి గనుక శ్రీహరి సహస్రాక్షుడు. ఆయన సృష్టియందు జీవులు బహువిధములుగా సంచరించును. రెండుకాళ్ళు, నాల్గుకాళ్ళు, నూరుకాళ్ళు, అసలు కాళ్ళు లేకుండుట, రెక్కలుండుట, ఈదగలుగుట – అంటే ఆయన అనంత జ్ఞానసంపన్నుడై సృష్టివైవిధ్యమునకు కారకుడైనందున సహస్రపాదుడు.

వేదమునందు '**సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్**' అని చెప్పబడెను. శ్రీ విష్ణుసహస్రనామములో కూడా ఇదే క్రమములో ఈ మూడు నామములు చెప్పబడుట గమనార్హము.

శ్రీ చిన్మయానంద – పెక్కు తలలు, పెక్కు కన్నులు, పెక్కు పాదములు – అన్నీ కలిపి ఒకే అనంత చైతన్యమును సూచించును. ఈ సచ్చిదానంద పరబ్రహ్మమే ఆలోచించుట (తల ద్వారా), చూచుట (కన్నుల వలన), నడచుట (కాళ్ళతో) వంటి జీవగుణములను వ్యక్తమొనర్చును.

227. విశ్వాత్మా

విశ్వమునకే ఆత్మ. సకల భూతములకు అంతస్థితుడైన ఆద్యుడు.

ఓం విశ్వాత్మనే నమః

విశ్వస్య ఆత్మా విశ్వాత్మా – శ్రీనివాసుడు తన జ్ఞానమువల్లను, శక్తివల్లను విశ్వమంతయును వ్యాపించియున్నందున విశ్వాత్మకుడగును.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః
అహమాదిశ్చ మధ్యం చ భూతానాం అంత ఏవ చ – గీత 10.20

ఓ అర్జున! సమస్త ప్రాణులయందున్న ఆత్మను నేనే. సకల భూతముల (ప్రాణుల) ఆదియును, మధ్యస్థితియును, అంతము నేనే (ప్రాణులయొక్క సృష్టి, స్థితి, లయములకు కారణము నేనే)

ధర్మచక్రము రచయిత - సకల చరాచర జీవములు పరమాత్ముని స్వరూపములేయని, ఆకార వ్యవహారాది విభేదములు పై పై ఆచ్చాదనలేయని గ్రహించుట ఈ నామస్మరణయొక్క ప్రధాన ధ్యేయము. బయటకు కనిపించు విభేదములను పట్టించుకొనుటవల్ల కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యములు వృద్ధిపొందును. కాని సకల జీవజాలమునందు భగవంతుని దర్శించువారికి ఆయన కటాక్షము సిద్ధించును.

యాజ్ఞవల్క్య మునీంద్రుడు మైత్రేయికి చేసిన ఉపదేశము – **నవాऽరే జాయాయై కామాయ జాయా ప్రియా భవతి ఆత్మనస్తు కామాన జాయా ప్రియా భవతి** ... ... – ఎవరైనను తన భార్యను ఆకారమునుబట్టి గాక ఆత్మనుబట్టి ప్రేమింపవలయును. ఇదే నిజమైన ప్రేమ.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ఆవర్తనో నివృత్తాత్మా సంవృతః సంప్రమర్దనః |
అహఃసంవర్తకో వహ్నిరనిలో ధరణీధరః || (25)

231. ఆవర్తనః

సంసారచక్రమును పరిభ్రమింపజేయువాడు.

ఓం ఆవర్తనే నమః

సంసార చక్రమ్ ఆవర్తయితు శీలమ్ అస్య ఇతి ఆవర్తనః – 'ఆవర్తనము' అనగా మరల మరల జరుగుట. సంసారము అనగా దివారాత్రములు, జననమరణములు, సుఖదుఃఖములు, సృష్టి నాశనములు – ఇలా పునరావృతమగు కాలచక్రము. ఇట్టికాలచక్రము అనంతుని మాయవలననే అవిరామముగా తిరుగుచున్నది. దానిని త్రిప్పువాడు ఆవర్తనుడు. ఆయనను శరణుజొచ్చినవారే ఆ మాయను దాటగలరు.

సంసారాఖ్య ఘటీ యన్త్రే పరివర్తన శీలతః
చక్రవచ్చ విశేషణ హ్యావర్తన ఇతీరితః
జీవులను సంసారము అనే రంగులరాట్నమునందు ప్రవేశపెట్టి వారి కర్మానుసారము త్రిప్పుతూ ఉండేవాడు ఆవర్తనుడు.

దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే – గీత 7.14

నా మాయ త్రిగుణాత్మకమైనది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని కేవలము నిరంతరము నన్నే భజించువారు ఈ మాయను అధిగమించి, సంసార సముద్రమునుండి బయట పడగలరు.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వ భూతాని యంత్రారూఢాని మాయయా – గీత 18.61
అర్జున! శరీర రూప యంత్రములను అధిరోహించిన సర్వప్రాణుల హృదయములయందు అంతర్యామిగానున్న పరమేశ్వరుడు తన మాయ చేత వారివారి కర్మలను అనుసరించి వారిని భ్రమింప జేయుచున్నాడు.

కాలచక్రం జగచ్చక్రం యుగచక్రం చ కేశవః
ఆత్మయోగేన భగవాన్ పరివర్తతేఽనిశమ్ – మహాభారతము. ఉద్యోగపర్వము.
కాలచక్రము, జగచ్చక్రము, యుగచక్రము – వీటన్నింటినీ భగవానుడైన కేశవుడు తన సంకల్పముతో ఎల్లప్పుడూ త్రిప్పుతూనే ఉన్నాడు.

231. నివృత్తాత్మా

- అన్నింటికంటె మహోన్నతమగు పరమపద తత్త్వమూర్తి.
- సంసార చక్రమును త్రిప్పువాడైనను, కోర్కెలకు అతీతుడైనవాడు. మాయాతీతుడు.
- నివృత్తి ధర్మమును పాటించువారికి ఆత్మస్వరూపుడు.
- సంసార బంధములకు అతీతుడు.

ఓం నివృత్తాత్మనే నమః

'నివృత్తాత్మ' నామము 231, 453, 604, 780వ నామములుగా – అనగా నాలుగుమారులు కీర్తింపబడిన మోక్షప్రదమగు నామము. ఈ నామమునకు వ్యాఖ్యానకర్తలు నాలుగు వేర్వేరు వివరణలు ఇచ్చి పునరుక్తి లేదని నిరూపించినారు.

25వ శ్లోకము. 231వ నామము. **నివృత్తాత్మా** – ఆవర్తనో నివృత్తాత్మా సంవృతః సంప్రమర్దనః

48వ శ్లోకము.453వ నామము.
శ్రీ భట్టుల పాఠము ప్రకారము: **నివృత్తాత్మా** – సర్వదర్శీ నివృత్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్
శ్రీ శంకరుల పాఠము ప్రకారము: **విముక్తాత్మా** – సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్

64వ శ్లోకము. 604వ నామము. **నివృత్తాత్మా** – అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృచ్ఛివః

83వ శ్లోకము. 780వ నామము.

శ్రీ భట్టుల పాఠము ప్రకారము: **నివృత్తాత్మా** – సమావర్తో నివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః

శ్రీ శంకరుల పాఠము ప్రకారము: **అనివృత్తాత్మా** – సమావర్తోऽనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః

అన్నింటికంటె మహోన్నతమగు పరమపద తత్త్వమూర్తి. ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణములు – **త్రిపాదూర్ధ్వ ఉదయిత్ పురుషః** – భౌతిక లోకమునకు మూడురెట్లు ప్రశంసనీయమైన పరమపదమున ప్రకాశించు పురుషుడు (పురుషసూక్తము 4).

పరాత్ పరమ్ యన్ మహతో మహాన్తమ్ – అధికమైనవానికన్నింటికిని అత్యధికుడు, మహత్తరమైన అన్నింటికంటె మహాత్ముడు (తైత్తరీయ నారాయణోపనిషత్తు 1.5)

త్రిపాద్విభూతికత్వేన భవపాద విభూతితః
ఉద్గతాక్మ స్వరూపాత్వాత్ నివత్తాత్మేతి కథ్యతే
నిత్యవిభూతిని స్వస్థానముగా గలవాడు కాబట్టి, సంసారమనే లీలా విభూతి స్వభావాలు ఏవీ తనకు అంటకుండా నిర్వహిస్తుంటాడు. (శ్రీ కైవల్యసారధి)

సంసార చక్రమును త్రిప్పువాడైనను, కోర్కెలకు అతీతుడైనవాడు. మాయాతీతుడు.

పరమవైరాగ్య ఖ్యాపనాయ విషయేభ్యః ప్రత్యాహృత మనాః నివృత్తాత్మా – భగవానుని మనసు దేనిని ఆశ్రయించదు. విషయ వ్యామోహములందు చిక్కుకొనదు. మాయచే ప్రభావితము కాదు. ఆయన ధ్యానమునకు గల లక్షణములు –

అంతర్నివిష్ఠ భావమ్ చ – అంతర్ముఖములైన భావములు.

ఆత్మ ధ్యాన పరాయణాయ – తనపైననే నిమగ్నమైన ఆలోచనలు.

హృద్ పద్మార్పిత మానసమ్ – హృదయ కమలమును ఆశ్రయించిన మనస్సు.

నివృత్తి ధర్మమును పాటించువారికి ఆత్మస్వరూపుడు.

ధర్మములు రెండు విధములు. పితృమార్గము ననుసరించి, కర్మఫలముల ననుభవింపజేయునది ప్రవృత్తి ధర్మము. దీనివలన కర్మశేషమును అనుభవించుటకు పునర్జన్మము ప్రాప్తించును. రెండవదైన నివృత్తి ధర్మము కర్మబంధములనుండి విముక్తిని ప్రసాదించును. అట్టి నివృత్తి ధర్మము నవలంబించువారి యాత్మయే పరమాత్ముడగు నివృత్తాత్మ.

సంసార బంధములకు అతీతుడు.

సంసార బంధాన్ నివృత్త ఆత్మా స్వరూపమ్ అస్య ఇతి నివృత్తాత్మా – సంసార బంధములనుండి సంపూర్ణముగా తొలగిన అత్మ గనుక నివృత్తాత్మ. ముండకోపనిషత్తునందు ఒకేచెట్టుపైని రెండు పక్షుల

గురించి చెప్పబడినది. వానిలో ఫలములను తినకుండ ఊరకే చూచుచున్న పక్షియే నివృత్తాత్మ – అని శ్రీ చిన్మయానంద వ్యాఖ్యానించారు.

ధర్మ చక్రము రచయిత చెప్పిన సాధనా ఫలము – సత్యాన్వేషణకై మనము ప్రయత్నింపవలెనంటే కామాది బంధములను అధిగమించాలి. ఈ పుణ్యనామమును స్మరించుటవలన శ్రీమహావిష్ణువు మనకు అటువంటి జీవన విధానమును ప్రసాదించును. బంధములనుండి విముక్తి కలిగించును. శ్రీరాముని జీవనశైలియే 'నివృత్తాత్మ'కు చక్కని దృష్టాంతము. ఆయనకు వస్తువ్యామోహము ఎన్నడును కలుగలేదు.

ఈ నామము మరల చెప్పబడిన సందర్భములలో (456, 604, 780) కొందరు వ్యాఖ్యానకర్తలు 'విముక్తాత్మా' అనిగాని, 'అనివృత్తాత్మా' అనిగాని పాఠాంతరములను స్వీకరించి వ్యాఖ్యానించారు.

232. సంవృతః

కప్పబడియుండువాడు (తెలియ జాలని వాడు)

ఓం సంవృతాయ నమః

'వృంఞ్' – కప్పుట – అనే ధాతువునుండి వచ్చు అర్థము – **సంవృత్వాత్ సంవృతః** – భగవానుని కనుగొనుట సులభము కాదు. తమోగుణ మోహితులైన అజ్ఞానులకు (**తమసః పరస్తాత్**) వాసుదేవుడు కానరాడు. భక్తితో శరణాగతి జొచ్చినవారికి మాత్రము ఆయన బహు సులభుడు. తానై వారికి అందివచ్చును. సఖుడై పాచిక లాడును. సారథియై ముందుకు నడిపించును.

ఈ నామ వివరణ యందు ధర్మచక్రము రచయిత శ్రీ నమ్మాళ్వారుల పాశురమును ఉదాహరించారు (మయర్వఱ మది నిలమ్ అరుళినన్ ఎవనవన్) అజ్ఞానమును, సంశయమును, విపరీత జ్ఞానమును తొలగించి, జ్ఞానమును, భక్తిని ప్రసాదించువానిని పూజింపదగును. సూర్యుని కారణమున ఉద్భవించిన మేఘమే మనకు సూర్యుడు కనుపించకుండ అడ్డుపడును. అదే విధముగా అజ్ఞానము, మోహము మనకు, భగవంతునికి అడ్డుగా నిలుచును. భక్తితో వీనిని చేదించి పురుషోత్తముని కనుగొన సాధ్యమగును.

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః

మూఢోఽయం నాభిజానాతి లోకో మామజ మవ్యయమ్ – గీత 7.25

నా యోగమాయ యందు దాగియున్న నేను అందరికిని గోచరింపను. కనుక అజ్ఞానులు నన్ను జన్మరహితునిగా, శాశ్వతునిగా, పరమేశ్వరునిగా తెలిసికొనలేరు.

భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధోఽర్జున

జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప – గీత 11.54

కాని ఓ పరంతప! అర్జున! ఇట్టి నా (చతుర్భుజ) రూపమును ప్రత్యక్షముగా చూచుటకును, తత్త్వజ్ఞానమును పొందుటకును, అందు ఏకీభావ స్థితి నందుటకును, కేవలము అనన్య భక్తి ద్వారానే సాధ్యమగును (నీవు చూచిన నా చతుర్భుజ రూప దర్శన భాగ్యము అత్యంత దుర్లభము. వేద పఠనములచే గాని, తపశ్చర్యలచే గాని, దానములచే గాని, యజ్ఞకర్మలచే గాని శక్యము కాదు.)

233. సంప్రమర్దనః

- చీకటిని, అజ్ఞానమును, మాయను పారద్రోలువాడు.
- (రుద్రుడు, యముడు వంటి రూపములలో) నాశనము చేయువాడు.
- దుష్టులను హింసించువాడు.

ఓం సంప్రమర్దనాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్యానాన్ని నిరుక్తి రచయిత క్లుప్తముగా ఇలా చెప్పారు – **తమసో విద్యయా సమ్యక్ మర్దనాత్ సంప్రమర్దనః** – చుట్టూరా ఆవరించి ఉన్న గాఢాంధకారమును విద్యతో తగురీతి నాశనము చేయువాడు గనుక సంప్రమర్దనుడగును. చీకటి అనగా భక్తులను క్రమ్మివేసిన మాయ అనీ, భగవంతుడు సంప్రమర్దనుడై మాయను తొలగించుననీ శ్రీ అణ్ణాంగారాచార్య స్వామి వివరణ.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'మర్దనము' అనగా నాశనము చేయుట. **సమ్యక్ ప్రమర్దయతి రుద్ర కాలాద్యాభిః విభూతిః ఇతి సంప్రమర్దనః** – శ్రీమహావిష్ణువు రుద్రుడై లయకార్యమొనర్చును. పుట్టిన ప్రతిజీవియును గిట్టునట్లు చేయు యముడు కూడ ఆయన విభూతియే. కనుక ఆయన సంప్రమర్దనుడు.

శ్రీ చిన్మయానంద – దుష్టులను, కాముకులను, పాపులను (రాక్షసులను) పలువిధములుగా పరిమార్చు దేవుడు సంప్రమర్దనుడు.

ధర్మచక్రము రచయిత ప్రబోధము – దుష్ట కర్మములను త్యజించి, సత్కర్మముల నాచరించుట జీవితములో అత్యావశ్యకము. 'సంప్రమర్దన' నామ స్మరణము వలన అహంకారము, కామము నశించును. భగవానుని చేరు మార్గము సుగమమగును. శ్రీరాముడు దుష్టశిక్షకుడు గనుకనే ఋషులను కాచుటకై కోదండధారిగా అడవికి పోయెను. అట్టి రామనామ జపము బోయవాడగు వాల్మీకిని ఋషిగా, ఆదికవిగా మలిచెను.

234. అహస్సంవర్తకః

సూర్యుని రూపమున ఉండి దినములను చక్కగా ప్రవర్తింపజేయువాడు.

ఓం అహస్సంవర్తకాయ నమః

సంయక్ అహ్నామ్ ప్రవర్తనాత్ అహఃసంవర్తకః – శ్రీమన్నారాయణుడే శ్రీసూర్యనారాయణుడై దివారాత్రముల క్రమమునకు, భూత భవిష్యద్ వర్తమాన కాలవిభజనకు కారకుడగుచున్నాడు. ఇందువల్ల జీవుల పరిణామ క్రమము (పుట్టుక, పెరుగుట, మార్పు, ఉనికి, క్షీణించుట, మరణించుట) సంభవించుచున్నవి. భగవంతుడే సూర్యునిగా జీవితమునకు వెలుగును, శక్తిని ప్రసాదించుచున్నాడు.

శ్రీ చిన్మయానందగారు గీత (!5.12)నుండి ఉదాహరించారు.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్

యచ్చన్ద్రమపి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్

సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నా తేజస్సేయని యెఱుంగుము.

ధర్మచక్రము రచయిత వ్యాఖ్య – శ్రీమహావిష్ణువు బాహ్య ప్రపంచమునకు, అంతరాత్మకు కూడ వెలుగునిచ్చు సూర్యుడు. అహస్సంవర్తకుడు. సూర్యుని వెలుతురులో వస్తువులు కనిపించును. అంతర్యామి అనుగ్రహమువలన ఆత్మజ్ఞానము సాధించు మార్గము కనిపించును. సూర్యోదయము వలన సకల జీవులు నిద్ర లేచును. శ్రీహరిపై భక్తి కలిగినంతనే ఆత్మజ్ఞానముపట్ల శ్రద్ధ దృఢమగును. సూర్యకిరణములు జీవులలో ఉత్సాహమును పెంచును. విష్ణుచింతన జీవాత్మను ప్రకాశవంతము చేయును. సూర్యకాంతి రోగములను హరించి శక్తిసామర్ధ్యములను పెంపొందించును. అహస్సంవర్తకుని ధ్యానించినట్లయిన దురాలోచనలు నశించి, మనసు పరిశుభ్రమగును. ఆయనే మనకంటి వెలుగు. జ్ఞాననేత్రమునకు కనువిప్పు ఆయనే.

235. వహ్నిః

- సమస్తమును వహించువాడు (భరించువాడు)
- దేవతలకు హవిస్సును అందించు అగ్నిహోత్రుడు.

ఓం వహ్నయే నమః

'వహ' – అనగా (భారము) వహించుట – అను ధాతువునుండి ఈ నామమును వ్యాఖ్యానించారు. శ్రీ భట్టులు – సకల భువనములు రోదసి (Space)లో వ్యాపించి యున్నవి. స్థలము లేని యెడల పదార్థము లేదు. శక్తి లేదు. ఈ స్థలము (Space) అనంత ఖగోళ మండలమును భరించుచున్నది. అలా సర్వత్ర వ్యాపించిన అంశము (Dimension, Space) భగవానుడే. కనుక ఆయన వహ్ని యగును.

విశ్వస్య దేశరూపేణ వహనా ద్వహ్ని రుచ్యతే – పరమాకాశము, గగనాది సమస్త దేశములు, బద్ధ, ముక్త్యాది రూపమైన సమస్త ప్రపంచాన్ని వహించేవాడు.

శ్రీ అణ్ణాంగారాచార్య – అందరిని భరించువాడు భగవానుడు.

శ్రీ శంకరులు – 'వహ్ని' అనగా అగ్ని. **దేవేభ్యో హవ్యమ్ వహ నః ప్రజానన్ – హవిర్వసహనాత్ వహ్నిః** – అగ్నియై, యజ్ఞయాగాదులయందు హోమము చేయబడిన హవిస్సును దేవతలకందించువాడు వహ్ని.

236. అనిలః

రెండు మాత్రలతోకూడిన ఈ నామమునకు విజ్ఞులు 11 విధములైన అర్థములను వ్యాఖ్యానించి అనంతగుణ సంపన్నుని అర్చించినారు. శ్రీహరి తన భక్తులకు పలురీతులుగా అవగతమగును. అన్ని యెడల వారి కందుబాటులో నుండును. కొండలలో నెలకొన్న కోనేటిరాయడు కొలిచినవారికి కొంగు బంగారము. మ్రొక్కినవారికి వరముల పెన్నిధి.

(1) వాయువు. ప్రాణమునకు ఆధారమైన ఊపిరి.

(2) ప్రేరణ లేకుండగనే (పేరెవరు చెప్పకుండానే) భక్తుల కోర్కెలు తీర్చువాడు.

(3) ఆది లేనివాడు.

(4) సంగమము (బంధము) లేనివాడు. మంచి, చెడులకు అతీతుడు.

(5) కరిగిపోనివాడు.

(6) సర్వజ్ఞుడు.

(7) భక్తులకు సులభముగా అందువాడు.

(8) స్థిరమైన నివాసము (నిలయము) లేనివాడు.

(9) ఇల (భూమి) ఆధారము అవుసరము లేనివాడు.

(10) అన్నిచోట్ల ఉండువాడు (ఎక్కడో దాగనివాడు)

(11) సదా జాగరూకుడగువాడు.

ఓం అనిలాయ నమః

ఈ నామము మరల 818వ నామముగా చెప్పబడినది.

25వ శ్లోకము. 236వ నామము. అనిలః – **అహః సంవర్తకో వహ్నిరనిలో ధరణీధరః**

87వ శ్లోకము. 818 నామము. అనిలః – **కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః**

(1) వాయువు. ప్రాణమునకు ఆధారమైన ఊపిరి.

తదేవాగ్నిః తద్వాయుః – అని తైత్తరీయారణ్యకము(10)లో చెప్పబడినది. 235వ నామము 'వహ్నిః' అనగా అగ్ని. 236వ నమము 'అనిలః' అనగా వాయువు. ఆ పరబ్రహమమే అగ్ని. ఆ పరబ్రహ్మమే వాయువు.

అననాత్ ఉజ్జీవనాత్ అనిలః – అందరికి జీవనాధారమగు శ్వాసను ప్రసాదించువాడు గనుక ఆయన అనిలుడు.

కోహేవాన్యాత్ కః ప్రాణ్యాత్ – తైత్తరీయ నారాయణము (7). ఆకాశము (పరమాత్మ) లేనిదే ఎవరు ఊపిరి తీసికొనగలరు? ఎవరు జీవించగలరు?

ప్రాణాత్ వాయురాజాయత – ఆయన శ్వాసనుండి వాయువు ఉద్భవించినది. (పురుష సూక్తము. 14)

(2) ప్రేరణ లేకుండగనే (వేరెవరు చెప్పకుండానే) భక్తుల కోర్కెలు తీర్చువాడు.

మరల ఈ నామము 818వ నామముగా వచ్చినపుడు శ్రీభట్టులు ఈ అర్థంలో వ్యాఖ్యానించారు. **ఇలతి ప్రేరణమ్ కరోతి ఇతి ఇలః తద్రహితత్వాత్ అనిలః** – ప్రేరణము అవుసరమైనవాడు 'ఇలః'.అలాంటి అవుసరము లేనివాడు గనుక 'అనిలః'. ఏ విధమైన ప్రోత్సాహము లేకుండా (తనంత తానే) భక్తుల అవుసరములను తీర్చువాడు అనిలుడు.

విష్ణుధర్మము 74.42 – **తదప్య ప్రార్థితమ్ ధ్యాతో దదతి మధుసూదనః** – ప్రార్థన చేసినంతనే, మరేవిధమైే ప్రేరణ లేకుండ, భక్తులకు వరములు ప్రసాదంచువాడు మధుసూదనుడు.

శ్రీ శంకరులు పై రెండు అర్థములను చెప్పి, ఇంకా మరికొన్ని అర్థములను కూడా చెప్పారు.

(3) ఆది లేనివాడు.

అనాదిత్వాత్ అనితి యోऽసు అనిలః – ఆది లేనందున ఆయన అనిలుడనబడును.

(4) నిస్సంగుడు. సంగమము (బంధము) లేనివాడు. మంచి, చెడులకు అతీతుడు.

అనాదానాత్ అనిలః – భగవంతునకు ఏ విధమైన బంధములు, విషయ వాసనలు వర్తించవు.

(5) కరిగిపోనివాడు.

తరగనివాడు. నిత్యమై నిఖిలమై నిలిచియుండును.

(6) సర్వజ్ఞుడు.

ఇల అనగా నిద్ర, అజ్ఞానము. అనిలుడు అనగా సర్వజ్ఞుడు.

(7) భక్తులకు సులభముగా అందువాడు.

నిలతేర్ గహనార్థాత్ క-ప్రత్యయాంతాత్ అగహనః అనిలః – భక్తులకు అందుబాటులో ఉండువాడు. పిలిచిన పలికెడు దేవుడు. కొలిచిన కరుణించు విభుడు. వేడుకున్న కాచెడు రాముడు.

(8) స్థిరమైన నివాసము (నిలయము) లేనివాడు.

అనిలాయ అనిలః న విద్యతే నిలయమ్ స్థానమ్ యస్య – ఆయనకొక్కచోట నిలయము అనిచెప్పరాదు. ఆయన సర్వోపగతుడు. ప్రహ్లాదుని రక్షింప స్తంభమునుండి వెడలిన దేవుడు. ఏడు కొండలపైని వేంచేసినాడు. ఇంటింటను అర్చామూర్తియై పూజలందుకొనుచున్నాడు. ప్రతిజీవుని యందును అంతర్యామియై జీవనాధారమైనవాడు. ఆయన లేని చోటు లేదు. ఆయన కాని వస్తువు లేదు.

(9) ఇల (భూమి) ఆధారము అవుసరము లేనివాడు.

'ఇల' అనగా భూమి. ఈ లోకమున అన్ని జీవులకును ఆధారము భూమి. భగవంతుడు భూమికంటే ముందేయుండెను. ఆయనకు వేరు ఆధారము ఉండజాలదు. కనుక ఆయన అనిలుడు (శ్రీ రాధాకృష్ణశాస్త్రి)

(10) అన్నిచోట్ల ఉండువాడు (ఎక్కడో దాగనివాడు)

న నిలీయతే ఇతి అనిలః – భగవంతుడు ఎక్కడో దాగియుండునను భావము కలదు. కాని ఆయన సర్వస్థితుడు. అవిచ్ఛిన్నుడు. ఇవన్నీ వాయువునకు గల లక్షణములు. అందువలన భగవంతుని కూడ అనిలుడని కీర్తింపనగును.

(11) సదా జాగరూకుడగువాడు.

ఇలతి స్వపితి ఇతి ఇలః, తద్ విపరీతః అనిలః – 'ఇల' అనగా నిద్రించుట. నిదురించనివాడు అనిలుడు. జాగృతుడు. **జాగృవిమ్ విభుమ్** – అని ఋగ్వేదములో ఉన్నది. నిద్ర అజ్ఞానమునకు చిహ్నము. జ్ఞానస్వరూపుడైనందున దేవుడు అనిలుడు.

శ్రీనివాసుని 'అనిల' గుణధ్యానమును యొక్క విశిష్టతను ధర్మచక్రము రచయిత ఇలా వివరించారు. ఊపిరి లేకుండ జీవనము క్షణములోనే సమసిపోవును. అలానే విష్ణు ధ్యానము చేయని ఆధ్యాత్మికత నిలువజాలదు. తాను భోజనము లేకుండ ఎన్నో రోజులు ఉండగలనని, కాని ప్రార్థన చేయకుండ ఒక్కరోజు కూడ బ్రతుకలేనని మహాత్మాగాంధీగారు చెప్పారు. ఇంకా, మనస్సు వాయువువలె నియంత్రించుటకు దుష్కరమని అర్జునుడు చెప్పాడు. భగవానుడు కూడా వాయువులాగా అన్నిచోట్లను వ్యాపించియుండును. కాని విష్ణుధ్యానముతో కేంద్రీకృతమైన మనసే దేవుని దర్శించగలదు.

237. ధరణీధరః

భూమిని ధరించువాడు, పోషించువాడు.

ఓం ధరణీధరాయ నమః

శ్రీమన్నారాయణుడే ఆదిశేషుని రూపమున, అష్టదిగ్గజముల రూపమున, ఆదివరాహమూర్తి రూపమున భూమిని ధరించియుండువాడు.

ధరణీమ్ ధరతి ఇతి ధరణీధరః – ధరణి యనగా భూమి. భూమిని ధరించినవాడు ధరణీధరుడు. ఈ అర్థమును శ్రీ భట్టులు ఇంకొంచెం ముందుకు తీసికొని వెళ్ళి, 'ఇతరులను ధరించేవారిని ధరించేవాడు' అని విశేషంగా వ్యాఖ్యానించారు. సమస్త ప్రాణికోటులను భూమి ధరించును. భూమిని ఆదిశేషుడు ధరించును. ఆదశేషుని అనంతపద్మనాభుడు ధరించును.

సదాధార పృథ్వీమ్ ద్యామ్ ఉతేమామ్ – ఆయన భూమిని, స్వర్గమును భరించును (యజుర్వేదము 13.4)

ఉధృతాऽసి వరాహేణ – శ్రీవరాహమూర్తి నిన్ను (భూమాతను) ఉద్ధరించెను (తైత్తరీయారణ్యము 10.8)

పృథ్వీమ్ చ అంతరిక్షమ్ చ ద్యామ్ చైవ పురుషోత్తమః
మానసైవ విస్సృష్టాత్మా నయతి ఆత్మవశమ్ వశీ

భూమిని, అంతరిక్షమును, ఊర్ధ్వలోకములను పురుషోత్తముడు తన సంకల్పమాత్రముననే సృజించెను. విశ్వాధిపుడైన ఆయన వానినన్నింటిని తన నియంత్రణలో ఉంచుకొనును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు ఇదే అర్థము వచ్చే మరికొన్ని నామములను ప్రస్తావించారు – మహీభర్తా (184), మహీధరః (319. 371), త్రిలోకధృత్ (757), ధరాధరః (762). ఇంకా 240వ నామము 'విశ్వధృక్'ను ఇదే అర్థములో కొందరు వ్యాఖ్యాతలు వివరించారు.

ధర్మచక్రము రచయిత ఈ 'ధరణీధరః' నామము ప్రాముఖ్యతను చక్కగా వివరించారు – భగవంతుడు ప్రత్యక్షముగాను, పరోక్షముగాను కూడ భూమిని, జీవులను పోషించును. సకల జీవరాశులు భూమిపైని లభించు ధాన్యాది ఆహారములను గాని, ఆ యాహారమును తినే పేరు జంతువులను గాని తిని బ్రతుకును. అందుకు కావలసిన శక్తిని, అవకాశమును, బుద్ధిని భగవంతుడే ప్రసాదించుచున్నాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – తల్లి బిడ్డలను కాపాడును. భర్త భార్యను కాపాడును. అందరిని భగవానుడు కాపాడును. కనుక భగవానుని ధరణీధరత్వమును ఎల్లెడల మనము దర్శింపవచ్చును.

ధరణీధరుడే బిడ్డల కొరకు తల్లుల చన్నులలో పాలు నింపును. పూలకు రంగులద్దును. మేఘములలో నీరు నింపును. జీవితముపైని తీపిని పెంచును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ఓం నమో శ్రీనారసింహాయ

(శ్రీ భండారు పర్వతరావు రచన "**ఓం నమో శ్రీనారసింహాయ**" నుండి, మరియు పోతన భాగవతమునుండి సంగ్రహించినది.)

ప్రహ్లాద వరదుని తిరుమంజనము - అహోబిలం - www.sadagopan.org

శ్రీనారసింహుడు హిరణ్యకశిపుని సంహరించిన విధము.

విహగేంద్రుండహి వ్రచ్చు కైవడి మహోద్వృత్తిన్ నృసింహుండు సా
గ్రహుడై యూరువులందు చేర్చి నఖ సంఘాతంబులన్ వ్రచ్చె దు
స్సహ దంభోళి కఠోరదేహు నచలోత్సాహున్ మహాబాహు నిం
ద్ర హుతాశాంతక భీకరున్ ఘనకరున్ దైత్యాన్వయ శ్రీకరున్

హిరణ్యకశిపుని తన తొడలపై వేసికొనినాడు హరి. హిరణ్యకశిపుని గుండె నరహరి చీలుస్తాడు. నేలనిండా నెత్తురు చల్లుతాడు. కఠినములైన నరాలను తెంపుతాడు. రొమ్మును పగులగొడతాడు. మాంసాన్ని ముక్కలుగా చేస్తాడు. పేగులు హారాలుగా మెడలో వేసుకొంటాడు.

చించున్ హృత్కమలంబు శోణితము వర్షించున్ ధరామండలిన్
ద్రెంచున్ గర్కశ నాడికావళులు భేదించున్ మహావక్షముం
ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా దుష్టాసురున్ వ్రచ్చిద
ర్పించున్ బ్రేవులు కంఠమాలికలుగ గల్పించున్ నఖోద్భాసియై

రాక్షసుని చీలుస్తుంటే, నరహరి గోళ్ళు గొడ్డళ్ళవలె ఉన్నాయి. లోతైన గుండెను బద్దలు కొట్టేటపుడు గుద్దళ్ళవలె నున్నాయి. నరాలను త్రెంచేటపుడు గట్టి కొడవళ్ళవలె నున్నాయి. కడుపులోని పేగులను తెంచేటపుడు రంపాలలా ఉన్నాయి. నరసింహుని గోళ్ళను చూసి దేవతా ముఖాలు వికసిస్తున్నాయి. రాక్షసరాజు శరీరాన్ని

చీలుస్తున్నాయవి. అగ్ని జ్వాలలకన్న ప్రకాశమానంగా ఉండి నరహరికి మ్రొక్కేవారలకు అభయదానం చేస్తున్నాయి.

ఇట్లు కేవల పురుష రూపంబును, మృగరూపంబునుం గాని నరసింహ రూపంబున, రేయునుం బగలునుం గాని సంధ్యా సమయమున, నంతరంగంబును బహిరంగంబును గాని సభాద్వారంబున, గగనంబును భూమియుం గాని యూరు మధ్యంబున, బ్రాణ సహితంబులును బ్రాణరహితంబులును గాని నఖంబులన్ త్రైలోక్య జన హృదయ భల్లుండైన దైత్యమల్లుని వధియించి, మహాదహన కీలాభీల దుర్గనుండును, కరాళ వదనుండును, లేలిహాన భీషణ జిహ్వుండును, శోణిత పంకాంకిత కేసరుండునై ప్రేవులు కంఠమాలికలుగ ధరించి, కుంభి కుంభ విదనంబుం జేసి, తదీయ రక్తసిక్తంబులైన నఖంబులు సంధ్యారాగ చంద్రరేఖ చెలువు వహింప, సహింపలేక లేచి, తన కట్టెదుర నాయుధంబు లెత్తుకొని, తత్తఱంబున రణంబునకు నురవణించు రక్కసులం బెక్కు సహస్రంబులం జక్రాది నిర్వక్ర సాధనంబుల నొక్కనిం జిక్కకుండం జక్కడిచె.

హిరణ్యకశిపుని వధానంతరం రాక్షస సేనను చంపిన నరసింహుని భూతసింహుడు అంటారు (లక్ష్మీపురం నృసింహగిరిపై వెలసిన నరసింహుడు భూతసింహుడు). ప్రాచీన నరసింహాలయాలలో నివురుగప్పిన నిప్పులా వుండిపోయిన గుడి ఒకటి పశ్చిమగోదావరి జిల్లా లక్ష్మీపురం దగ్గర గల ఐ.ఎస్.జగన్నాధపురం (కామవరపుకోట సమీపంలో ఐ.ఎస్. రాఘవాపురం, ఐ.ఎస్. జగన్నాధపురం ల మధ్య) వద్దనున్న నృసింహగిరిపైన ఉంది. ఈ ఆలయంలో ఉన్నది భూతసింహుడని శ్రీ వి.వి. శ్రీధర్ గురూజీ చెప్పారు. స్థానికుల సాయంతో, ముఖ్యంగా ఓరియెంటల్ ఇన్సూరెన్సు డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీ కె.ఎస్.వి. నరసింహంగారి పూనికవల్ల ఈ ఆలయాన్ని గురూజీ పునరుద్ధరించారు.

నరసింహుని సరసన, కనకవల్లి (మహాలక్ష్మి)ని, ఎదురుగా పంచముఖ ఆంజనేయుడిని, ప్రక్కన ఏకాక్షర గణపతిని, వెనుక సర్పశ్రీనివాసుడినీ ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో స్వామి ఎంతో శక్తివంతమైనవాడనీ, రోగులకు స్వస్థత చేకూర్చడంలోనూ, కోరిన కోర్కెలను తీర్చడంలోనూ భక్తసులభుడని గురూజీ (శ్రీ మహాసుదర్శన జ్వాలానృసింహ పీఠాధిపతులు, సికిందరాబాద్) అంటారు.

(ఈ ఆలయం మా స్వగ్రామమైన పెదవేగికి ఎక్కువ దూరం కాదు. చిన్నతిరుపతి వెళ్ళినప్పుడు అక్కడినుండి నృసింహగిరికి వెళ్ళి ఇక్కడి భూతసింహుని దర్శించుకొనే మహద్భాగ్యము నాకు లభించినది – కా.సు.బాబు)
ఓం నమో శ్రీనారసింహాయ.

రక్షోవీరుల నెల్ల ద్రుంచి రణ సంరంభము చాలించి దృ
ష్టి క్షేపంబు భయంకరంబుగ సభా సింహాసనారూఢుడై

యక్షీణా గ్రహుడై నృసింహుడు కరాళాస్యంబుతో నొప్పి దన్
వీక్షింపం బరికింపనోడి యమరుల్ విభ్రాంతులై డాగగన్

స్వామి చూపులు భయంకరమైన మంటలవలెనున్నాయి. జూలు నిండా నెత్తురు, బురద అంటుకొన్నాయి. ప్రేవులను కంఠమాలికలుగా వేసుకొన్నాడు. రాక్షసుని రక్తం అంటి గోళ్ళు సంధ్యాకాలంనాటి ఎర్రదనాన్ని సంతరించుకున్నాయి. స్వామి జూలు విదిలిస్తే మేఘాలు చెదిరాయి. ఆయన చూపులకే గ్రహాలు గతులు తప్పాయి. ఆయన నిట్టూర్పులకు సముద్రాలు అల్లకల్లోలమయ్యాయి. ఆయన గర్జనలకు దిగ్గజాలు ఉలికిపడ్డాయి. ఆకాశమంతా ఆయన జూలు తాకిడికి దూరంగా చెదిరిపోయిన దేవతా విమానాలతో నిండింది. ఆయన పాదాలు నేలపై మోపినపుడు భూమి అదిరింది. ఆయన కాంతిముందు దిక్కులన్నీ వెలవెలపోయాయి.

ఓం నృసింహాయ విద్మహే
వజ్రనఖాయ దీమహి
తన్నృసింహః ప్రచోదయాత్

సునందుడు, కుముదుడు మొదలైన శ్రీమహావిష్ణువు పార్శ్వచరులు విచ్చేశారు. శివుడు, బ్రహ్మ మొదలగు దేవతలంతా బయలుదేరి అక్కడకు చేరుకున్నారు. దేవతలు, అశ్వముఖులు, అశ్వదేహులు, నాగులు, సిద్ధులు, సాధ్యులు, గరుడులు, గంధర్వులు, విద్యాధరులు, ప్రజాపతులు మొదలైనవారంతా నరసింహుని దర్శనానికై వచ్చారు. వచ్చి చేతులు జోడించి నుదుట చేర్చి నమస్కరించారు. దగ్గరకు వెళ్ళే సాహసం లేక దూరంనుంచే ప్రణతులర్పించారు. ఒక్కొక్కరు ఒక్కొక్కతీరున ఆయనను స్తుతించారు.

బ్రహ్మ స్తుతి

ఘన లీలా గుణచాతురిన్ భువనముల్ గల్పించి రక్షించి భే
దనముం జేయు దురంత శక్తికి ననంత జ్యోతికిన్ జిత్ర వీ
ర్యునికి న్నిత్య పవిత్ర కర్మునికి నేనుత్కంఠతో నవ్యయాత్మునికిన్
వందన మాచరించెద గృపాముఖ్య ప్రసాదార్థినై

రుద్రుడిట్లనియె

అమర వరేణ్య! మీదట సహస్ర యుగాంతము నాడు గాని కో
పమునకు వేళ గాదు సురబాధకుడైన తమస్వినీ చరున్
సమరమునన్ వధించితివి చాలు దదాత్మజుడైన వీడు స
ద్విమలుడు నీకు భక్తుడు పవిత్రుడు గావుము భక్తవత్సలా

బ్రహ్మాదులంతా ప్రహ్లాదుని దగ్గరకు తీసికొన్నారు – నాయనా! నీ తండ్రి నిమిత్తం కోపాన్ని పూనాడు స్వామి. ఆయనను శాంతింపజేయి – అన్నారు. ప్రహ్లాదుడు మెలమెల్లగా స్వామి దగ్గరకు పోయి, అంజలి ఘటించి, నమస్కరించాడు. తరువాత అన్ని అవయవాలు భూమిని సోకేలా సాష్టాంగ దండప్రమాణం చేశాడు.

స్వామి కరుణ యుప్పొంగగా బాలుని దగ్గఱగా తీసికొనినాడు. ఇంపుగా వెలిగే చూపులతో ప్రసన్నంగా చూశాడు. లోకాలన్నింటి నుతులు స్వీకరించే శ్రీహరి, దానవాంతకుడైన నరహరి, బాలుని తలపై తన చేయినుంచాడు. కాలసర్పం భయంనుండి కూడా కాపాడి అభయదానం చేసే ప్రశస్తి గల హస్తమది. అడ్డు లేకుండా అన్ని విధాలా శుభాలను కురిపించే చేయి అది.

ప్రాభవమొప్ప నుత్కట కృపామతియై కదియంగ జీరి సం
శోభిత దృష్టి సంఘముల జూచుచు బాలుని మౌళియందు లో
కాభినుతుండు పెట్టె నసురాంతకు డుద్భట కాలసర్ప భీ
తాభయ దాన శస్తము ననర్గళ మంగళ హేతుహస్తమున్

వినయ వివేక భూషణుడైన ప్రహ్లాదుడు ఆ మంగళ హేతుహస్తము స్పర్శతో పులకాంకితుడై, భక్తితో పరవశించి, చేతులు జోడించి దేవదేవుని ప్రస్తుతించాడు.

తపమున్ వంశము తేజమున్ శ్రుతము సౌందర్యంబును
ద్యోగమున్ నిపుణత్వంబుప్రతాప పౌరుషములున్ నిష్ఠాబల ప్రజ్ఞలున్
జప హోమంబులు జాలవీశ్వర! భవత్సంతుష్టికిన్ దంతి యూ
థపు చందంబున భక్తి సేయవలయున్ దాత్పర్య సంయుక్తుడై.

కావున నల్పుడ సంస్తుతి
గావించెద వెఱపు లేక కల నేరుపునన్
నీ వర్ణనమున ముక్తికి
బోవు నవిద్యను జయించి పురుషు డనంతా!

మహాత్మా! దుష్టజన సంహారంబును, శిష్ట భృత్య మునిజన రక్షాప్రకారంబును నీకు నైజ గుణంబులు. విశ్వంబు నీవ. గుణాత్మకమైన విశ్వంబు సృజియించి, యందు ప్రవేశించి, హేతు భూత గుణ యుక్తుండవై, రక్షక సంహారకాది నానారూపంబుల నుండుదువు. సదసత్కారణ కార్యాత్మకంబైన విశ్వంబునకుం బరమ కారణంబు నీవ. నీ మాయచేత వీడు దా ననియెడు బుద్ధి వికల్పంబు దోచు గాని, నీకంటె నొండెద్దియు లేదు. బీజంబునందు వస్తుమాత్ర భూత సౌక్ష్మ్యంబును, వృక్షంబునందు నీలత్వాది వర్ణంబును గలుగు తెఱంగున, విశ్వంబునకు నీయంద జన్మస్థితి ప్రకాశ నాశనంబులు గలుగు ......

కృత త్రేతా ద్వాపర యుగంబులందును, తిర్యఙ్మానవ ముని జలచరా కారంబుల నవతరించి, లోకంబుల నుద్ధరింపుచు, ధరియించుచు, హరియింపుచు, యుగానుకూల ధర్మంబులం బ్రతిష్ఠించుచుందువు. దేవా! అవధరింపుము ... ... భవదీయ దాస్య యోగంబు కృప సేయుము.

ప్రసన్నుడైన స్వామీ – ఓ ప్రహ్లాదా! నీకు భద్రమగుగాక. నేను ప్రీతి చెందాను. నీయంతర్వాంఛిత లాభమెల్ల కరుణాయుక్తుండనై యిచ్చెదను. నేను అన్ని రకాల భద్రములకు నాధుడను. జంతుశ్రేణికి నన్ను జూచిన పునర్జన్మంబు లేదు – అని యానతిచ్చెను.

ప్రహ్లాదుడు – స్వామీ! నా తండ్రి యొనర్చిన భాగవతాపచార పాపమునుండి విముక్తుడు కావలె – అని కోరుకొన్నాడు.

భగవంతుడు – ఓ పాపరహితా! నిన్ను కుమారునిగా పొందినపుడే నీ తండ్రి త్రిసప్త పూర్వజులతో సహా పావనుడైనాడు. నాయనా! నా స్పర్శకు నోచుకొని పవిత్రుడైన నీతండ్రికి ప్రేతకార్యం చేయి. మంచి కొడుకులను కన్నవారు ఉత్తమ లోకాలకు వెళతారు. నీవు నీతండ్రి సింహాసనాన్ని అధిష్టించు. విజ్ఞుల ఉపదేశాన్ని పొందుతూ ఉండు. నాయందే మనసు నిలుపు – అని ఆనతిచ్చాడు

బ్రహ్మ ఇలా అన్నాడు.

పరము గృప సేసితివి మేలు వారిజాక్ష
నీ నృసింహావతారంబు నిష్ఠతోడ
దగిలి చింతించువారలు దండధరుని
బాధనొందరు మృత్యువు బారిపడరు.

ఓం నమో శ్రీ నారసింహాయ

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వధృగ్విశ్వభుగ్విభుః (విశ్వసృడ్విశ్వభుగ్విభుః) | సత్కర్తా సత్కృతః సాధుర్జహ్నుర్నారాయణో నరః || (26)

238. సుప్రసాదః

అనుగ్రహ స్వరూపుడు. శుభకరమగు ఫలములు ప్రసాదించువాడు.

ఓం సుప్రసాదాయ నమః

శోభనః ప్రసాద దాతృత్వాత్ సుప్రసాదః – కరుణామృత మూర్తియైన శ్రీహరి తనకు శరణాగతులైనవారికి మంచి ప్రసాదము లొసగును. కనుక శ్రీహరియే సుప్రసాదుడు.

శరణాగతులకు శుభములనిచ్చుటతో పరిమితము గాకుండ, భగవంతుని సుప్రసాదత్వము ఆయన శత్రువులకు కూడ శుభములు కూర్చును. రావణుడు, శిశుపాలుడు, దుర్యోధనుడు వంటి భగవద్విరోధులు కూడ భగవంతుని యనుగ్రహము వలన మోక్షమును పొందిరి. అంటే ఆయన ప్రసాదించేదంతా శుభకరమే. ఈ సుప్రసాద గుణము స్వామిదేశికుల దయాశతకమునందు పదే పదే ప్రస్తావింపబడినది. పరశురామునిచేత మరణించిన క్షత్రియులు తమ పాపకర్మములనుండి విముక్తులై మోక్షమును పొందిరి. అదే విధముగా కలియుగాంతమున శ్రీమహావిష్ణువే కల్కియై పాపులను పరిమార్చి, ఇంక పాపములు చేయు అవకాశము లేకుండ చేసి, ధర్మయుతమైన కృతయుగమునందు సకల జీవులు వృద్ధిపొందు స్థితిని కలుగజేయును.

ధర్మచక్రము రచయిత వ్యాఖ్య – కొందరు ఉపకారులకు ఉపకారము చేస్తారు. అపకారులకు అపకారము చేస్తారు. కొద్దిమంది ఉపకారులకు కూడ అపకారము చేస్తారు. ఇంకొద్దిమంది అపకారులకు కూడ

ఉపకారము చేస్తారు. కాని అవతలివారి కార్యములతో నిమిత్తము లేకుండ భగవంతుని చేష్టలు మాత్రము సర్వదా సర్వులకు శుభకరములే. శ్రీమహావిష్ణువుయొక్క 'సుప్రసాదః' నామమును ధ్యానించువారికి సాత్త్విక మార్గమున పయనించు భాగ్యము లభించును.

అన్నమయ్య కీర్తన

పలువిచారములేల పరమాత్మనీవు నాకు - కలవు కలవు ఉన్న కడమలేమిటికి

నీపాదముల చెంత నిబిడమైతే చాలు - యేపాతకములైన ఏమిసేసును
యేపార నీభక్తి ఇంత గలిగిన చాలు - పై పై సిరులచ్చట పాదుకొని నిలుచు

సొరిదినీ శరణము జొచ్చితినంటే చాలు - కరుణించి యప్పుడట్టే కాతువు నీవు
సరుస నీముద్రలు భుజములనుంటే చాలు - అరుదుగా చేతనుండు అఖిలలోకములు

నేరక వేసిన చాలు నీమీద ఒక పువ్వు - కోరిన కోరికలెల్ల కొనసాగును
మేరతో శ్రీవేంకటేశ నిన్నుగొలిచితి నేను – యే రీతి నుండిన గాని యిన్నిటా ఘనుడను

239. ప్రసన్నాత్మా

ప్రసన్నమైన, ప్రశాంతమైన మనస్సు గలవాడు.

ఓం ప్రసన్నాత్మనే నమః

భగవంతుని మనస్సు సర్వదా ప్రశాంతముగ నుండును. ఆయన రాగ ద్వేష రహితుడు. త్రిగుణాతీతుడు. కరుణామూర్తి. మానవులు ప్రకృతి జన్యములగు మూడు గుణముల చేత బద్ధులు గనుక దుఃఖితులు. భగవానుడు త్రిగుణాతీతుడు గనుక ప్రసన్నాత్ముడు.

అవాప్త సర్వ కామత్వాత్ రాగాది రహితం మనః
యస్యాస్తి స ప్రసన్నాత్మా చిత్తతుష్టిప్రదోమనుః
సర్వ కామ రాగములకు అతీతుడు గనుక ప్రసన్నాత్ముడు. ఈ నామధ్యానము చిత్తశాంతినిచ్చును.
ఓం ప్రసన్నాత్మనే నమః.

అవాప్త సర్వ కర్మత్వాత్ (కామత్వాత్?) –దేవదేవునకు ఏ విధమైన కోర్కెలు, కామములు వర్తించవు. ఆయనకు సమస్తమును సిద్ధించినవి. కనుక ఆయన ప్రసన్నాత్ముడు.

కరుణార్ద్ర స్వభావాత్ – శ్రీహరి కరుణామూర్తి. భక్తుల పాలిటి కామధేనువు. కనుక ఆయన ప్రసన్నాత్ముడు.

శ్రీ పి.బి.అణ్ణాంగారాచార్య స్వామి – ఆయన రాగద్వేష రహితుడు. ఇష్టానిష్టములు ఆయనను ప్రభావితము చేయవు.

శ్రీ చిన్మయానంద – వస్తువులు, వాని గుణములు, వానిపై మోహము దుఃఖములకు కారణములు. రజోగుణము, తమోగుణములు అట్టి వాంఛలను, దుఃఖ కారణమగు కర్మలను ప్రేరేపించును.

ధర్మచక్రము రచయిత ఈ సందర్భమున రావణ, కుంభకర్ణ, విభీషణుల ఉదాహరణ చెప్పారు. రజోగుణము అధికముగానున్న రావణుడు కామమోహితుడై, అధర్మ కార్యముల నాచరించి నాశనము కొనితెచ్చుకొనెను. కుంభకర్ణుడు తమోగుణ ప్రభావమున నిద్రాహారములకు దాసుడయ్యెను. సత్వగుణ సంపన్నుడైన విభీషణుడు భగవంతుని శరణుజొచ్చి, ఆయన అనుగ్రహము పొంది, లంక సర్వనాశనము కాకుండ కాపాడెను. భగవంతుని 'ప్రసన్నాత్మ' నామమును ధ్యానించుట వలన అట్టి సత్వగుణము వృద్ధిచెంది, మనస్సు నిర్మలమగును. ఆ విధమైన తత్వము కలిగి యున్నందునే భీష్ముడు ధర్మవిజయము తథ్యమని, కృష్ణుడున్నచోటనే ధర్మముండునని గ్రహించెను.

పద్మపురాణము – క్షేత్రకాండము – 33వ అధ్యాయము

జితంతే పుణ్డరీకాక్ష! నమస్తే విశ్వభావన!
నమస్తేఽస్తు హృషీకేశ! మహాపురుష పూర్వజ!

నమః శ్రీధామ నిలయ! నమః శ్రీవత్స లక్షణ
నమస్త్రిధాత్మనే తుభ్యం నమః శ్రీధనమోహన!

నాకౌకః ప్రత్యనీకారే! నారాయణ! నమోస్తుతే!
నాగపర్యఙ్క శయనా నాథనాథ! నమోనమః

విశ్వ స్రష్టే విశ్వభర్త్రే విశ్వ త్రాత్రే విచక్షణ!
విశ్వాన్తర్యామినే తుభ్యం విశ్వోత్తీర్ణ! విభో నమః

240. విశ్వస్పృట్ / విశ్వధృగ్ / విశ్వస్పృష్ట్ / విశ్వస్పృగ్

విశ్వమును సృజించినవాడు.

విశ్వమును ధరించువాడు.

ఓం విశ్వసృజే నమః

ఓం విశ్వధృశే నమః

శ్రీ భట్టులు 'విశ్వసృట్' అనే పాఠమును స్వీకరించి, **విశ్వమ్ సృజతి యో స విశ్వసృట్** – అని వ్యాఖ్యానించారు. భగవంతుడు కరుణామయుడై, విశ్వమును సృష్టించినాడు.

శ్రీ శంకరులు 'విశ్వధృగ్' అనగా, విశ్వమును తన అధీనములో ధరించి, బాగోగులు గమనించువాడు – అని వ్యాఖ్యానించినారు.

ఇంకా శ్రీ శ్రీనివాస రాఘవన్ గారు తమ 'నృసింహప్రియ'లో 'విశ్వసృష్ట్', 'విశ్వసృగ్' అను మరి రెండు పాఠాంతరములను ప్రస్తావించారు.

'విశ్వధృగ్' నామము అర్థమును వివరిస్తూ, ధర్మచక్రము రచయిత ఇలా తర్కించారు – మనసు మన అధీనములో ఉండునా? మనము మనసు అధీనములో ఉందుమా? మనస్సుపై ఆధిపత్యము సంపాదించినవారికి వారి కుటుంబము, వారి దేశము చెప్పుచేతలలోనికి వచ్చును. వారికే ఈ సమస్త భువనములకు అధిపతి ఎవరో తెలియవచ్చును. 'విశ్వధృగ్' నామగుణ ధ్యాన మొనరించినవారికి అది సాధ్యమగును. భగవంతుడు అంతటినీ అజమాయిషీ చేయుచుండునని తెలిసికొన్నవాడు అధర్మకార్యము లాచరింపజాలడు.

241. విశ్వ భుగ్ విభుః (విశ్వభుగ్విభుః / విశ్వభుగ్ / విభుః)

అతటను వ్యాపించి అన్నింటిని రక్షించువాడు.

ఓం విశ్వభుగ్విభవే నమః

ఓం విశ్వభుజే నమః

ఓం విభవే నమః

శ్రీ భట్టులు 'విశ్వభుగ్విభుః' ఏక నామముగా పరిగణించారు. – **తత్సృష్టం వ్యాప్యపై భుఞ్జన్ పాలయన్ విశ్వభుగ్విభుః** – తనచేతనే సృష్టింపబడిన ఈ జగత్తు అంతటా వ్యాపించి, దానిని అనుభవిస్తూ పాలించేవాడు విశ్వభుగ్విభుడు. అన్ని అనుభవములు ఆయనకే చెందును. అన్నింటి రక్షణకు ఆయనే బాధ్యుడు. సృష్ట్యాదియందు ప్రజాపతియై, సృష్టిస్థితియందు విష్ణువై, ప్రళయకాళమున రుద్రుడై ఆయన అంతటిని కాపాడును. భగవానుడు సర్వవ్యాపియై, సర్వాధారుడై సర్వమును రక్షించును

శ్రీ శంకరులు 'విశ్వభుగ్', 'విభుః' అనే రెండు నామములుగా వ్యాఖ్యానించారు.

విశ్వభుగ్ – **విశ్వమ్ భుఙ్క్తే, విశ్వమ్ భునక్తి** – విశ్వమును అనుభవించువాడు, భక్షించువాడు. పరమాత్మయే జీవరూపమున శరీరమునందుండి ఇంద్రియముల ద్వారా సుఖదుఃఖములను అనుభవించువాడు. ప్రళయకాలమున సర్వజీవులను తనయందే నింపుకొనువాడు.

శ్రీ చిన్మయానంద – భగవంతుడే సర్వానుభూతులను (విశ్వ) తనయందు లీనము చేసికొనును. ఆయన అంతర్యామియైనందున అన్ని అనుభవములు ఆయనకే చెందును. ప్రళయకాలమున అంతయును ఆయనయందే లయమగును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **ప్రభుః స్పృణానామ్ విశ్వభుక్** – అని తైత్తరీయారణ్యకము (10.91) నందు ఉన్నది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'భుజ్' అనగా వంగుట (కౌటిల్యే), విస్తరించుట. అన్ని దిశలందును విస్తరించిన శ్రీమహావిష్ణువే విశ్వము నేర్పరచినాడు.

'విభుః' నామమునకు శ్రీ శంకరుల భాష్యము – **వివిధమ్ భవతి ఇతి విభుః** – హిరణ్యగర్భుడై, మరియు అనేక స్వరూపములు ధరించి, విశ్వమంతయును నిండి వెలుగు పరమేశ్వరుడే విభుడు. సర్వమూ తానెయైనవాడు. అనంతుడు. **వివిధమ్ భావయతి.**

ధర్మచక్రము రచయిత శ్రీ మద్భగవద్గీతలోని విభూతి యోగము నందలి 21 నుండి 38వ శ్లోకము వరకు శ్రీకృష్ణపరమాత్ముడు తన అనంత ఐశ్వర్య విభభూతులను తెలిపిన విషయమును విపులీకరించారు –

శ్రీ భగవానుడే సకల ప్రాణులకును ఆత్మ. ఆది, మధ్యము, అంతము. ఆదిత్యులలో విష్ణువు. జ్యోతులలో సూర్యుడు. మరుత్తులలో తేజము. వేదములలో సామవేదము. దేవతలలో ఇంద్రుడు. ఇంద్రియములలో మనస్సు. ప్రాణులలో చైతన్యము.

ఆ పురుషోత్తముడే రుద్రులందు శంకరుడు. యక్షులందు కుబేరుడు. వసువులలో అగ్ని. పర్వతములందు సుమేరువు. పురోహితులందు బృహస్పతి. సేనాపతులందు కుమారస్వామి. సరస్సులలో సముద్రుడు. మహర్షులందు భృగువు. శబ్దములందు ఓంకారము. యజ్ఞములందు జపయజ్ఞము. స్థావరములందు హిమాలయము.

ఆ పరమేశ్వరుడే చెట్లలో రావిచెట్టు (అశ్వత్థ వృక్షము). దేవర్షులలో నారదుడు. గంధర్వులలో చిత్రరధుడు. సిద్ధులలో కపిల ముని. గుఱ్ఱములలో ఉచ్చైశ్రవము. ఏనుగులలో ఐరావతము. నరులలో నరేంద్రుడు. ఆయుధములలో వజ్రము. ఆవులలో కామధేనువు. సంతానోత్పత్తికి కారణమగు మన్మధుడు. సర్పములలో వాసుకి. నాగులలో అనంతుడు. జలచరాధిపతియగు వరుణుడు. పితృదేవతలలో అర్యముడు. శాసకులలో యముడు.

ఆ గోవిందుడే దైత్యులలో ప్రహ్లాదుడు. లెక్కవేయువారిలో కాలము. మృగములలో సింహము. పక్షులలో గరుత్మంతుడు. పవిత్రము చేయువానిలో వాయువు. శస్త్రధారులలో శ్రీరామచంద్రుడు. మత్స్యములలో మొసలి. నదులలో గంగ. సృష్టికి ఆది, మధ్యము, అంత్యము. విద్యలకు ఆధ్యాత్మము (బ్రహ్మవిద్య). తత్వనిర్ణయమునకు వాదము.

ఆ కేశవుడే అక్షరములయందు 'అ'కారము. సమాసములందు ద్వంద్వము. అక్షయమగు కాలము. విశ్వతోముఖుడగు విరాట్ పురుషుడు. అందరిని పోషించువాడు. హరించు మృత్యువు. భవిష్యత్తునకు ఉత్పత్తి హేతువు. స్త్రీలలో కీర్తి, శ్రీ, వాక్కు, స్మృతి, మేధ, ధృతి, క్షమ. శ్రుతులందు బృహత్సామము. ఛందస్సులందు గాయిత్రి. మాసములందు మార్గశీర్షము. ఋతువులందు వసంతము. వంచకులలో జూదము. ప్రభావశాలురలోని తేజము. విజేతలలోని విజయము. కష్టించువారిలో నిశ్చయము. సత్పురుషులలోని సాత్విక భావము.

ఆ శ్రీవేంకటరమణుడే వృష్ణివంశజులలో వాసుదేవుడు. పాండవులలో ధనంజయుడు. మునులలో వేదవ్యాసుడు. కవులలో (సూక్ష్మబుద్ధి కలిగిన వారిలో) శుక్రాచార్యుడు. శిక్షించువారిలో దమనశక్తి. జయము కోరువారిలో నీతి. రహస్యములలో మౌనము. జ్ఞానులయొక్క తత్వజ్ఞానము. సర్వప్రాణుల ఉత్పత్తికి కారణమైన బీజము. ఆయన లేని చరాచర ప్రాణి ఏదియును లేదు.

ఐశ్వర్యయుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము ఐన వస్తువు ఏదైనను శ్రీకృష్ణుని తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినది. ఈ సంపూర్ణ జగత్తు శ్రీమన్నారాయణుని యోగశక్తియొక్క ఒక అంశతోడనే ధరింపబడి యున్నది. ఆయన విభూతులకు అంతము లేదు. ఆయనే విభుడు.

242. సత్కర్తా

సజ్జనులను, పుణ్యవర్తనులను, ధర్మాత్ములను ఆదరించువాడు, గౌరవించువాడు – **సత్ కరోతి పూజయతి ఇతి సత్కర్తా.**

ఓం సత్కర్త్రే నమః

'సత్కారము' అనగా పూజ. శ్రీరాముడు, **సజ్జన ప్రతి పూజకః** అని ప్రసిద్ధుడు. **బహుశ్రుతానామ్ వృద్ధానామ్ బ్రాహ్మణానామ్ ఉపాసితా** (రామాయణము 2.2.33)

ధర్మచక్రము రచయిత హనుమంతుని చూచింతనే శ్రీరాముడు ప్రశంసించిన విధమును ఉదాహరించారు. ఈ నామస్మరణము వల్ల మనము సద్వర్తన నలవరచుకొనవలయును. ఇందువలన మనకు మనశ్శాంతి

లభించును. అహంకారము నశించును. భగవంతుని ఆదరము, అనుగ్రహము కలుగును. పరులకు సంతోషము కలుగును.

సీతాదేవి కుశలవార్తలను తెలిపిన హనుమంతునితో శ్రీరాముడు ఇట్లు పలికెను – హనుమా! వినుము. దేవతలలో గాని, మునీశ్వరులలో గాని, మానవులలో గాని నాకు నీవంటి ఉపకారి లేనేలేడు. నేను నీకేమి ప్రత్యుపకారము చేయగలను? నా మనస్సు కూడ నీ ముందుకు వచ్చుటకు జంకుచున్నది. ఆలోచింపగా నీ ఋణమునుండి విముక్తుడను కాలేనని తోచుచున్నది (శ్రీ రామచరిత మానసము 3.4)

243. సత్కృతః

పూజనీయులచేత (సాధువుల చేత) కూడ పూజింపబడువాడు.

ఓం సత్కృతాయ నమః

శ్రీభట్టుల వ్యాఖ్యను నిరుక్తిలో ఇలా చెప్పారు – **అర్చాదిభిః సజ్జనైః యః పూజితః సత్కృతః స్మృతః** – శ్రీహరియే సాధుసజ్జనులచేత పూజలందుకొనువాడు గనుక సత్కృతుడు.

నృసింహప్రియ వ్యాఖ్యలో ఆచార్య శ్రీనివాస రాఘవాచారి ఇలా వివరించారు – శ్రీమహావిష్ణుభక్తి తత్పరులైనవారు నివేదించినదేమైనా, ఎంత చిన్నదైనా గాని, దానిని భగవంతుడు మహానైవేద్యముగా భావించి స్వయముగా స్వీకరించును. అంతేకాదు. అందుకు ప్రతిగా తానందించు ఫలము అల్పమని ఆయన భావించును (ద్రౌపది ఆక్రందన తన హృదయముపై వీడని భారముగా నున్నదని శ్రీకృష్ణ భగవానుడు చెప్పెను.)

వేదములలో చెప్పినట్లుగా తల్లిని, తండ్రిని, గురువును పూజించుట ద్వారా పరమాత్మునిపై భక్తిని పెంపొందించుకొనవచ్చునని ధర్మచక్రము రచయిత వ్యాఖ్యానించారు.

244. సాధుః

- (భక్తుల క్షేమమునకు అవుసరమైన పనిని) సాధించువాడు.
- సాధువర్తనుడు. సదాచార సంపన్నుడు.

ఓం సాధవే నమః

సాధయతి ఇతి సాధుః – (కార్యమును) నిర్వర్తించువాడు.

సాధ్నోతి ఇతి సాధుః – (లోకరక్షణార్థమై) సాధ్యము కావించువాడు.

సేవాం సారథ్య దూత్యాద్యాం సాధు సాధయతీతి సః – తన భక్తులకు రథము తోలుట, దూతకృత్యములు వంటి పనులను నెరవేర్చినవాడు.

భక్తుల కొఱకు భగవంతుడు పడిన పాట్లు ఇన్ని అన్ని కావు. ఆయన పాండవుల కొఱకు రాయబారము తీసికొని పోయెను. శిశుపాల దుర్యోధునాదుల నిందలను సహించెను. కూర్మావతారుడై కొండనెత్తెను. మత్స్యావతారుడై పడవను లాగెను. శ్రీవరాహమూర్తియై ధరణిని ధరించెను. శ్రీరాముడై వనవాసమును అనుభవించెను. శ్రీవరదరాజ స్వామిగా కంచిలో తిరుక్కచ్చి నంబికి గొడుగు పట్టెను. శ్రీనివాసుడై అనంతాళువారికి మట్టి మోసెను. కనుకనే ఆయన సాధువు. భక్తులకు సఖుడు. వారి పనులు చేయుట ఆయనకు ప్రీతికరము.

'సాధుః' అనగా వేదయుక్తమగు సత్ప్రవర్తన కలిగినవాడు అని కూడ అర్థమును చెప్పారు. సన్మార్గమున వర్తించువానికి లక్ష్యసాధనము, విజయము తథ్యము. భగవంతుడు సదా విజయుడు. సాధువు.

సాధుస్వరూపుడగు భగవానుని పొందుటకు సాధువర్తనము అత్యంతావశ్యకము. శీలసంపద లేనివానికి మోక్షము లేదు.

245. జహ్నుః

- గుహ్యమైనవాడు. (మూఢులను విడనాడువాడు). కానరానివాడు.
- ప్రళయకాలమున సమస్తమును లయము చేయువాడు.
- దోషములకు దూరముగానుండువాడు.

ఓం జహ్నవే నమః

'హా' అనే ధాతువునకు త్యాగము చేయుట, విడనాడుట అనే అర్థములున్నాయి.

అభక్తేషు ఆత్మ మాహాత్మ్యమ్ అపహ్నుతే ఇతి జహ్నుః – జహాతి అవిదుషు జహ్నుః – భక్తి, విశ్వాసము లేనివారిని మోక్షమార్గమునకు పెడగానుంచువాడు. మూఢులకు కానరానివాడు.

మహాభారతము ఉద్యోగపర్వము (6.7.2) నుండి శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణము.

చక్రమ్ తద్-వాసుదేవస్య మాయయా వర్తతే విభో:

సాఽపహ్నువమ్ పాణ్డవేషు చేష్టతే రాహసత్తమః

మహారాజా! వాసుదేవుని చక్రము (ఇతరులకు కనిపించకుండా) మాయగా పాండవులను ఎల్లెడల రక్షించుచుండును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **జనాన్ సంహార సమయే అపహ్నుతే అపనయతి ఇతి జహ్నుః** – ప్రళయ సమయమున సకల ప్రాణులను తనయందు ఇమిడ్చుకొనువాడు (దాచియుంచువాడు) గనుక ఆయన జహ్నువు. ఇదే విధముగా జహ్ను మహర్షి గంగానదిని తనయందు దాచుకొన్నందున గంగకు జాహ్నవి యను పేరు గలదు. (గంగావతరణ గాధ శ్రీరాధాకృష్ణశాస్త్రిచే ఉదాహరింపబడినది)

ఇలా 'గుహ్యముగా నుంచుట' అనే విషయమున జీవనంలో సర్వసాధారణమనీ, ప్రయోజనకరమనీ చెబుతూ ధర్మచక్రములో పెక్కు దృష్టాంతములను చెప్పారు. ఇలానే మనము గడచిన చెడు విషయములను మరచిపోగలము. ముందుకాలములోని విపత్తులు సంభవించువరకు మనకు తెలియవు. తల్లి గర్భములో బిడ్డ దాగియుండును. విత్తనములో వృక్షము దాగియుండును. మరణకాలము ముందుగా తెలియదు. గెలుపెవరిదో ప్రత్యర్థులకు ముందుగా తెలియదు. పునఃసృష్టికి ముందు జీవులన్నియు దేవునిలో దాగియుండును.

ఈ నామస్మరణ ద్వారా మనము ఇతరుల లోపములను, చెడును విస్మరించి, వారి ఉపకారములను మాత్రము గుర్తుంచుకొనవలెను. ఈ విధముగా సాధన చేయుటవలన భగవంతుడు మనకు తెలియవచ్చును (గుహ్యము కాదు).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు 'హ' అనగా 'త్యాగే' ధాతువునుండే మరొక వివరణ ఇచ్చారు. భగవంతుడు శుద్ధ సత్వ స్వరూపుడు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు ఆయనకు దూరముగానుండును. అన్ని క్లేశములను, పాశములను ఆయన త్యజించినవాడు. **పవిత్రాణాం చ పవిత్రమ్.**

246. నారాయణః

- సకలాత్మలకు ఆధారమైనవాడు, జీవ సముదాయములకు ఆశ్రయము.
- జగత్తంతయును (లోపల, వెలుపల) వ్యాపించియున్నవాడు.
- జలములకు ఆధారము, జలములే నివాసము అయినవాడు.
- ప్రళయ కాలమున జీవులకు నిలయమగువాడు.

ఓం నారాయణాయ నమః

భక్తులకు అత్యంత ప్రియమగు ఈ పుణ్యనామము అష్టాక్షరీ మహామంత్రముగా లోక ప్రసిద్ధము. గాయత్రీమంత్ర దేవత. ఈ నామమునకు అనేక పుణ్య భావములు, విశేషార్థములును, సాంకేతికార్థములును కలవని శాస్త్రములును, భక్తులును చెప్పుచున్నారు.

ఇంతకు ముందు ప్రస్తుతింపబడిన దివ్యనామములు బహువిధములైన గుణస్వరూప కీర్తనముద్వారా నారాయణుని స్తుతించునవి. శ్రీవిష్ణుసహస్రనామము నందలి శివ, రుద్ర, పరమాత్మ, మహాశక్తి, గురు, సాధు వంటి నామములు శ్రీమహావిష్ణువు నుద్దేశించినవైనను పెక్కు దేవతాస్తోత్రములందు కూడ వాడబడును. ఇప్పుడు శ్రీ వ్యాసభగవానులు చెప్పిన 'నారాయణ' నామము శ్రీమహావిష్ణువునే కీర్తించు దివ్య నామము, స్తుతించు మహామంత్రము. 'నారాయణ' నామప్రాశస్త్యమును గూర్చి శ్రీ భట్టులు విపులముగా చర్చించారు. అన్ని ఉపనిషత్తులలోను నారాయణ నామము స్తుతింపబడినది. వేదములలో 'నారాయణ' నామమునకు అర్థము ఇలా చెప్పబడినది.

యచ్చ కించిత్ జగత్ సర్వమ్ దృశ్యతే శ్రూయతేఽపివా
అంతర్ బహిశ్చ తత్ సర్వమ్ నారాయణః స్థితః

సర్వ జగత్తునందును కనుపించునది గాని, వినుపించునది గాని, ప్రతి వస్తువు నందును లోపల, బయట వ్యాపించి నారాయణుడు స్థితుడై యున్నాడు.

నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి
తన్నో విష్ణుః ప్రచోదయాత్ – తైత్తరీయారణ్యకము 6.1.28

నారాయణ పరమ్ బ్రహ్మ తత్వమ్ నారాయణః పరః
నారాయణ పరోజ్యోతి రాత్మా నారాయణః పరః – తైత్తరీయారణ్యకము 6.11

ఏకో హవై నారాయణాఽసీత్
న బ్రహ్మ న ఈశానః న ఆపః న అగ్నిషోమౌ యౌ
న ఏమే ద్యావా పృథ్వీ న నక్షత్రాణి న సూర్యః న చంద్రమః – మహోపనిషత్తు

ఈ నామ వ్యాఖ్యానము చివరలో శ్రీ భట్టులు చెప్పిన విషయం ఇక్కడ ముందుగా గమనించవలసిన అవుసరం ఉంది – అక్కడా ఇక్కడా చదివీ, వినీ ఈ మహానామమంత్రమునకు అర్థమూ, రహస్యమూ తెలిసికొన సాధ్యము కాదు. తగిన గురువును ఆశ్రయించి, సేవించి, వారి అనుగ్రహము ద్వారా మాత్రమే ఈ పవిత్ర నామ మంత్ర రహస్యమును గ్రహింపనగును. ఈ పవిత్ర నామ మహత్మ్యము నాలుగు కన్నులకు మాత్రమే గోచమగును, కాని ఆరు కన్నులకు కాదు – అని శ్రీ భట్టులు తమ వ్యాఖ్యను ముగించారు. (అనగా గురువుగారి రెండు కన్నులు, శిష్యుని రెండు కన్నులు – నాలుగు కన్నులు మాత్రమే ఈ నామవైభవమును దర్శింపగలవు. వ్యాఖ్యానకర్తయొక్క మరి రెండు కన్నులు అక్కడ చేరరాదు.)

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'నర' శబ్దము ఆత్మను సూచించును. 'నార' అనగా ఆకాశము, మరియు ఆకాశమునుండి ఉద్భవించినవి. వీటన్నింటికి కారణము, అన్నింటా వ్యాపించినవాడు అయిన

భగవంతునకు సర్వము 'అయనము' (అనగా నివాసము). కనుక ఆయన 'నారాయణుడు'. మహాభారతమునందు ఈ ప్రమాణము ఉన్నది.

నరాజ్జాతాని తత్వాని నారాణీతి తతో విదుః
తాన్యేవ చాయనమ్ తస్య తేన నారాయణఃస్మృతః – అనుశాసనిక పర్వము 13.1.2
నరులనుండి (ఆత్మలనుండి) ఉద్భవించినందున తత్వములు 'నారములు' అని పిలువబడెను. ఆ నారములే నిలయముగా కలిగినందున భగవంతుని 'నారాయణుడు' అని చెప్పిరి.

శ్రీ శంకరులు చెప్పిన మరొక భావము – **నరాణామ్ జీవానామ్ అయనత్వాత్ ప్రళయ ఇతి వా** – ప్రళయ కాలమున జీవులు ఆయనయందు ప్రవేశించి నివసించును. అనగా ప్రళయ కాలమున జీవులకు నారాయణుడే నివాస స్థలము. తైత్తరీయోపనిషత్తు (3.1)లో **'యత్ప్రయన్త్యభిసంవిశన్తి'** అను విశేషణము చెప్పబడెను. దీనికి 'సమీపించి, ప్రవేశించును' అని అర్థము. కనుక ఆయన నరులకు, తత్వములకు నిలయమై నారాయణుడని చెప్పబడెను. **నరాణామ్ అయనమ్ యస్మాత్ తస్మాన్ నారాయణః స్మృతః** (బ్రహ్మ వైవర్త పురాణము).

పై చెప్పిన విధములలో 'నారములే ఆయనకు నిలయము' అని ఒక అర్థము కాగా, 'నారములకు ఆయన నిలయము' అని రెండవ అర్థము. మనుస్మృతి (1.10)లోని నిర్వచనము.

ఆపో నారాః ఇతి ప్రోక్తాః ఆపో వై నరసూనవః
తా యదస్యాయనమ్ పూర్వమ్ తస్మాన్ నారాయణః స్మృతః – మనుస్మృతి (1.10)
'నారములు' అనగా జలములు (పంభూతములు వేరువేరుగా కనిపించక ముందున్న స్వరూపము). అట్టి నారములను సృజించి, వానియందే (ప్రళయకాలమున) నివాసమేర్పరచుకొన్నందున భగవంతుని నారాయణుడని అందురు.

కరారవిందేన పదారవిందమ్
ముఖారవిందే వినివేశయన్తమ్
వటస్య పత్రస్య పుటేన యానమ్
బాలమ్ ముకున్దమ్ మనసా స్మరామి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారి ఉపమానము – తల్లి గర్భములో శిశువు నీటిలో తేలుచూ ఉండును. అందుండి శిశువు జన్మించి లోకములో ఆవిర్భవించును. అదే విధముగా నారములనుండి బ్రహ్మాండము ఉద్భవించెను. ఆ నారములను సృజించినది (మాతృమూర్తి) నారాయణుడే. ఆయన కూడ నారములను తన నివాసముగా చేసికొనెను.

నరసింహ పురాణములో చెప్పిన నారాయణ నామ మహాత్మ్యము (18.31) –

నారాయణాయ నమ ఇత్యయమేవ సత్యః

సంసార ఘోర విష సంహరణాయ మంత్రః

శృణ్వన్తు భవ్యమతయో యతయోऽస్తరాగా

ఉచ్చైస్తరా ముపదిశామ్యహమ్ ఊర్ధ్వబాహుః

'నారాయణాయ నమః' అను ఈ మంత్రమే సంసార ఘోర విషమును హరించు మహామంత్రము. ఈ విషయమును నేను చేతులెత్తి బిగ్గరగా చెప్పుచున్నాను. ఇంద్రియములను జయించి, సద్బుద్ధిని సాధించిన సాధువులందరూ ఈ మాట వినండి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – గాయత్రీ మంత్రము ద్వారా పూజింపబడు మంత్రదేవత శ్రీమన్నారాయణుడే – **ధ్యేయః సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణః**

ఈ నామ జప మహాత్మ్యమును వివరిస్తూ ధర్మచక్రము రచయిత దివ్యప్రబంధములను ఉదాహరించారు – **నలమ్ తరుమ్ సొళ్ళై నాన్ కణ్డు కొండేన్ నారాయణా ఎన్నున్ నామమ్.**

నారాయణ శబ్ద సంకీర్తనా మహాత్మ్యము ఈ శ్రీ విష్ణు సహస్రనామస్తోత్ర మహామంత్రము ఉత్తరపీఠిక (ఫలశృతి) యందే స్పష్టముగా చెప్పబడినది.

ఆర్తా విషణ్ణాః శిధిలాశ్చ భీతాః

ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః

సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం

విముక్త దుఃఖాః సుఖినో భవంతి.

నారాయణ శబ్దోచ్చారణ మాత్రము చేతనే ఆర్తులు, విషణ్ణులు, దుఃఖితులు, భయంకర రోగపీడితులు, భయగ్రస్తులును విముక్తులై సుఖశాంతులు పొందుదురు.

అన్నమయ్య కీర్తన

తెలిసిన వారికి దేవుండితడే – వలవని దుష్టుల వాదము లేల

పురుషులలోపల పురుషోత్తముడు – నరులలోన నరనారాయణుడు
పరదైవములకు పరమేశ్వరుడు – వరుస మూఢుల కెవ్వరో యితడు

పలు బ్రహ్మలకును పరబ్రహ్మము – మలయు నీశులకు మహేశు డితడు
ఇల నాత్మలలో నిటుపరమాత్ముడు – ఖలుల కెట్లుండునో కానము యితడు

వేదంబులలో వేదాంతవేద్యుడు – సోదించ కరి గాచుచో నాది మూలము
యీాదెస శ్రీ వేంకటేశు డిందరికి – గాదిలి మతులను గైకొన డితడు

247. నరః

- నాశనము (తుది) లేనివాడు.

- నడిపించువాడు. నాయకుడు.

ఓం నరాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – శాశ్వతమైన సంపత్తు గలవాడు. ఆయన చెంత చేరిన చేతనాచేతనములకు నాశనము లేదు.

శ్రీ శంకరులు – **నయతితి నరః ప్రోక్తః పరమాత్మా సనాతనః** – అను వేదవ్యాస వాక్యానుసారముగా, భక్తులను పరమ పదమునకు నడిపించు నాయకుడైనందున పరమాత్ముడు నరుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'నృ' అను ధాతువునుండి – 'నయె' అనగా నడుపుట. – 'నయతి' అనగా నడిపించువాడు – 'నృణతి' అనగా తీసికొని వెళ్ళువాడు. ఈ విశాలజగత్తును ఒక కల్పమునుండి మరొక కల్పమునకు చేర్చును గనుక ఆయన నరుడు. 'నర' శబ్దమునకు 'జలము' అనే అర్థము కూడ ఉన్నది. నీటికి ప్రవహించే లక్షణము ఉన్నందున, ప్రవాహముతోపాటు వస్తువులను తీసికినివెళ్ళు గుణము కూడ ఉన్నది. సృష్టికి ముందు సర్వమూ జలమయమని ఋగ్వేదము (10.129.3)నందు చెప్పబడినది.
తమాఽసీత్ తమసా గూఢమగ్రేఽప్రకృతమ్ సలిలమ్ సర్వమిదమ్.

ధర్మచక్రము రచయిత – పిల్లవాని చేయిపట్టి దారిచూపు తల్లి అవుసరమైతే పిల్లవాని మేలుకోసం శిక్షిస్తుంది కూడాను. అలాగే జ్ఞానార్థియైన శిష్యుని అప్పుడప్పుడూ గురువు దండించ వచ్చును. ఇదేవిధంగా శ్రీమహావిష్ణువు నరుడై, నాయకుడై నడిసంద్రమున నావను నడిపించు దేవుడు. ఆ లోకనాధుడు అప్పుడప్పుడూ శిక్షింపవచ్చును. కాని ఎల్లప్పుడూ రక్షించుచునేయుండును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

రామానుజ దర్శనము (Vol.3 – Issue.2 – June-August 2005)

శ్రీ వి.వి. రామానుజమ్ గారి 'Vaishnavism in Vedic Period' నుండి సంగ్రహించినది.

గీతోపదేశమున భగవానుడు **'వేదైశ్చ సర్వైః అహమేవ వేద్యః'** – అని తెలిపెను. అనగా అన్ని వేదముల ద్వారా తెలిసికొనదగినవాడు, వేదవేద్యుడు ఆయనే. వేదాంత భాషణములందు పరతత్త్వమనీ, బ్రహ్మమనీ, పరబ్రహ్మమనీ ఆయననే సూచించడం జరిగింది.

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ – స భూమిమ్ విశ్వతోవృత్వా – అథ తిష్ఠమ్ దశాంగుళమ్ – అనే పురుష సూక్తము అన్ని వేదములందూ చెప్పబడినది. ఇందుబట్టి ఇది చాలా ముఖ్యమైన ప్రమాణము అని గ్రహింపవచ్చును. ఇక్కడ 'సహస్ర' అనగా వేయి కాదు. వేలాది, అసంఖ్యాకము, అనంతము అని గ్రహించుట కష్టము కాదు (వేయి తలలుంటే రెండువేల కళ్ళు ఉండాలి కదా!). అంటే ఆ 'పరుషునకు' జ్ఞానము, శక్తీ, ఐశ్వర్యమూ అనంతమై ఉండవలెను. ఇంకా ఇలా చెప్పబడినది – ఆ పురుషునకు మృత్యువు లేదు. ఆయన ఇతరులకు అమృతత్త్వము ప్రసాదించగలడు. ఆయన సకల జగత్తునకు కారణము. ప్రభువు.

ఇంకా – **వేదాऽహమ్ ఏతమ్ పురుషమ్ మహాన్తమ్ – ఆదిత్యవర్ణమ్ తమసాస్తుపరే** – ఆ పురుషుడు తమస్సునకు అతీతముగా ఆదిత్యవరణముతో ప్రకాశించునని నేను ధ్యానిస్తున్నాను (తెలిసికొంటున్నాను). ఆ పరమపురుషుడు జగత్తును సృష్టించి, అందు స్థితుడైయున్నాడు. అన్ని జీవులయందు ఆత్మలో స్థితుడైయున్నాడు. అంతటా వ్యాపించి, అన్నింటినీ భరిస్తున్నాడు. లోనా, బయటా ఆవరించి యున్నాడు. ఆది, మధ్యము, అంతము లేని కాలాతీతుడు. సంకల్పమాత్రమున సమస్త స్వరూపములందు అవతరించు జన్మరహితుడు.

జగత్తు అంతా ఆ పరమపురుషుని స్వరూపమే అయినా, ఆయన భక్తులకు అనన్య కాంతిమయ సుందరుడై దర్శనమొసగును. ఆయన జ్ఞాన, బల, వీర్య, తేజో సంపన్నుడై, సమస్త మంగళ స్వరూపుడై, భగవంతునిగా గుర్తింపబడును. దోషరహితుడు. శ్రీదేవీ భూదేవీ సమేతుడు. లోకకళ్యాణార్థము వివిధ రూపములలో అవతరించువాడు. కేవలము జ్ఞాన, భక్తి సంపన్నులైన మహాభాగులే ఆయనను అవతారమూర్తిగా నెరుగుదురు. భూమి మొదలు పరమపదము వరకు సకల భువనములును ఆయనకు అధీనమైన విభూతులు. ఆయన జగన్నాధుడు. దేవదేవుడు. భక్తిపూరితమైన పూజాది ఉపచారములను స్వీకరించి పరమపదమును ప్రసాదించు కరుణామూర్తి. శ్రీమహాలక్ష్మీదేవితో సదా కూడియుండువాడు. శ్రీలక్ష్మీనారాయణుని సేవించుటకంటె మహద్భాగ్యము వేరొకటి లేదు.

యజుర్వేదము – నారాయణ సూక్తము

సహస్రశీర్షమ్ దేవమ్ విశ్వాక్షమ్ విశ్వసంభవమ్
విశ్వమ్ నారాయణమ్ దేవమ్ అక్షరమ్ పరమమ్ బ్రహ్మమ్

ఆ సహస్రశీర్ష పురుషుడే విశ్వపురుషుడు, విశ్వరూపుడు, దేవుడు, అక్షరుడు, పరబ్రహ్మమునైన నారాయణుడు.

విశ్వతః పరమామ్ నిత్యమ్ విశ్వమ్ నారాయణమ్ హరిమ్
విశ్వ మే వేద్యమ్ పురుషః తద్విశ్వమ్ ఉపజీవతి
పతిమ్ విశ్వస్యాత్మేశ్వరమ్ శాశ్వతమ్ శివమ్ అచ్యుతమ్
నారాయణమ్ మహాజ్ఞేయమ్ విశ్వాత్మానమ్ పరాయణమ్

నారాయణ పరంబ్రహ్మ తత్వమ్ నారాయణ పరః
నారాయణ పరోజ్యోతి రాత్మా నారాయణ పరః
యచ్చకించిత్ జగత్యస్మిన్ దృశ్యతే శ్రూయతేఽపివా
అంతర్ బహిశ్చ తత్ సర్వమ్ వ్యాప్య నారాయణ స్థితః

రామానుజ దర్శనము (Vol.1 – Issue.1 – Jan-Mar 2003) నుండి సంగ్రహించినది.

Who is Ramanuja? –by Sri Mohan Sagar

శ్రీవైష్ణవ గురుపరంపర చక్కని మణిహారముతో పోల్చబడినది. ఈ గురపరంపర

1) శ్రీధరుడు (శ్రీమన్నారాయణుడు)
2) శ్రీ (జగన్మాత మహాలక్ష్మి)
3) శ్రీ విష్వక్సేనుడు
4) శ్రీ శఠగోపముని (నమ్మాళ్వారు)
5) శ్రీ నాథముని
6) శ్రీ పుండరీకాక్షుడు
7) శ్రీ రామమిశ్రుడు
8) శ్రీ యమునాచార్యులు (అళవందార్)
9) శ్రీ పరాంకుశుడు
10) శ్రీ రామానుజుడు
11) శ్రీ ఎంబార్
12) శ్రీ పరాశర భట్టు
13) శ్రీ నన్ జీయర్
14) శ్రీ నన్ పిళ్ళై
15) శ్రీ వడక్కు తిరువీధి పిళ్ళై
16) శ్రీ పిళ్ళై లోకాచార్యుడు
17) శ్రీ తిరువైమొళి పిళ్ళై
18) శ్రీ మనవాళ మహాముని



ఈ గురుమణిహారము రహస్య త్రయమును అలంకరించుచున్నది. శ్రీ నారాయణుడే ఈ హారమునకు మొదలు, చివర కూడాను. రహస్యత్రయములో మూడు మంత్రములున్నవి.

1) శ్రీమన్నారాయణుడే స్వయముగా నరనారాయణావతారమున నరునకుపదేశించినది – మూల మంత్రము.
2) శ్రీధరుడే జగన్మాతయగు శ్రీమహాలక్ష్మికి ఉపదేశించిన మంత్రము – ద్వయమంత్రము
3) శ్రీకృష్ణభగవానుడు కురుక్షేత్రమున అర్జునునకుపదేశించిన మంత్రము – చరమ శ్లోకము.



Gopuram at Srirangam. Lord Ranganatha (main deity), The three great teachers – NammAzhwAr, Ramanuja and MaNavALa mAmuni

శ్రీదేవి భూదేవి సమేతులైన శ్రీరంగనాధునికి నమస్కారములు.

www.srivaishnavam.com
Sri Vaishnavam – A Concise Study – Part V నుండి

మూల మంత్రము (అష్టాక్షరి, తిరుమంత్రము, మంత్రరాజము)

బదరికాశ్రమమున నారాయణుడు నరున కుపదేశించినది. ఈ మంత్రములో మూడు పదములు (భాగములు) ఉన్నవి (1) **ప్రణవ శబ్దము** (2) **నమః** (3) **నారాయణాయ.**

చేతనులు నారాయణుని శరణుజొచ్చినందున లభించు సచ్చిదానంద భాగ్యము ఈ మంత్రమున పొందు పరచబడియున్నది. ప్రణవ శబ్దము కలిగినందున ఈ మంత్రము వైదికము. కనుక బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య పురుషులు మాత్రమే ఈ మంత్రసాధన చేయుటకు అర్హులు. ప్రణవ శబ్దమునకు బదులుగా 'ఓమ్' అని ఉచ్చరించినయెడల ఇది తాంత్రిక మంత్రమగును. అందువలన ఆ మంత్రముయొక్క ప్రభావమునందు, ఫలితమునందు ఏ విధమైన మార్పు ఉండదు. కాని అప్పుడు అన్ని వర్ణముల స్త్రీ పురుషులు (జాతి, లింగ నియమములు లేకుండ) ఈ మంత్రమును ఉచ్చరింపవచ్చును.

ప్రణవమునందు మూడు శబ్దములు – అ, ఉ, మ – మిళితములు. "అ" విష్ణువును సూచించును. "ఉ" లక్ష్మీదేవిని సూచించును. "మ" జీవాత్మకు సంకేతము. కనుక ఈ మంత్రము ద్వారా జీవాత్మ లక్ష్మీనారాయణులకు శేషము (శరణాగతము) కావలెనని చెప్పడమైనది. లక్ష్మీనారాయణులు ఒక్కటే గనుక ప్రణవమునకు బదులుగా "ఓమ్" అని వాడినా గాని అర్థము మారదు. "నమః" అనగా "నాది కాదు" అని అర్థము.

ఈ మంత్రమునకు పెక్కు రహస్య విశేష అర్థములున్నందున ఇది అత్యంత ముఖ్యమైనది. ఈ మంత్ర సాధన అన్ని వేదములను పఠించిన దానికి సమము. భక్తి విశ్వాసములతో స్మరించినయెడ ఈ మంత్రము సకల శుభసంపదలను, మోక్షమును ప్రసాదించును. శ్రీమన్నారాయణుడే ఈ మంత్రాధిష్టాన దేవత.

ఈ మంత్రమును 1 లేదా 2 లేదా 3 భాగములుగా ఉచ్చరింపవచ్చును. ఒకే భాగముగా జపించినయెడల ఈ మంత్రము సాధనామార్గమును, దాసత్వమును ప్రసాదించును. రెండు భాగములుగా జపించినట్లయితే ఈ మంత్రము ఆత్మజ్ఞానమును, శరణాగతిని, మోక్షమును ప్రసాదించును. మూడు భాగములుగా జపించినచో ఈ మంత్రము ఆత్మజ్ఞానమును, మోక్షమును, కామితార్థములను ప్రసాదించును. కష్టములను తొలగించును.

మంత్ర రత్నము (ద్వయ మంత్రము)

వైకుంఠములో శ్రీమహాలక్ష్మికి శ్రీమన్నారాయణుడు ఉపదేశించిన మంత్రము
శ్రీమన్నారాయణ చరణౌ శరణమ్ ప్రపద్యే
శ్రీమతే నారాయణాయ నమః
రెండు వాక్యములున్నందున ఇది ద్వయము. ఏ విధమైన నిబంధనలు లేకుండ అందరును జపించదగిన తాత్విక మంత్రము. లక్ష్మీనారాయణులకు శరణాగతి చేయు సాధనము. ఈ మంత్ర వ్యాఖ్యానము శ్రీరామానుజుల శరణాగతి గద్యమునందు చెప్పబడినది. ఇందులో ఎనిమిది పదములు ఉన్నాగాని, ఉచ్చరించేటపుడు ఆరు పదములుగానే అనిపిస్తుంది.
నిగూఢమైన భావములున్నందున, జాతి మత లింగ సమయ విచక్షతలు లేకుండా జపింపదగినందున ఇది మంత్రరత్నము.

చరమ శ్లోకము

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకమ్ శరణమ్ వ్రజ
అహమ్ త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః
అని గీతోపదేశమున శ్రీకృష్ణపరమాత్ముడు అర్జునునకు బోధించినదే చరమశ్లోకము. మోక్షమునకు శరణాగతియే సులభము, ఉత్తమము అయిన మార్గము. అనగా ఇక్కడ వర్ణాశ్రమ ధర్మములను వదలిపేయమని కాదు. కామములను యోగములను త్యజింపమని అర్థము.

జనవరి 2006. "భక్తి" మాసపత్రిక - శ్రీ జటావల్లభుల సత్యవతీ ప్రసాద్ గారి వ్యాసము నుండి.

శ్రీ విద్యాలక్ష్మీ స్తోత్రము

శ్రీసూక్త సంస్తుతాం, ఋూకార ప్రకృతిక శశినీ కళాత్మికాం

శ్రీ త్వరితాం నిత్య స్వరూపాం, సర్వరోగహర చక్రస్వామినీం

స్కందాకర్షిణీం శక్తి స్వరూపిణీం శ్రీవామన వక్షస్థల కమలవాసినీం

సర్వమంగళ దేవతాం శ్రీ విద్యాలక్ష్మీం ధ్యాయామి

యా దేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణ సంస్థితా

నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః

వేంకారోఽమృత బీజస్తు కట మైశ్వర్య ముచ్యతే

అమృతైశ్వర్య సంఘత్వాత్ వేంకటాద్రి రితిస్మృతః

'వేం' అనేది అమృత బీజము. 'కట' అంటే ఐశ్వర్యము. అమృతమయమైన ఆనందాన్ని ఇచ్చే క్షేత్రం గనుక, తిరుమల క్షేత్రానికి 'వేంకటాద్రి' అని పేరు.

కృతే తు నరసింహో భూ త్రేతాయాం రఘునందనః

ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకటనాయకః

కృతయుగంలో శ్రీనరసింహస్వామి, త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు, ద్వాపరయుగంలో శ్రీకృష్ణపరమాత్మ, ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి ప్రత్యక్ష దైవాలు.

అసంఖ్యేయోऽప్రమేయాత్మా విశిష్టః శిష్టకృచ్ఛుచిః |
సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః || (27)

248. అసంఖ్యేయః

అసంఖ్యాకములైన గుణ, స్వరూప, నామములు గలవాడు..

ఓం అసంఖ్యేయాయ నమః

అగణ్య నర సంఖ్యేయః నోऽసంఖ్యేయః పరికీర్తితః – భగవంతుని గుణములు అనంతములు. రూపములకు లెక్క లేదు. ఆయన ఏ పేరుతో పిలిచినా పలుకును. కనుక ఆయన అసంఖ్యేయుడు.

అనేక బాహూదర వక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోऽనంత రూపమ్
నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప – గీత 11.16
ఓ విశ్వేశ్వర! విశ్వరూప! నీ బాహువులు, ఉదరములు, ముఖములు, నేత్రములు అసంఖ్యాకములు. నీ అనంత రూపము సర్వతోముఖముగ విలసిల్లుచున్నది. నీవు ఆది మధ్యాంత రహితుడవు. మహత్వపూర్ణమైన నీ విశ్వరూపమునకు ఆది మధ్యాంతములను తెలిసికొనలేకున్నాను.

249. అప్రమేయాత్మా

ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని తెలిసికొన శక్యము కాని, ఎట్టి ప్రమాణముల చేతను నిర్వచించుటకు వీలు గాని దివ్యాత్మస్వరూపుడు.

ఓం అప్రమేయాత్మనే నమః

మనస్సు చేత గాని, ఇంద్రియముల చేత గాని, ఆత్మ స్వరూపము బోధపడదు. ప్రమాణైః ప్రమాతుమ్ అశక్యః అప్రమేయః – అని శ్రీ సత్యదేవో వాసిష్ఠగారి వివరణ. ఇంక పరమాత్ముని తెలిసికొన నెవరి తరము?

న తస్య ప్రతిమా అస్తి యస్య నామ మహత్ యశః – యజుర్వేదము 31.3

46వ నామము – అప్రమేయః

249వ నామము – అప్రమేయాత్మా

103, 181 నామములు – అమేయాత్మా

ఈ మూడు దివ్య నామములందలి పోలిక గమనింపదగినది.

250. విశిష్టః

- అన్నింటినీ మించువాడు. అందరికంటే అధికుడు. ఎవరిపైనా ఆధారపడనివాడు.
- అంతటా వ్యాపించినవాడు.

ఓం విశిష్టాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతునకు వేరే విధమైన తోడు, ఆధారము అవుసరం లేదు. అన్నింటిలోను ఆయనకు ఆయనే సాటి. కనుక ఆయన విశిష్టమైనవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – అంతటా వ్యాపించిన సర్వాంతర్యామి.

ధర్మచక్రము రచయిత – జీవితములో ధనము, బలము, కీర్తి వల్ల ఆధిక్యత లభించదు. దేవునిపై భక్తి యుండవలెను. అలా కానియెడల మిగిలిన సంపదలన్నీ వ్యర్థము.

251. శిష్టకృత్

- తన భక్తులను సదాచారవంతులుగాను, ఉన్నతులుగాను చేయును.
- శాసనము చేయువాడు.

ఓం శిష్టకృతే నమః

'శిష్ట' అనగా సత్ప్రవర్తనము, క్రమశిక్షణ, ఔన్నత్యము. భగవద్భక్తి పరాయణులైన వారికి ఈ సుగుణములు, తద్వారా ఉన్నత స్థానము సహజముగానే లభించును. భక్తులు దుష్కర్మలు చేయజాలరు. లోకాధినాథుని నుతించు భక్తులకు సామాన్యాధికారులవద్ద తలవంచ నవుసరము రాదు.

భగవంతుడు వేదముల రూపమున, జ్ఞానము రూపమున ఎలా నడచుకొనవలయునో ఆజ్ఞాపించును గనుక ఆయన శిష్టకృత్. (శిష్ట = శాసనము).

(ఈ నామముల వ్యాఖ్యనుబట్టి చూచినయెడల 250వ నామము 'విశిష్టః' అనగా అనన్యమైన సత్ప్రవర్తన, క్రమశిక్షణ కలిగినవాడు అనీ, అందువలన అందరినీ శాసించు జగన్నాధుడనీ అర్ధము చెప్పుకొనవచ్చును).

252. శుచిః

పవిత్రమైనవాడు. పవిత్రము చేయును.

ఓం శుచయే నమః

ఈ నామము 157వ నామముగాను, 252వ నామముగాను వచ్చినది.

17వ శ్లోకము. 157వ నామము. శుచిః – **ఉపేంద్రో వామనః ప్రాంశురమోఘః శుచిరూర్జితః**

27వ శ్లోకము. 252వ నామము. శుచిః – **అసంఖ్యేయోऽప్రమేయాత్మా విశిష్టః శిష్టకృత్ శుచిః**

157వ నామము. శుచిః – పావనమైనవాడు.

252వ నామము. శుచిః – పావనము చేయువాడు.

భగవంతుడెంత పవిత్రమైనవాడు అంటే ఆయనపట్ల భక్తి కలిగినవారు మనసా, వాచా, కర్మణా పావనులగుదురు.

ధర్మచక్రములోని వ్యాఖ్య – భక్తివలన శుభ్రత, తేజస్సు లభించును. స్నానాదికములవలన శరీరము శుభ్రమై, వ్యాధులు నివారణమగునట్లు భగవన్నామస్మరణ వలన మన ఆలోచనలు నిర్మలములగును. ఇంద్రియములు నిగ్రహింపబడును. ఇహపర వ్యవహారములందు మన మనుసరించు మార్గము ధర్మయుతమగును.

ఆలయములో భగవంతుని పూజించుట, కర్పూరహారతిని తిలకించుట, నామసంకీర్తనమును ఆలకించుట, భజనలందు పాల్గొనుట, సుగంధ పుష్ప ధూపాదులను అర్పించుట, దేవుని దివ్యమంగళ స్వరూపమును చూచి, అలంకరించి, పులకించుట, ఆయన అనంత విశిష్ట శక్తిని, భక్తసౌలభ్యమును, ఆయన అపార కారుణ్యమును తలచి పరవశించుట – ఇవన్నీ మన సర్వేంద్రియములను అనుచిత మార్గము నుండి మరల్చి, పవిత్ర ధర్మాచరణమునందు నిమగ్నము చేయును. ధ్యానాది సాధనలవలన శ్రీమన్నారాయణుని పట్ల భక్తి, ఆయన కటాక్షము, రక్షణ లభించును.

253. సిద్ధార్థః

సకలార్థములు సిద్ధించినవాడు. సంపూర్ణుడు. నిత్యపూర్ణుడు.

ఓం సిద్ధార్థాయ నమః

అన్ని సంపదలు ఆయనకు ముందే లభించినవి. ఇంక కావలసినది వేరేమీ లేదు. **సిద్ధః అర్థః యస్య స సిద్ధార్థః.**

ఛాందోగ్యోపనిషత్తులోని **'సత్య కామః సత్య సంకల్పః'** (8.1) అనే వర్ణనను ఈ నామమునకు, తరువాతి నామమునకు ప్రమాణముగా శ్రీ శంకరులు ఉదాహరించారు.

254. సిద్ధ సంకల్పః

సిద్ధించిన సంకల్పము గలవాడు. అన్ని కోరికలు నెరవేరువాడు.

ఓం సిద్ధ సంకల్పాయ నమః

సంకల్పము అనగా కోరిక. భగవానుడు తలచినంతనే అన్ని కోరికలు నెరవేరును. భగవంతుని శరణు జొచ్చిన వారి కోరికలు కూడ సిద్ధించును.

శ్రీవేంకటరమణుని అన్నమయ్య కీర్తించిన విధము – కోరికలన్నింటిని తీర్చు కల్పవృక్షము, దప్పికతీర్చు కాలమేఘము, రోగములను అణగించు దివ్యౌషధము, చెడనీక బ్రతికించు సిద్ధమంత్రము – కనుక దేవునకు శరణాగతులైనవారికి భయము లేదు. లోటు లేదు. కోరికలు మిగలవు. ధర్మవిరుద్ధము కాని కామమును భగవంతుడు అనుగ్రహించును.

ధర్మచక్రములోని ఉదాహరణలు – భగవంతుని అండ ఉన్నందువలననే సుగ్రీవునకు, విభీషణునికి రాజ్యములు లభించెను. దశరథుని మాట నిలబడెను. హనుమంతునికి సీతమ్మతల్లి దర్శన భాగ్యము లభించెను. ఆఖరుకు భీష్ముని ప్రతిజ్ఞ నిలుపుటకై శ్రీకృష్ణ పరమాత్ముడు తన మాటను తప్పి కురుక్షేత్రమున ఆయుధమును ధరించెను.

255. సిద్ధిదః

భక్తులకు సిద్ధులను ప్రసాదించువాడు.

ఓం సిద్ధిదాయ నమః

యోగులకు ధ్యానము, తపస్సు, సాధన వంటి ప్రయత్నముల వలన ఎనిమిది విధములైన సిద్ధులు లభించును. వానిని అష్టసిద్ధులు అంటారు.

1. అణిమ – శరీరమును అతి చిన్నదిగా చేయుట.

2. మహిమ – శరీరమును అతిపెద్దగా చేయుట.
3. గరిమ – శరీరము బరువును విపరీతముగా పెంచుట.
4. లఘిమ – శరీరమును అతి తేలికగా చేయుట.
5. ప్రాప్తి – కావలసిన వస్తువును పొందుట.
6. ప్రాకామ్య – కావలసిన భోగమును అనుభవించుట.
7. ఈశిత్వము – ఎవరిపైనైనా, దేనిపైనైనా అధికారము పొందుట.
8. వశీత్వము – అన్ని భూతములను లోబరచుకొనుట.

ఈ సిద్ధులు భగవంతుని కృపవలననే సాధకునకు లభించును గనుక శ్రీనివాసుడే సిద్ధిదాత.

శ్రీ శంకరుల వ్యాఖ్య – కర్మ ఫలితమును, యోగ్యతను బట్టి జీవులకు సిద్ధులను ప్రసాదించువాడు గనుక భగవానుని 'సిద్ధిదః' అని కీర్తింతురు.

(90వశ్లోకము లోని – **అణుర్బృహత్కృశః స్థూలో గుణభృన్నిర్గుణో మహాన్** – అనే నామములను ఈ సిద్ధుల పరంగా వ్యాఖ్యానించారని గమనింపదగును.)

శ్రీ హనుమాన్ చాలీసా నుండి.

అష్టసిద్ధి నౌ నిధికే దాతా – అస బర దీన్హ జానకీ మాతా
రామ రసాయన తుమ్హరే పాసా – సదా రహో రఘుపతి కే దాసా
తుమ్హరే భజన రామకో పావై – జనమ జనమ కే దుఖ బిసరావై

అణిమాది అష్ట సిద్ధులను అనుగ్రహించు వాడవు. ధనధాన్యాది నవనిధులను ఇచ్చువాడవు. శ్రీరామపత్ని జానకీమాత నీకీ వరమిచ్చినది కదా! నీవు శ్రీరామభక్తి రసాయనము గలవాడవు. సదా శ్రీరఘుపతి పాదసేవా దురంధరుడవు. నీ నామస్మరణ గావించు వారలు శ్రీరామునికి చేరువ అగుదురు. జన్మ జన్మాంతరముల దుఃఖము బాసి సుఖులయ్యెదరు.

---

256. సిద్ధిసాధనః

సిద్ధిని పొందుటకు సాధనమైనవాడు.

ఓం సిద్ధిసాధనాయ నమః

సిద్ధేః సాధకత్వాత్ సిద్ధిసాధనః – సాధన చేయువారిలోని సంకల్పము, శక్తి, నిశ్చయము,దీక్ష అన్నియును భగవంతుడే. కనుక సాధకులకు ఫలితము మాత్రమే ముఖ్యము కాదు. సాధన అను ప్రక్రియ కూడ భగవత్స్వరూపము, ప్రియాతి ప్రియము. శ్రీమన్నారాయణుడే ముముక్షువులకు మోక్షసాధనము, మోక్షమార్గము, మోక్షదాత, మోక్షము.

పశ్చిమ గోదావరి జిల్లా రంగాపురం గ్రామం ఆలయంలో శిల్పము

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **"సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః"** అను ఈ నాలుగు దివ్యనామములు కలిపి ఒక మహామంత్రము. సకల యత్నములకు, ఆశయములకు, యోగములకు మహాఫలవంతము. ఈ మంత్రమును జపించినవారు భగవంతుని నాలుగు దివ్యకుసుమములతో అర్చించినట్లుగా చతుర్విధ పురుషార్థములను సన్మార్గవర్తులై సాధింపగలరు.

ధర్మచక్రము రచయిత – ఈ మంత్రమును జపించినవారి మనసునుండి ఇహలోక వాంఛలు. కామ క్రోధ లోభ మద మాత్సర్యములు తొలగిపోవును. వారి మనస్సు శ్రీమహావిష్ణువు పైననే లగ్నమగును. వారికి ముక్తిమార్గము సుగమమగును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

వృషాహీ వృషభో విష్ణుర్వృషపర్వా వృషోదరః |
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః || (28)

257. వృషాహీ

- ధర్మస్వరూపుడై ప్రకాశించువాడు.
- తన భక్తులను ధర్మపరాయణులుగా చేసి పగటివలె వెలిగించువాడు.
- వృషాహ యజ్ఞమునకు దేవత.
- అగ్నివలె తేజోమయుడు. అన్ని తేజములకు ఆధారమైనవాడు.

ఓం వృషాహిణే నమః

వ్యాఖ్యానకర్తలు ఈ నామమును బహువిధములుగా వివరించారు. దీనిలో రెండు పదములు ఇమిడియున్నవి. 'వృష' అనగా ధర్మము. 'అహ' అనగా పగలు, వెలుగు.

వృషోహి ధర్మ స్తద్రూప మహార్యస్య దినం స్మృతమ్

ప్రథమాభి గమనాఖ్యం వృషాహీ స ప్రకీర్తితః

వృష అంటే ధర్మము. అటువంటి ధర్మస్వరూపమైన దినము కలవాడు. అంటే ఆ పరమేశ్వరుని దర్శించే (పొందే) మొదటిరోజు సమస్త శుభములకు తొలిరోజుగా ధర్మస్వరూపమై ఉంటుంది. అందుచేత పరమేశ్వరుడు ధర్మరూపమగు దినము కలవాడని చెప్పబడినది.

వృషం చ తత్ అహశ్చ వృషాహః

వృషాహః అస్యాస్తీతి వృషాహీ

ఇతనిని పొందే మొదటిరోజు సకల శ్రేయస్సులకు ప్రారంభ దినములాగా ధర్మరూపముగా నుండును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – (1) భగవంతుడు ధర్మస్వరూపుడు గనుక పగటివలె ప్రకాశించును (2) దేవుని నమ్ముకున్నవారు ధర్మమునాచరింతురు. వారు ప్రకాశించుచుందురు.

శ్రీ భట్టులు – భక్తుడు భగవంతుని చేరిన దినమే ఆ భక్తులకు సకల శుభదాయకమగునట్లు చేయువాడు వృషాహి. శ్రీహరిని స్మరించిన దినమే పావనము, మంగళప్రదము, కళ్యాణకారకము.

శ్రీ శంకరులు – (1) **వృషః ధర్మః తదేవ అహః** – ధర్మమును ఉపదేశించువాడు, ప్రసాదించువాడు వృషాహి. (2) 'వృషాహ' అనునది 10, 12 దినములు ఆచరించు ఒక యజ్ఞము. ఆ యజ్ఞమునకు కర్త, భోక్త అయిన దేవుడు గనుక భగవంతుడు వృషాహి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **వృషో అగ్నిః సమిధ్యతే** – అను ఋగ్వేద మంత్రము (3.27.14) ననుసరించి 'వృష' అనగా అగ్ని. 'అహః' అనగా వెలుగు. భగవంతుడు అగ్నివలె తేజోమయుడు. ఇంకా అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జ్ఞానము, ఆత్మతత్వము – అన్నింటిలోని ప్రకాశము భగవంతునివల్లనే కలుగుచున్నది. శ్రీమన్నారాయణుడు ఒక్కడే స్వయంప్రకాశమూర్తి. వెలుగులకు వెలుగు.

డా. క్రోవి పార్థసారధి రచన 'శ్రీకైవల్యసారధి'లో ఉదాహరించిన విషయము –
మధురానగరమునకు ప్రయాణించు అక్రూరుడు ఇలా అనుకొంటున్నాడు (విష్ణుపురాణము నుండి)
అద్య మే సఫలం జన్మ సుప్రభాతా చ మే నిశా
యదున్నిద్రాబ్జపత్రాక్షం విష్ణోర్ద్రంక్ష్యామ్యహం ముఖమ్

పాపం హరతి యత్పుంసాం స్మృతం సంకల్పనా మయమ్
తత్పుండరీక నయనమ్ విష్ణోర్ద్రంక్ష్యామ్యహం ముఖమ్

....

ఇప్పుడు నాజన్మ సఫలమయింది. తెల్లవారుతున్నది. అప్పుడే వికసించిన తామర రేకులవంటి కనులుగల ఆ గోవిందుని దర్శించబోతున్నాను. సంకల్పనాత్మకమైన పాపాన్ని హరించేవాడు, పద్మములవంటి కనులు గలవాడు అయిన విష్ణువును చూడబోతున్నాను. యజ్ఞాలలో యజ్ఞపురుషుడు, పురుషులలో పురుషోత్తముడు, సర్వాధారుడు అయిన ఆ జగదీశ్వరుని దర్శించబోతున్నాను.

ఇంద్రుడు నూరు యజ్ఞాలు చేసి ఎవరిని అర్చించి ఆ పదవి చేపట్టాడో, ఆ స్వామిని నేను దర్శించ బోతున్నాను. బ్రహ్మ, రుద్రుడు, వసువులు, మరుద్గణాలు ఎవరి రూపాన్ని దర్శించాలని అనుకొంటారో, ఆ మహాపురుషుని నేను దర్శించబోతున్నాను.

సర్వాత్మకుడు, సర్వభూతాంతఃస్థుడు, అచింత్యుడు, అవ్యయుడు, సర్వవ్యాపి అయిన శ్రీమహావిష్ణువు నాతో మాటాడబోతున్నాడు. మత్స్య కూర్మాది రూపములతో జగత్తును రక్షించిన ప్రభువు నాతో మాట్లాడబోతున్నాడు. ఇప్పుడు ఆ పరమేశ్వరుడు మనుష్యాకారుడై యున్నాడు. ఆదిశేషుడై భూమిని మోసే ఆ భగవానుడు నన్ను 'అక్రూరా' అని పిలుస్తున్నాడు. పుత్ర, మిత్ర, కళత్రము అనే మాయను మనం జయించలేము. ఆ మాయకు అధిపతి ఆ పరమేశ్వరుడే. అటువంటి మాధవుడికి నమస్కారము.

భద్రాచల రామదాసు కీర్తన

దినమే సుదినము సీతారామ స్మరణే పావనము || దినమే ||
ప్రీతినై నా ప్రాణభీతి నైనా కలిమి – చేతనైనా మిమ్మే తీరుగ తలచిన ఆ || దినమే ||
అర్థాపేక్షను దినము వ్యర్థముగాకుండ – సార్థకముగా మిమ్ము ప్రార్థన చేసిన ఆ || దినమే ||
నిరతము మెరుగు బంగారు పుష్పముల రఘు – వరుని పదముల నమర పూజించిన ఆ || దినమే ||
మృదంగ తాళము తంబురశ్రుతి గూర్చి – మృదు రాగము కీర్తన పాడినను విన్న ఆ || దినమే ||
ఘనమైన భక్తిచే పెనగొని యే వేళ – మనమున శ్రీరాముని చింతించిన ఆ || దినమే ||
భక్తులతో ననురక్తిని గూడక – భక్తి మీరగను భక్తవత్సలు పొగడగా || దినమే ||
దీనశరణ్య మహానుభావ యోగానలోల – నను కరుణింపుమని కొలుచు ఆ || దినమే ||
వాసిగ శ్రీహరిదాసుల గూడుకొని – వాసుదేవు వాంఛతోను పాడెడి ఆ || దినమే ||
అక్కరతోడ భద్రాచలమునను – చక్కని సీతారాములను చూచిన ఆ || దినమే ||

---

258. వృషభః

- **వర్షతీతి వృషభః**. భక్తులపై కామితార్థములను వర్షించు కరుణామూర్తి.
- అమృతమును వర్షించి సంసార తాపమును ఉపశమింప జేయువాడు.
- ధర్మమూర్తియై వెలుగొందువాడు.

ఓం వృషభాయ నమః

వర్షతి ఏష భక్తేభ్యః కామాన్ ఇతి వృషభః

అభిగచ్ఛద్భక్త జనాన్ సుధావర్షతోఽస్పృహమ్
వృషభశ్చ సమాఖ్యాతః సిఞ్చన్ భయహరో మనుః

తనకు అభిముఖులైన భక్తులకు సంసారతాపము ఉపశమించేటట్లుగా ప్రతిదినము అమృతమును వర్షించి తడుపుతూ ఉండేవాడు. ఈ నామధ్యానము భయహరము. ఓం వృషభాయ నమః. భక్తులకు ధర్మము, అర్థము, కామము ప్రసాదించి, సంసార తాపములను హరించి, మాయను దాటించి, మోక్షమును ఇచ్చు

అమృతమయుడు. గరుడవాహనుడు. మోహినీ రూపుడు. కోనేటిరాయుడు. శ్రీధరుడు. శ్రీనివాసుడు. వేంకటరమణుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ధర్మస్వరూపుడై ప్రకాశించువాడు వృషభుడు.

ధర్మచక్రమునుండి – భక్తుల కర్మానుగుణముగ, ప్రయత్నమును బట్టి, భగవంతుడు భక్తుల కోర్కెలను తీర్చును. కాని ఇహలోక సంపదల వలన లభించు ఆనందము అశాశ్వతము. అచ్యుతుని తెలియు సాధన మాత్రమే నిత్యము. సత్యము. సకల మంగళప్రదము. కనుక **'అచ్యుతా! అమరఱ్ ఏఱె! అయర్ తమ్ కోళుందే! ఎన్నుమ్ ఇచ్చువై తవిరయాన్ పోయ్ ఇందిర లోకమ్ ఆళుమ్ అచ్చువై పెరినుమ్ ఎండేన్!"** అని కోరదగును.

259. విష్ణుః

అంతటను వ్యాప్తినొంది, భక్తులను ఎల్లెడల బ్రోచువాడు.

ఓం విష్ణవే నమః

ఈ పుణ్యనామము ఈ మహాస్తోత్రములో మూడుమార్లు వచ్చును.

1వ శ్లోకము. 2వ నామము. విష్ణుః – **విశ్వమ్ విష్ణుః వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః**

28వ శ్లోకము. 259వ నామము. విష్ణుః – **వృషాహీ వృషభో విష్ణుః వృషపర్వా వృషోదరః**

70వ శ్లోకము. 663వ నామము. విష్ణుః – **అనిర్దేశ్యవపుః విష్ణుః వీరోऽనంతో ధనంజయః**

'విష్' అనగా వ్యాపించుట – అన్న ధాతువునుండి 'విష్ణు' నామము వ్యాఖ్యానింపబడినది. **వేవేష్టీతి విష్ణుః** – వ్యాపించువాడు విష్ణువు. భగవంతుడు భక్తుల కోర్కెలను తీర్చు కల్పవృక్షము అని ప్రస్తుతించు సందర్భములో ఈ నామము చెప్పబడినందువలన ఇక్కడ శ్రీభట్టులు చెప్పిన వివరణ కూడా అందుకు అనుగుణంగా ఉన్నది.

సిద్ధార్థః, సిద్ధ సంకల్పః, సిద్ధిదః, సిద్ధిసాధనః, వృషాహీ, వృషభః, విష్ణుః, వృషపర్వః – ఇవన్నీ కొండలంత వరములిచ్చు కోనేటిరాయని అర్చించు కుసుమములు. ఆయన లేనిచోటు లేదు. విష్ణుభక్తులకు తోడు లేదను భావముతో పని లేదు. భయమన్నది అసలే ఏదు. శ్రీహరి అండనుండగా ఇంక కొదువ ఏమున్నది?

విష్ణుస్స్యాదవినా భావాత్ వ్యాప్య వ్యాపక భావతః – జగత్తులో ఉండే పదార్థములన్నింటియందు వ్యాపించి ఉండేవాడు.

260. వృషపర్వా

తనను చేరుకొనుటకై ధర్మము అను మెట్లదారిని ప్రసాదించినవాడు.

ఓం వృషపర్వణే నమః

'వృష' అనగా ధర్మము. 'పర్వ' అనగా సోపానము (మెట్లు). భగవంతుడు వర్ణాశ్రమ ధర్మములను సోపానమును ప్రసాదించి, భక్తులకు ముక్తిమార్గమును సుగమము చేసెను (శ్రీ భట్టుల వ్యాఖ్య).

వృషా వర్ణాశ్రమా ధర్మా పర్వాణ్యారోహణే తు తే

యస్య సన్తి సదా సోஃయం వృషపర్వా ప్రకీర్తితః

బ్రహ్మచర్యమున జ్ఞానార్జన, గృహస్థుగా యజ్ఞయాగాది కర్మలు, వానప్రస్థమున ధర్మచింతన, సన్యాసిగా కర్మత్యాగము, ఆత్మశోధన సాగించుచు అందరును ఈశ్వరార్చన చేయవచ్చును.

కొందరు వ్యాఖ్యానకర్తలు జ్ఞానము, భక్తి వంటి సాధనలను, శ్రవణ మనన, కీర్తనలవంటి సేవలను ఈ ధర్మమార్గములోని మెట్లుగా అభివర్ణించారు.

Ramanuja Darshanam Vol-2 Issue-1 (Jan-Mar 2004) (http://www.vedics.org)
పెరుమాళ్ తిరుమొళి – శ్రీ పి.బి. రాజహంసమ్ స్వామిగారి వ్యాసమునుండి సంగ్రహించినది.

(ఆంగ్ల వ్యాసము ఆధారముగా, తెలుగులో వ్రాయుచున్నాను. మూలమునుండి భిన్నముగానున్నచో క్షంతవ్యుడను – కా.సు.బాబు)

శ్రీమహావిష్ణువు వక్షస్థలము నలంకరించిన కౌస్తుభమణియే కులశేఖరాళ్వారుగా అవతరించెనని చెప్పుదురు. రాజవంశమున జన్మించిన ఈ మహాత్ముడు ధర్మయుతముగా రాజ్యమునేలి, శ్రీమన్నారాయణుడే పరమాత్ముడని గురువుల ద్వారా తెలిసికొని, విష్ణుగాథలు వినుటలోను, విష్ణువును కీర్తించుటలోను, హరిదాసులను సేవించుటలోను జన్మ ధన్యమొనర్చుకొనెను. ఈ శ్రీవైష్ణవమూర్తి రాజ్యమును త్యజించి, దివ్యదేశములను దర్శించి, శ్రీరంగనాథుని సేవలో తరించెను. ప్రత్యేకించి విభవావతారములందు ఆయనకు ఎంతో మక్కువ. ఆయన కీర్తించిన పుణ్యగానమే "**పెరుమాళ్ తిరుమొళి**". ఇందులో 10 దశకములు (10 x 10 స్తోత్రములు) ఉన్నవి.

మొదటి దశకము – శ్రీరంగమున శ్రీమహాలక్ష్మిని, శ్రీరంగనాథుని సేవించుచున్న కావేరీనది వర్ణన. భక్తులయెడ లక్ష్మీనారాయణుల కటాక్షమును స్తుతించుట.

రెండవ దశకము – శ్రీరంగనాధుని సేవకులైన భాగవతుల పట్ల భక్తి, దాసత్వము.

మూడవ దశకము – శ్రీరంగనాధుని యెడల భక్తిభావము లేని వారికి దూరముగానుండవలెనను కోరిక.

నాలుగవ దశకము – తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వరుని స్తుతించు మధురస్తోత్రము. ఏదోవిధముగా ఆ వృషపర్వుని సేవింపవలెనని శ్రీకులశేఖరాళ్వారు తపన. అందు కొరకు ఆ కొండపై నివసింపవలెనని, అందు కనుగుణముగా ఏదో రూపమును ధరింపవలెనని ఆ శ్రీవైష్ణవుని కోరిక.

ముందుగా, 'కురుకై' పక్షిగా పుట్టి కొండపై నుండవచ్చునని శ్రీ కులశేఖరాళ్వారు కోరుకున్నారు. కాని రెక్కలున్నందున ఆ పక్షి దూరంగా ఎగిరిపోయే అవకాశం ఉన్నందున ఆ కోరికను విరమించుకొన్నారు. పోనీ కొండపై సెలయేరులో చేప అయితే, సెలయేరు ఎండినపుడు చేప మరణించవచ్చును. కోనేటిరాయని సేవ అంతటితో ముగింపవలసి వస్తుంది. అలా కాకుండా, సేవాసమయమున శ్రీవారు పుక్కిళించు బంగారుపాత్రను పట్టుకొనే సేవకుడయ్యే భాగ్యము లభిస్తే బాగుండును. కాని ఉద్యోగధర్మములో ఏదైనా పొరపాటు జరిగితే పై అధికారులు ఆ బాధ్యతనుండి తప్పించవచ్చును. కొండపైనుండి దూరంగా పంపివేయవచ్చును.

ఇంతకంటే ఏదైనా చలనము లేని వస్తువుగా ఉంటే మేలు. 'షెన్బగ' (చంపక?) వృక్షమై శ్రీనివాసుని పూజించు పూలు సమర్పించుకొనవచ్చునేమో! కాని స్వర్గములోని పారిజాత వృక్షమునే పెకలించి ప్రియురాలిని సంతోషపెట్టాలని శ్రీకృష్ణుడు ప్రయత్నించగా, ఇంక మామూలు చెట్టునెవరో తొలగించరని నమ్మకమేమిటి? కొండపైన ఎవరూ పట్టించుకోని పొద అయితేనో? దారి సరి చేయువారెవరైనా ఆ పొదను తీసివేయుదురేమో. కొండమీద బండరాయి అయితే దానిని విగ్రహముగా మలచడానికి (బౌద్ధ) శిల్పులు తీసికొని పోవచ్చును. సెలయేరుగా ఉంటే వేసవికాలములో ఎండిపోవచ్చును. గుడికి పోవు దారిగా మారి హరిదాసులను సేవించుకుందామంటే వారు వేరేదారి చూచుకొనవచ్చునేమో.

ఇలా కాదు. గర్భగుడి ద్వారమువద్ద మెట్టుగా అయితే – అంతకంటే భాగ్యమేమున్నది? నిరంతరము శ్రీనివాసుని దర్శించుకొని తరించు అవకాశము కలుగును. కాకపోతే ఆలయ పాలకులు ఆ మెట్టుకు బంగారు రేకు తొడిగిస్తే ఆపై తిరుమలేశుని దర్శనం కుదరదు. ఏమీ పాలుపోవడంలేదు. **ఎమ్ పెరుమాన్ పొన్నుమలై మేల్ ఎత్తనుమ్ అవనే ....** .. సర్వేశ్వరా! శ్రీ వేంకటేశ్వరా! నీ కొండపై ఏదో ఒకటిగా జన్మించేలా అనుగ్రహించు! (తిరుమల తిరుపతి గర్భగుడి ద్వారము వద్ద నున్న మెట్టును 'కులశేఖరపడి' అని అంటారు. పడి=మెట్టు).

5వ దశకము – జీవునకు, పరమాత్మకు మధ్య నుండు నవవిధ బాంధవ్యమును వర్ణించారు. (కేరళలోని) తిరువిత్తువక్కోడు ఆలయమునందు వెలసిన శ్రీమన్నారాయణుడే పరమాత్ముడు. ఆయన శ్రీచరణ ధ్యానమే మోక్షమార్గము అని శ్రీ కులశేఖరాళ్వారులు కీర్తించారు.

6వ దశకము – శ్రీ కులశేఖరళ్వరులు బృందావనమున గోపికయై గోపాలబాలుని కానక విరహమున తపించుచున్నట్లుగా సాగిన కవిత.

7వ దశకము – శ్రీ కులశేఖరాళ్వారులు తనను తాను దేవకీదేవిగా తలచుకొన్నారు. కన్నబిడ్డకు దూరమై ఆ తల్లి చెరసాలలో అనుభవించు వేదనను కవి స్వయముగా అనుభవించి విలపించారు. బాలకృష్ణుని ఆటలకు, మాటలకు, లీలలకు నోచుకొనలేకపోతినే అని ఆక్రోశించారు.

8వ దశకము – శ్రీరామచంద్రుని నిదుర బుచ్చుటకు తల్లి కౌసల్య పాడిన జోల.

9వ దశకము – తండ్రి మాట నిలుపుటకై వనవాసమునకు పోయిన శ్రీరాముని తలచుకొని దశరథుడు విలపించిన దృశ్యము. రామావతార కాలమున జన్మించలేకపోతినే అని శ్రీ కులశేఖరాళ్వారు బాధ పడినారు.

10వ దశకము – సంగ్రహ రామాయణము. నీలమేఘ శ్యాముని వర్ణన. రామాయణ మహాత్మ్యమును తెలిసికొని సులభముగా మోక్షమును సాధింపవచ్చునని శ్రీవైష్ణవులకు బోధన.

---

261. వృషోదరః

- ధర్మమును ఉదరమున ధరించినవాడు.
- అగ్నిని ఉదరమున ధరించినవాడు.
- ప్రళయ (వర్ష) కాలమున సమస్తమును ఉదరమున భద్రపరచువాడు.
- భక్తులను కడుపులో పెట్టుకొని కాపాడువాడు.

ఓం వృషోదరాయ నమః

ఈ నామమునకు వివిధములైన వివరణలను చెప్పారు.

యజ్ఞయాగాది ధర్మకార్యములందు అర్పించిన పూజోపచారములను గ్రహించు ఉదరము కలిగినవాడు వృషోదరుడు.

భక్తైరుపాహృతామ్ పూజాం ఉపహారాంశ్చ ధర్మతః
కృత్వాదరే యోజయతి స వృషోదర ఉచ్యతే.

ధర్మనిర్వర్తకులైన బ్రహ్మాదులు ఆయన (ఉదరము)నుండి జన్మించిరి గనుక ఆయన వృషోదరుడు. పరబ్రహ్మము.

వృష = వర్షించుట – కల్పాంత మహాప్రళయ కాళమున సమస్తమును తన (ఉదరము)లో భద్రపరచి, అనంతరము మరల సృష్టి చేయు వటపత్రశాయియే వృషోదరుడు.

వృష = అగ్ని – ఉదరమున అగ్నిని ధరించినవాడు. (ఈ నామమును, దీని ముందు నామములను 'అగ్ని' అనే అర్థములో శ్రీ వాసిష్ఠగారు వివరించారు. సూర్యునియందును, భూమియందును,

సాగరమందును,మానవుల జఠరమునందును – అణువణవున అగ్ని దాగియున్నది. (Atomic energy, Digestive juices, volcanoes, thermo nuclear energy etc.,) అనే విషయమును గ్రహించినయెడల 'వృషోదర' నామమును అగ్ని పరమగా అర్థము చేసుకొనవచ్చును.

- భక్తులను కడుపులో పెట్టుకొని కాపాడువాడు వృషోదరుడు.

262. వర్ధనః

వర్ధిల్లజేయువాడు. వృద్ధి పరంపరలు కలిగించువాడు.

ఓం వర్ధనాయ నమః

వర్ధయతీతి వర్ధనః – పెంచి పోషించువాడు వర్ధనుడు.

మాతృవజ్జఠరే కృత్వా భక్తాన్వర్ధయతి స్వయం
వర్ధనః ప్రోచ్యతే నిత్యం సప్తార్ణో వృద్ధిదో మనుః
తల్లివలె భక్తులను తన కడుపులో పెట్టుకొని వర్ధిల్లజేసేవాడు గనుక వర్ధనుడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. దీనిని స్మరిస్తే వృద్ధి కలుగుతుంది. ఓం వర్ధనాయ నమః.

ఇంతటి ముందు నామము 'వృషోదరః' అనగా ప్రళయ వర్షమున సమస్తమును ఉదరమున భద్రపరచువాడు – అన్న భావమునే కొనసాగిస్తూ శ్రీ భట్టులు 'వర్ధనః' నామమును వ్యాఖ్యానించారు. భక్తులను, సమస్తమును తన గర్భమున ఉంచుకొని వర్ధిల్లజేయువాడు గనుక ఆయన వర్ధనుడగును.

శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్య స్వామి – భగవంతుని శరణుజొచ్చినవారిని వృద్ధి చేయును గనుక వర్ధనుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – పిడికెడు అటుకులు గ్రహించి భగవంతుడు కుచేలుని కుబేరునికంటె సంపన్నునిగా అనుగ్రహించాడు. అల్పమైన మ్రొక్కుబడులు స్వీకరించి కొండలంత వరములు క్రుమ్మరించును. పత్ర పుష్ప ఫల జలాదులతో ప్రసన్నుడై భక్తుల యోగక్షేమములను వహించువాడు. వర్ధనుడు.

ధర్మచక్రము రచయిత – వళ్ళు పెంచడము ముఖ్యము కాదు. జ్ఞానమును, భక్తిని పెంపొందించుకొనుట ప్రధాన ధర్మము. అందుకు చేయూతనిచ్చు భక్తజన వత్సలుడైనందున శ్రీమహావిష్ణువు వర్ధనుడు.

263. వర్ధమానః

వర్ధిల్లజేయువాడు. తానును వృద్ధినొందువాడు.

ఓం వర్ధమానాయ నమః

వర్ధయస్తాన్ స్వయమపి వర్ధమానః – వర్ధతే ఇతి వర్ధమానః. స్వయముగా వర్ధిల్లువాడు మరియు వర్ధిల్లజేయువాడు వర్ధమానుడు.

శ్రీ భట్టులు – తన భక్తుల వృద్ధిని చూచి సంతోషముతో పొంగిపోవు ఆత్మబంధువు, వర్ధమానుడు.

శ్రీ చిన్మయానంద – ఇంతింతై, అంతంతై, ప్రభారాశిని మించి, బ్రహ్మాండాంత సంవర్ధియైన త్రివిక్రముడు.

శ్రీ శంకరులు – **ప్రపంచ రూపేణ వర్ధతే ఇతి వర్ధమానః.** ఆయన విశ్వాత్మకుడు. విశ్వరూపుడు. విశ్వేశ్వరుడు. విశ్వము వర్ధిల్లుట యనగా ఆయన వర్ధిల్లుటయే.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః** .. .. – 'వర్ధమానః' నామము ప్రక్కన 'చ' అను శబ్దము గమనింపదగినది. విశ్వమెలా వర్ధిల్లుచుండునో అదే విధముగా శ్రీహరియు వృద్ధి చెందును.

దసరా పద్యము

ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయము లెల్ల వంది గణమై బ్రహ్మాండ మాకారమై
సిరి భార్యామణి యై విరించి కొడుకై శ్రీ గంగ సత్పుత్రి యై
వరసన్నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా

264. వివిక్తః

- విలక్షణమైనవాడు.
- ప్రత్యేకమైనవాడు. వేరెవరితోను, వేనితోను పోలిక గాని, బంధము గాని లేని నిర్లిప్తుడు.

ఓం వివిక్తాయ నమః

లోకోత్తరాది వృత్తాన్తాత్ స్వై కాన్తాగణ బృంహితాత్
వివిక్త ఇతి విఖ్యాతః పావనత్వప్రదోమనుః
లోక విలక్షణమైన వృత్తాంతము గలవాడు అవటంవలన, అసాధారణమైన కళ్యాణగుణ సమూహము కలవాడు గనుక లోకాతీతుడై వివిక్తుడగుచున్నాడు. **వివిచ్యతే ఇతి వివిక్తః.** ఈ నామము పవిత్రతను ప్రసాదించే మంత్రము. ఓం వివిక్తాయ నమః.

భగవంతుడు సర్వాంతఃస్థితుడు. వర్ధనుడు. వర్ధమానుడు. కాని ఆయనకు వేనితోను సంబంధము లేదు. ఆయన అన్నింటికీ అతీతుడు. అసమానుడు. అప్రమేయుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు 'విజ్' అనగా 'పృథక్ భావే' – వేరుగా ఉండుట – అనే మూలము ఆధారముగా ఈ నామమును వ్యాఖ్యానించారు. కుండలు చేయు కుమ్మరికి ఆ కుండల లక్షణములతో సంబంధము లేదు. అతడు వేరు. కుండలువేరు. అలాగే సృష్టికర్త, సృష్టి పాలకుడు, లయకారకుడు నైన మహాదేవుడు సృష్టికంటె విలక్షణమైనవాడు. శ్రీ వాసిష్ఠగారు ఋగ్వేదములోని – **ద్వా సుపర్ణాః సాయుజా సఖాయాః** .. .. – అనే శ్లోకము (1.164.20)ను ఉదాహరించారు. సాక్షియైన పక్షికి కర్మఫలములతో సంబంధము లేదు.

శ్రీ వాసిష్ఠ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రములోని వేయి నామముల అర్థములను వివరిస్తూ వేయి శ్లోకాలను రచించారు. వానిలో మచ్చునకొకటి.

కృత్వా జగత్ సర్వవిధమ్ విధాతాస్వయమ్ వివిక్తో హ్యజరోఽమరః సః
సహస్ర శీర్షా స సహస్ర దృష్టిః స సర్వబంధుః పృథక్ చ దృశ్యాత్

భగవంతుడు బహువిధములుగా విలక్షణుడు. అనన్యుడు. కర్మఫలములకు సంబంధము లేనివాడు. ఆయన గుణములు, లీలలు, కార్యములు అసాధారణములు. అనన్యసాధ్యములు అని శ్రీ భట్టుల వ్యాఖ్య.

విశ్వమంతా వ్యాపించియున్నా, వానికంటె వేరైనవాడు అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – బుద్ధికి, తర్కమునకు అందనివాడు గనుక ఆయన 'వివిక్తః'

ధర్మచక్రము రచయిత – అన్ని కర్మములను మోహరహితముగా, నిర్లిప్తతతో ఆచరించుట వలన పరమాత్మను గూర్చిన జ్ఞానము సాధించు మార్గము సుగమమగును. పంచేంద్రియములను కట్టడి చేసినపుడే శ్రీమహావిష్ణువుపై బుద్ధి తగులుకొనును.

265. శ్రుతిసాగరః

అన్ని శ్రుతులకు సముద్రమువంటివాడు. వేదములకు మూలము, వేదజ్ఞానమునకు పరమార్థము ఆయనే. **శ్రుత్యాః సాగర ఇవ అత్ర నిధీయతే ఇతి శ్రుతిసాగరః**

ఓం శ్రుతిసాగరాయ నమః

నదీనాం సాగర ఇవ స్వగుణోక్తి విధాజుషామ్
శ్రుతీనామవసానత్వాత్ కథ్యతే శ్రుతి సాగరః

నదులన్నింటికీ సాగరమే సంగమ స్థానము. అదే విధముగా వేదమున్నీ పరమాత్మునివైపు మనలను తీసికొనిపోవును. కనుకనే ఆయన వేదవేద్యుడు. శ్రుతిసాగరుడు.

ఈ నామ వివరణలో శ్రీ భట్టులు శ్రీమద్భాగవతము నుండి – **నారాయణ పరా వేదాః ....** – అనే శ్లోకము (2.5.15)ను, మరియు శ్రీ మద్భగవద్గీత నుండి – **వేదైశ్చ సర్వైః అహమేవ వేద్యః** – అనే శ్లోకము (!5.15)ను ఉదాహరించారు.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్త స్స్మృతిః జ్ఞాన మపోహనంచ
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్
అర్జునా! సమస్త ప్రాణుల హృదయముల యందు అంతర్యామిగా ఉన్నవాడను నేనే. నానుండియే స్మృతి, జ్ఞానము, అపోహనము (సందేహములు తొలగుట) కలుగుచున్నవి. వేదముల ద్వారా తెలుసుకోదగినవాడను నేనే. వేదాంతకర్తను, వేదజ్ఞుడను నేనే.

డా. క్రోవి పార్థసారథి 'శ్రీకైవల్యసారథి'నుండి –
వేదాంతము అంటే వేదములయొక్క చివరి భాగము. వేదములు నాలుగు భాగములు
(1) సంహితలు (2) బ్రాహ్మణములు (3) అరణ్యకములు (4) ఉపనిషత్తులు.
వేదములయొక్క సారమును వివరించే ఉపనిషత్తులే వేదాంతము. ఇది జ్ఞానకాండ. దీనివలన తెలిసికొనేది ఆ పరమేశ్వర స్వరూపాన్నే. ఈ ఉపనిషత్తుల సారాన్ని మహావాక్యాలలో చెప్పారు. ప్రతి వేదంలోనూ ఒక మహావాక్యం ఉన్నది.

వేదము	**ఉపనిషత్తు**	**మహావాక్యము**
ఋగ్వేదము	ఐతరేయోపనిషత్తు	ప్రజ్ఞానం బ్రహ్మ
శుక్ల యజుర్వేదము	బృహదారణ్యకోపనిషత్తు	అహం బ్రహ్మాస్మి
సామవేదము	ఛాందోగ్యోపనిషత్తు	త త్త్వమసి
అధర్వణ వేదము	మాండూక్యోపనిషత్తు	అయమాత్మా బ్రహ్మ

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః |
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః || (29)

266. సుభుజః

- అందమైన భుజములు గలవాడు – **శోభనా భుజః అస్య ఇతి.**

- జగద్రక్షకుడు. భక్త వరదుడు.

ఓం సుభుజాయ నమః

తనను శరణుజొచ్చిన భక్తుల యోగక్షేమములను, భారమును వహించు మహోన్నత భుజములను శ్రీభట్టులు ఈ నామరూపమున కీర్తించారు. అంతటితో ఆగక, సకల భువనములను రక్షించు భుజములు కలిగినవాడు సుభుజుడు అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. రక్షించి, కామితార్థములను ప్రసాదించు అభయ వరద హస్తుడైనందున శ్రీనివాసుడు సుభుజుడని శ్రీ చిన్మయానంద స్తుతించారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **పాతు ప్రణత రక్షాయామ్ విలంబమ్ అహసన్నివ, సదా పంచాయుధీమ్ బిభ్రత్ సనః శ్రీరంగనాయకః** భక్తుల రక్షణార్థము ఏమాత్రము జాప్యము జరుగకుండ నుండుటకై సదా పంచాయుధములను ధరించి సిద్ధముగానుండు శ్రీరంగనాధుడు.

గజరాజు రక్షణకై చక్రమును ప్రయోగించినవాడు. గోకులమును కాచుటకై గోవర్ధనగిరి నెత్తినవాడు. విభీషణునకు శరణమిచ్చినవాడు. కటి వరద హస్తములతో, శంఖ చక్రములతో తిరువేంకటగిరిపై వెలసినవాడు. శ్రీవేంకటరమణుడు. అర్జునునికొరకు రధము తోలినవాడు. ద్రౌపదికి చీరలిచ్చినవాడు.

ధర్మచక్రము రచయిత – 'సుభుజ' అన్న నామము శంఖ, చక్ర, గదా, పద్మములను ధరించిన శ్రీమహావిష్ణువు కరములను స్మరించును. శంఖము ప్రణవనాద భరితము. చక్రము ధర్మపరులను రక్షించి, అధర్మవర్తులను శిక్షించును. గద దుర్మార్గులను అణచివేయును. పద్మము భగవంతునకు భక్తులపైనున్న అనురాగమును సూచించును.

అన్నమయ్య కీర్తన

ఇందరికి న భయంబులిచ్చు చేయి – కందువగు మంచి బంగారు చేయి॥

వెలలేని వేదములు వెదకి తెచ్చినచేయి – చిలుకు గుబ్బలి కింద చేర్చు చేయి
కలికి యగు భూకాంత కౌగిలించిన చేయి – వలనైన కొనగోళ్ళ వాడి చేయి

తనివోక బలిచేత దానమడిగిన చేయి – ఒనరంగ భూదాన మొసగు చేయి
మొనసి జలనిధి యమ్ముమొనకు దెచ్చిన చేయి – ఎనయ నాగేలు ధరియించు చేయి

పురసతుల మానములు పొల్లసేసిన చేయి – తురగంబు బరపెడి దొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుడై మోక్షంబు – తెరువు ప్రాణుల కెల్ల తెలిపెడి చేయి॥

శ్రీ సుదర్శన స్తోత్రము

చక్రాద్యాయుధ చారు షోడశ భుజం – సజ్వాల కౌశోజ్వలం
చక్రం శంఖ గదాబ్జ శూల శరధీం – శ్చాపం చ పాశాంకుశౌ
కున్తం చర్మ హలం భుశుణ్డి పరశూ – వజ్రం తథా తర్జనీం
హేతిం షోడశ ధారిణం రిపుహరం – శ్రీచక్రరాజం భజే.

267. దుర్ధరః

- ఇతరులచేత ఆపబడజాలని బలము కలవాడు (ఎదురు లేనివాడు).
- తెలిసికొనుటకు అందనివాడు (తెలియరానివాడు).
- మనస్సులో నిలుపుకొనుటకు కష్టమైనవాడు (నిలువరానివాడు).
- మరి దేనిచేతను ధరింప (భరింప) జాలనివాడు.

ఓం దుర్ధరాయ నమః

ఈ నామము 267వ మరియు 720వ నామములుగా చెప్పబడినది.

29వ శ్లోకము. 267వ నామము – దుర్ధరః – **సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః**

76వ శ్లోకము. 720వ నామము – దుర్ధరః – **దర్పహా దర్పదో దృప్తో దుర్ధరోఽథా పరాజితః**

పరైర్దుర్వార వేగో యః దుర్ధరః స చ కథ్యతే – ఇతరులచేత ఆపబడని వేగము కలవాడు.

'సుభుజః' అనగా శరణాగతులను కాపాడు అనంత శక్తియుతములైన భుజములు కలవాడు – అన్న భావమునే 'దుర్ధరః' నామ వివరణయందు శ్రీ భట్టులు కొనసాగించారు. పొంగివచ్చే సముద్ర ప్రచండమును ఇసుకతిన్నెలు ఆపలేనట్లే శ్రీమహావిష్ణువు భుజబలము యెదుట మరేమియును నిలువజాలవు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – (1) ధ్యాన సమయమున శ్రీమన్నారాయణుని మనసులో నిలుపుకొనుట యోగులకు చాల కష్టము (2) సమస్తమును ఆయనే భరించును. ఆయనను భరించువారెవ్వరును లేరు.

శ్రీ చిన్మయానంద – మహాయోగులకు కూడ ఆయనను తెలిసికొనుట సాధ్యము కాదు.

ధర్మ చక్రము రచయిత వ్యాఖ్య – భగవంతుని మనస్సులో నిలుపుకొనవలెనన్నచో ముందుగా ప్రాణాయామాది సాధనముల ద్వారా మనస్సును నిర్మలమొనర్చుకొనవలెను. పిదప శ్రీనివాసునిపై ధ్యానము సాగించవలెను.

268. వాగ్మీ

- మధురమైన, ప్రియమైన, స్తుతింప దగిన వాక్కు కలవాడు.
- శక్తిపూరితమైన వాక్కు కలవాడు.
- వేదములు ఆయన వాక్కునుండి ఉద్భవించెను.

ఓం వాగ్మినే నమః

యుద్ధభూమియందు దిక్కుతోచక కర్తవ్య విమూఢుడైన అర్జుననకు గీతోపదేశ మొనరించిన శ్రీకృష్ణపరమాత్ముడు సకల పుణ్యవాఙ్మయ స్వరూపుడు. శ్రీరాముడు మృదుభాషి. ప్రియభాషి. అందరిని స్వయముగా పలకరించి యోగక్షేమములు తెలిసికొనెడివాడు. విద్యానిధి. **బుద్ధిమాన్ మధురభాషీ పూర్వభాషీ ప్రియంవదః** – అని అయోధ్యకాండము (1.13)లో చెప్పారు.

వాగ్వివృత్తాశ్చ వేదాః – ఆయన వాక్కునుండి వచ్చినవన్నీ వేదములే.

భగవానుని వాక్ప్రభావమును వివరిస్తూ ధర్మచక్రము రచయిత గీత (18.73)నుండి ఉదాహరించారు.

నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత
స్థితోऽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ

అర్జునుడు పలికెను – ఓ అచ్యుత! నీ కృపచే నా మోహము పూర్తిగా తొలగినది. స్మృతిని పొందితిని. ఇప్పుడు సంశయ రహితుడనైతిని. కనుక నీ ఆజ్ఞను తలదాల్చెదను.

269. మహేంద్రః

- మహత్తరమగు, అనన్యమగు ఐశ్వర్యము కలవాడు. సిరిగలవాడు.

- ఇంద్రునకును, దేవతలకును దేవుడు.

- అన్ని వెలుగులకు మూలము.

ఓం మహేంద్రాయ నమః

'ఇది' అన్న మూలమునకు పరమైశ్వర్యము అనే అర్థమున్నది. **పరమైశ్వర్యవత్త్వేన మహేన్ద్ర ఇతి శబ్ద్యతే.** ఆయన సకలైశ్వర్య సంపన్నుడు. అన్నింటికిని అధిపతి. ప్రభువు.

ఇంద్రునకు ప్రభువైనందున శ్రీమన్నారాయణుడు మహేంద్రుడు.

'ఇన్ధి' అనగా ప్రకాశించుట (దీప్తౌ) అనే ధాతువునుండి శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు మరొక అర్థాన్ని చెప్పారు. అన్నింటా ఆయనే వెలుగు. అన్ని వెలుగులు ఆయన నుండియే సంభవించును. కనుక ఆయన మహేంద్రుడు.

270. వసుదః

సంపదలను ప్రసాదించువాడు

ఓం వసుదాయ నమః

వసు (=ధనము) దదాతి ఇతి వసుదః – ధనమునిచ్చువాడు 'వసుదః'.
వసుదో ధనదావాచ్చ ధనాయద్భ్య విశేషతః –ఇంద్రుడు, కుబేరుడు వంటివారికి దనమునిచ్చువాడు.

సామాన్యమయిన ధనము కాని, త్రైలోక్యాధిపత్యము కాని, ఏదయినా శ్రీనివాసుని కటాక్షము వల్లనే లభించును. ధర్మము, అర్థము, కామము, మోక్షము – అన్నియును భక్తులపట్ల దయతో ఆ శ్రీధరుడు ప్రసాదించినవే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఎవరైనా ఏమయినా ఎవరికైనా ఇచ్చినప్పుడు భగవంతుని దాతృత్వము ఆ కార్యములో ప్రకాశించును. అన్నదానము, వస్త్రదానము, జ్ఞానదానము వంటి పుణ్యకార్యములను చేయువారు శ్రీమహావిష్ణువును పూజించినవారే యగుదురు.

271. వసుః

జ్ఞానులైనవారు కాంక్షించు సంపద వాసుదేవుడే.

ఓం వసవే నమః

ఈ నామము మూడుమారులు – 105, 271, 701వ నామములుగా చెప్పబడినది.

12వ శ్లోకము. 105వ నామము – వసుః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

29వ శ్లోకము. 271వ నామము – వసుః – **సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః**

74వ శ్లోకము. 701వ నామము – వసుః – **వసుప్రదో వాసుదేవో వసుః వసుమనా హవిః**

మహేంద్ర, వసుద, వసు – ఈ నామములు ఐశ్వర్యమును స్తుతించు సందర్భములో చెప్పబడినవి. అన్నింటికంటె ఉత్తమమైన సంపద వైకుంఠప్రాప్తి, శ్రీవిష్ణుసేవా భాగ్యము. భక్తులకు ఆయనే కొంగుబంగారము.

వాసుదేవస్సర్వమితి స మహాత్మా సుదుర్లభః – సర్వమును వాసుదేవుడే అని తెలియు మహాత్ములు అరుదు. వాసుదేవుడే పరమైశ్వర్యము. అది సాధించు మార్గమును వాసుదేవుడే.

'వసు' నామమునకు చెప్పబడిన ఇతర భావములు.

- భక్తుల హృదయమున వసించువాడు.
- క్షీరసాగర నివాసి.
- వసువులందు పావకుడు.
- అంతరిక్షమున వసించువాడు.
- అత్యుత్తమమగు ధనము.
- మాయతో అంతను కప్పివేసినవాడు.

'**నైకరూపః**'తో ప్రారంభమయ్యే తరువాతి నామములు కొన్నింటిని శ్రీవాసుదేవుని విశ్వరూప స్తుతిగా శ్రీభట్టులు వర్గీకరించారు.

వివిధ పురాణములలో విశ్వరూప వర్ణన ఉన్నది. వాటిని డా. క్రోవి పార్థ సారథిగారు తమ 'శ్రీ కైవల్య సారథి'లో ఉదాహరించారు.

1) శ్రీమద్భాగవతము – బ్రహ్మదేవుడు నారదునికి చెప్పిన శ్రీమహావిష్ణురూపము.
2) విష్ణుధర్మోత్తర పురాణము – మార్కండేయుడు వర్ణించినది. నారదుడు దర్శించిన విశ్వరూపము.
3) భగవద్గీత – 11వ అధ్యాయము – అర్జునుడు దర్శించిన శ్రీకృష్ణ రూపము.
4) వేదములలోని పురుష సూక్తము.

శ్రీమద్భాగవతము – నారదునకు బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువుయొక్క విశ్వరూపమును వర్ణించిన విధము.

వాచాం వహ్నేర్ముఖం క్షేత్రం ఛందసాం సప్తధాతవః

హవ్య కవ్యామృతాన్నానాం జిహ్వా సర్వ రసస్య చ

....

స్మృతీ విచక్రమే విష్వఙ సాశనానశనే ఉభౌ

యదవిద్యా చ విద్యాచ పురుష స్తూభయాశ్రయః

యస్మాదండం విరాడ్ జజ్ఞే భూతేంద్రియ గుణాత్మకః

తద్ ద్రవ్యమత్యగాద్ విశ్వం గోభిః సూర్యయివా తపన్

ఆ విశ్వరూపునకు భూలోకము కటిప్రదేశము. ఊర్ధ్వలోకములు శరీరము పైభాగము. అధోలోకములు క్రిందిభాగములు. అగ్నియే ముఖము. (వాక్కు ముఖము). వాయువు శ్వాస. రాత్రింబవళ్ళు కనురెప్పలు. చిరునవ్వు మహామాయ. కాలము ఆయన గమనము. హృదయము అవ్యక్తము. రుద్రుడు అహంకారము. మనుష్యులు ఆ విరాట్ స్వరూపుని నివాసము. ....

అంతే కాదు నారదా!

నీలకంధరునకు, నీకు నాకు సనత్కు

మార సుఖ్య సుత సమాజమునకు

ధర్మ సత్యబుద్ధి తత్త్వములకు నీశ్వ

రాత్మ వినుము పరమమైన నెలవు.

నర సురాసుర పితృ నాగ కుంజర మృగ, గంధర్వ యక్ష రాక్షస మహీజ

సిద్ధ విద్యాధర జీమూత చారణ గ్రహ తారకాప్సరో గణ విహంగ

భూత తటిద్వసు పుంజంబులును, నీవు ముక్కంటియును, మహామునులు, నేను

సలిల నభస్థల చరములు మొదలైన వివిధ జీవులతోడి విశ్వమెల్ల

విష్ణుమూర్తి మయము పుత్ర! వేయేల బ్రహ్మాండ

మతని జేనలోన నడగియుండు

బుద్ధి నెరుగరాదు; భూతభవద్భవ్య

లోకమెల్ల విష్ణులోన యుండు.

విష్ణుధర్మోత్తర పురాణము – నారదుడు చూసిన విశ్వరూపము. మార్కండేయుడు వజ్రునకు వర్ణించినది.

స దదర్శ తదా విష్ణుం విశ్వరూప ధరం హరిమ్

యుక్తం వర్ణైః శుకప్రఖ్యైః పీతరక్త సితాసితైః

....

త్రైలోక్యంచ తథాకాయే సకలం మునిసత్తమః
దేవ దానవ గంధర్వ స యక్షోరగ రక్షసామ్
ద్వీపాంభోనిధిలోకైశ్చ పాతాలైశ్చ సంయుతమ్
జగత్సమగ్రం దేవస్య దేహస్థం దృష్టవాన్మునిః
స దృష్ట్వా పరమం రూపం భీతో హృష్టశ్చ విస్మితః
పపాద పాదయోస్తస్య శిరసా సాశ్రులోచనః

ఆ నారదుడు అపుడంతట విశ్వరూప ధరుడును, విష్ణువును అగు శ్రీహరిని దర్శించెను. అతడు ఒక్కొక్కచోట ఇవి ఇట్టివి అని నిర్దేశించ నలవిగాని బహువర్ణములు ధరించియుండెను. బహువిధములుగా ప్రకాశించుచుండెను. నానావిధ ప్రాణుల బహుముఖములను, బ్రహ్మ శంకర రుద్ర యమ వరుణ కుబేరాగ్ని వాయు నిర్చత గ్రహ నక్షత్ర వసు రుద్రాదిత్య మరుద్ భృగ్వంగిరః సాధ్యాऽశ్వి దైత్య నాగ గంధర్వ సర్వ రక్షః పితృ పన్నగ యక్ష పిశాచ మనుష్య హయ నాగ గజాశ్వ మృగ పక్షి ఖడ్గమృగ వ్యాఘ్ర సింహాది ప్రాణి విశేషముల ముఖములను దాల్చియుండెను. అతని ముఖములు వందలు వేలుగా కనబడుచుండెను. రౌద్రరూపుడగు అతని రౌద్ర ముఖములందు అతనిచే మ్రింగబడుచున్న అనేక ప్రాణి సంఘములను, అగ్నులను కూడ నారదుడు చూచెను. అతని సౌమ్య ముఖములనుండి వెలికి వచ్చుచున్న అనేక ప్రజలును, వివిధ వాహనములును ఆ నారదునకు కనబడెను. నానా ముద్రా సమన్వితములును, నానా భాండము (వస్తువు)లతో నానాయుధములతో కూడిన హస్తములును వేలకొలదిగా అతనికి కనబడెను. ఆ ముని సయక్ష నాగ రక్షోగణములతోను, ద్వీప సముద్రాదులతోను, పాతాళాది లోకములతోను కూడినదయి సమగ్రమయిన దానిని ఆ భగవానుని దేహమునందు – దేహముగానే యున్నదానిని – చూచెను.

శ్రీమద్భగవద్గీత – 11వ అధ్యాయము – విశ్వరూప సందర్శన యోగము.
9 నుండి 25వ శ్లోకము వరకు అర్జునుడు దర్శించిన శ్రీకృష్ణుని విశ్వరూప వర్ణనము.

సఞ్జయ ఉవాచ।
ఏవముక్త్వా తతో రాజన్మహాయోగేశ్వరో హరిః।
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్॥ 11-9 ॥

అనేకవక్త్రనయన మనేకాద్భుతదర్శనమ్।
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్॥ 11-10 ॥

దివ్యమాల్యామ్బరధరం దివ్యగన్ధానులేపనమ్।
సర్వాశ్చర్యమయం దేవమనన్తం విశ్వతోముఖమ్॥ 11-11 ॥

దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా।
యది భాః సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః॥ 11-12 ॥

తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్తమనేకధా|
అపశ్యద్దేవదేవస్య శరీరే పాణ్డవస్తదా|| 11-13 ||

తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనఞ్జయః|
ప్రణమ్య శిరసా దేవం కృతాఞ్జలిరభాషత|| 11-14 ||

సంజయుడు పలికెను – ఓ రాజా! మహాయోగేశ్వరుడును, పాపములను హరించువాడును ఐన భగవానుడు ఈ విధముగా పలికి, అనంతరము షడ్గుణైశ్వర్య సంపన్నమైన తన పరమ దివ్యస్వరూపమును అర్జునునకు చూపెను. అర్జునుడు చూచిన ఆ పరమేశ్వరుని విరాట్ (విశ్వ) రూపమునందలి ముఖములు అనంతములు – నేత్రములు అసంఖ్యాకములు. అందలి దృశ్యములు అద్భుతములైనవి. ఆ రూపము అనేక దివ్యాభరణ శోభితము. ఆ పరమేశ్వరుడు పెక్కు దివ్యాస్త్రములను చేపట్టియుండెను. దివ్యములగు మాలలను, వస్త్రములను ధరించియుండెను. ఆ దివ్యశరీరమునుండి దివ్యచందన పరిమళములు దశదిశల గుబాళించుచుండెను. ఆ రూపము సర్వాశ్చర్యకరము, అనంతము, సర్వతోముఖము, ఆకాశమున వేలకొలది సూర్యులు ఒక్కుమ్మడిగా ఉదయించినచో వచ్చు కాంతి పుంజములును ఆ విరాట్-రూప తేజస్సునకు సాటి రావు.

ఆ సమయమున అర్జునుడు ఆ దేవాది దేవుని శరీరమనందు అసంఖ్యాకములైన వివిధ బ్రహ్మాండములను వేర్వేరుగా ఒకేచోట కేంద్రీకృతమై యున్నట్లు చూచెను. అద్భుతమైన ఆ పరమాత్ముని విశ్వరూపమును చూచి అర్జునుడు ఆశ్చర్య చకితుడై పులకిత గాత్రుడయ్యెను. తేజోమయమైన ఆ విశ్వ (విరాట్) రూపమునకు భక్తి శ్రద్ధలతో సాష్టాంగ ప్రణామము లాచరించెను. తదనంతరము చేతులు జోడించి యిట్లు పలికెను.

అర్జున ఉవాచ|
పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేషసఙ్ఘాన్|
బ్రహ్మాణమీశం కమలాసనస్థ-మృషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్|| 11-15 ||

అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్|
నాన్తం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప|| 11-16 ||

కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్|
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తాద్ దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్|| 11-17 ||

త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్|
త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా సనాతనస్త్వం పురుషో మతో మే|| 11-18 ||

అనాదిమధ్యాన్తమనన్తవీర్య-మనన్తబాహుం శశిసూర్యనేత్రమ్|
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపన్తమ్|| 11-19 ||

ద్యావాపృథివ్యోరిదమన్తరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః|

దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్|| 11-20 ||

అమీ హి త్వాం సురసఙ్ఘా విశన్తి కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి|
స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసఙ్ఘాః స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః|| 11-21 ||

రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ|
గన్ధర్వయక్షాసురసిద్ధసఙ్ఘా వీక్షన్తే త్వాం విస్మితాశ్చైవ సర్వే|| 11-22 ||

రూపం మహత్తే బహువక్త్రనేత్రం మహాబాహో బహుబాహూరుపాదమ్|
బహూదరం బహుదంష్ట్రాకరాలం దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్|| 11-23 ||

నభఃస్పృశం దీప్తమనేకవర్ణం వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్|
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా ధృతిం న విన్దామి శమం చ విష్ణో|| 11-24 ||

దంష్ట్రాకరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని|
దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస|| 11-25 ||

అర్జునుడు పలికెను – ఓ దేవాది దేవా! నీ విరాట్-రూపమునందు సకల దేవతలను, నానావిధ ప్రాణికోటిని, కమలాసనుడైన బ్రహ్మను, మహాదేవుడైన శంకరుని, సమస్త ఋషులను, దివ్యసర్పములను చూచుచున్నాను. ఓ విశ్వేశ్వర! విశ్వరూప! నీ బాహువులు, ఉదరములు, ముఖములు, నేత్రములు అసంఖ్యాకములు. నీ అనంత రూపము సర్వతోముఖముగ విలసిల్లుచున్నది. నీవు ఆదిమధ్యాంత రహితుడవు. మహత్వపూర్ణమైన నీ దివ్యరూపమునకు ఆదిమధ్యాంతములను తెలిసికొనలేకున్నాను. హే విష్ణో! కిరీటమును, గదను, చక్రమును ధరించి, అంతటను తేజఃపుంజములను విరజిమ్ముచున్న నిన్ను దర్శించుచున్నాను. ప్రజ్వలితాగ్నివలెను, జ్యోతిర్మయుడైన సూర్యునివలెను వెలుగొందుచున్న నీ అప్రమేయ రూపము దుర్నిరీక్ష్యమైయున్నది.

పరమ అక్షర స్వరూపుడవైన పరబ్రహ్మపరమాత్మవు నీవే; కనుక అందరికిని తెలిసికొనదగిన వాడవు. ఈ జగత్తునకు నీవే పరమాశ్రయుడవు. సనాతన ధర్మ రక్షకుడవు. నీవు అవ్యయుడవు, సనాతన పురుషుడవు అని నా విశ్వాసము. ఆదిమధ్యాంతరహితుడవు, అపరిమిత శక్తిశాలివి, అసంఖ్యాకములైన భుజములు కలవాడవు. సూర్యచంద్రులు నీ నేత్రములు. అగ్నివలె నీ ముఖము ప్రజ్వరిల్లుచున్నది. నీ తేజస్సుతో ఈ జగత్తును సంతప్తమొనర్చుచున్నావు. అట్టి నిన్ను నేను చూచుచున్నాను. ఓ మహాత్మా! దివినుండి భువి వరకు గల అంతరిక్షము నందంతటను అన్ని దిశలను నీవే పరిపూర్ణుడవై యున్నావు. అద్భుతమైన నీ భయంకర రూపమును చూచి ముల్లోకములును గడగడలాడుచున్నవి.

ఇదిగో! ఆ దేవతలెల్లరును నీలో ప్రవేశించుచున్నారు. కొందరు భయపడినవారై అంజలి ఘటించి, నీ నామగుణములను కీర్తించుచున్నారు. మహర్షులును, సిద్ధులును స్వస్తి వచనములతోడను, ఉత్తమోత్తమ స్తోత్రములతోడను నిన్ను ప్రస్తుతించుచున్నారు. ఏకాదశ రుద్రులును, ద్వాదశాదిత్యులును, అష్టవసువులును, సాధ్యులును, విశ్వేదేవతలును, అశ్వినీకుమారులును, మరుద్గణములును, పితరులును, అట్లే

గంధర్వయక్షాసురసిద్ధ సముదాయములును సంభ్రమాశ్చర్యములతో నిన్నే దర్శించుచున్నారు. హే మహాబాహో! అసంఖ్యాకములైన వక్త్రములను, నేత్రములను, చేతులను, ఊరువు (తొడ)లను, పాదములను, ఉదరములను, కోరలను కలిగిన మిక్కిలి భయంకరమైన నీ రూపమును చూచి అందరును భయకంపితులగుచున్నారు. నేను కూడ భయముతో వణికిపోవుచున్నాను.

ఏలనన ఓ విష్ణో! నీ రూపము అంతరిక్షమును తాకుచున్నది. అది అనేక వర్ణములతో దేదీప్యమానమై వెలుగుచున్నది. కాంతులను విరజిమ్ము విశాల నేత్రములతో, విస్తరించిన ముఖములతో అద్భుతముగా ఒప్పుచున్నది. అట్టి నీ రూపమును చూచిన నా మనస్సు తత్తరపడుచున్నది. అందువలన నా ధైర్యము సడలినది. శాంతి దూరమైనది. ఓ జగన్నివాసా! కరాళ దంష్ట్రలతో (భయంకరమైన కోరలతో) ఒప్పుచున్న నీ ముఖములు ప్రళయాగ్ని జ్వాలలవలె భీతిగొల్పుచున్నవి. వాటిని చూచిన నాకు దిక్కు తోచకున్నది. నెమ్మది (శాంతి) శూన్యమైనది. ఓ దేవేశ! ప్రసన్నుడవు కమ్ము.

శ్రీ మద్భగవద్గీతలోని చివరి మూడు శ్లోకములు (18-76, 77, 78)

రాజన్సంస్మృత్య సంస్మృత్య సంవాద మిమమద్భుతమ్|
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః|| 18-76 ||

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః|
విస్మయో మే మహాన్ రాజన్హృష్యామి చ పునః పునః|| 18-77 ||

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః|
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ|| 18-78 ||

ఓ రాజా! (ధృతరాష్ట్రా!) శ్రీకృష్ణ భగవానునకు, అర్జునునకు మధ్య జరిగిన గోప్యమైన ఈ సంవాదము పుణ్యప్రదమైనది. అత్యద్భుతమైన ఈ సంవాదమును అనుక్షణము పదే పదే స్మరించుచు నేను నిరంతరము ఆనందమున ఓలలాడుచున్నాను. ఓ రాజా! అత్యంత విలక్షణము, పరమాద్భుతము, అపూర్వము ఐన ఆ శ్రీహరి రూపమును పదే పదే స్మరించుచు, నేను పొందుచున్న సంభ్రమాశ్చర్యములకు అవధియే లేదు. తత్ప్రభావమున మరల మరల హర్షోల్లాసముతో పులకిత గాత్రుడ నగుచున్నాను. ఓ రాజా! యోగేశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుడును, గాండీవ ధనుర్ధారియైన అర్జునుడును ఉండుచోట సంపదలును, సర్వ విజయములును, సకలైశ్వర్యములును, సుస్థిరమైన నీతియును ఉండును – అని నా నిశ్చితాభిప్రాయము

(భగవద్గీత శ్లోకములు తెలుగు వికీసోర్స్ నుండి కాపీ చేయబడినవి. తెలుగు తాత్పర్యములు శ్రీ జయదయాల్ గోయందకా గారి "శ్రీ మద్భగవద్గీత – తత్త్వ వివేచనీ వ్యాఖ్య" నుండి తీసుకొనబడినవి. ఆంధ్రానువాదము డా. ఎమ్. కృష్ణమాచార్యలు, డా. గోలి వెంకటరామయ్య)

272. నైకరూపః

అనేక రూపములలో వెలయు విశ్వరూపుడు.

ఓం నైకరూపాయ నమః

న ఏకాని రూపాణి యస్య సః నైకరూపః – అనేక రూపములు ధరించేవాడు నైకరూపుడు.

యస్సదా బహురూపశ్చ నైకరూప స్సకీర్తితః
తత్తజ్జన జ్ఞానయోగ్యం రూపం యస్య విశేషతః
నైకరూప స్సముద్దిష్టః సర్వ ప్రత్యయ గోచరః
భక్తులు ఏ విధంగా చూడాలనుకుంటే వారికి ఆ విధంగా పరమేశ్వరుడు దర్శనమిస్తాడు. అంటే తాను ఒకేరూపంలో ఉండకుండా భక్తుల ఇష్టానుసారము రూపమును ధరిస్తూ ఉంటాడు.

అన్నిరూపులు నీ రూపమైనవాడు
ఆదిమధ్యాంతములు లేక అలరువాడు – భాగవతము. గజేంద్రమోక్షము

అనేకవక్త్రనయనమ్ అనేకాద్భుతదర్శనమ్ – గీత 11.10
సర్వాశ్చర్యమయం దేవమనన్తం విశ్వతోముఖమ్ – గీత 11.11
అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోऽనన్తరూపమ్ – గీత 11.16

శ్రీ చిన్మయానంద చెప్పిన ప్రమాణము –
జలమ్ విష్ణుః స్థలమ్ విష్ణుః విష్ణురాకాశమ్ ఉచ్యతే
స్థావరమ్ జంగమమ్ విష్ణుః సర్వమ్ విష్ణుమయమ్ జగత్

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు అభయవరదాత. అందరికీ అభయములిచ్చే చేయి ఆయనది. కొండలంత వరములు క్రుమ్మరించువాడు కోనేటిరాయుడు. మరి అందరికీ అందుబాటులో ఉండేవాడు ఉండేవాడు అన్నిచోట్లా, అన్ని రూపాలలో వెలసి ఉండడం సహజమే గదా!

విశ్వమందలి సమస్త రూపములలో ఆయన దివ్యమంగళ స్వరూపమును దర్శించువాడే జ్ఞానియును, యోగియును అగును.

273. బృహద్రూపః

మహాద్భుతమైన పెద్దరూపము గలవాడు.

ఓం బృహద్రూపాయ నమః

భగవానుడు శ్రీవరాహమూర్తియై పాతాళాంతర్గతయైన భూమిని సముద్ధరించినాడు. శ్రీనారసింహుడై హిరణ్యకశిపుని చీల్చి చెండాడెను. శ్రీత్రివిక్రముడై బ్రహ్మాండాంత సంవర్ధియైనాడు. అన్నింటా ఆయన రూపము మహాద్భుతము. అప్రమేయము.

పురుష సూక్తములో – **అత్య తిష్ఠత్ దశాంగులమ్** – జగత్తుకంటె పదింతలు పెద్దదైనవాడు – అని చెప్పబడినది.

అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్
నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప – గీత 11.16
ఓ విశ్వేశ్వర! విశ్వరూప! నీ బాహువులు, ఉదరములు, ముఖములు, నేత్రములు అసంఖ్యాకములు. నీ అనంత రూపము సర్వతోముఖముగ విలసిల్లుచున్నది. నీవు ఆదిమధ్యాంత రహితుడవు. మహత్వపూర్ణమైన నీ దివ్యరూపమునకు ఆదిమధ్యాంతములను తెలిసికొనలేకున్నాను.

ద్యావా పృథివ్యో రిదమంతరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః
దృష్ట్వాద్భుతమ్ రూపముగ్రమ్ తవేదం లోకత్రయమ్ ప్రవ్యథితమ్ మహాత్మన్ – గీత 11.20
ఓ మహాత్మా! భూమ్యాకాశాలు అంతా నీవే పరిపూర్ణుడవై ఉన్నావు. అద్భుతమైన నీ భయంకర రూపాన్ని చూచి ముల్లోకాలు గడగడలాడుచున్నాయి.

సామాన్యమైన చక్షురింద్రియములతో భగవంతుని బృహద్రూపమును చూచుట, ఊహించుట అసాధ్యము. కాని ఆ బృహద్రూపుని అనంతైశ్వర్య శక్తి సామర్థ్యములను, ఆయన సర్వవ్యాపిత్వమును మనము ధ్యానించిన యెడల ఇంద్రియ గోచరమగు ప్రపంచముయొక్క అల్పత్వము అవగాహనయగును. ఈ స్వల్ప బంధములను అధిగమించ సాధ్యమగును.

భక్తి నివేదన – మే 2002 –
శ్రీ ఉ.వే. శ్రీమాన్ రంగరామానుజాచార్య స్వామి రచన "శ్రీ విష్ణుపురాణము" నుండి.

స్వామి వరాహరూపాన్ని ధరించి భూసముద్ధరణానికై సముద్యమించాడు. స్వామి ఘుర్ఘుర ధ్వని చేస్తుంటే సామవేద కమనీయ స్వరం వినిపిస్తున్నది.

తతః సముత్క్షిప్య ధరాం స్వదంష్ట్రయా
మహావరాహః స్ఫుట పద్మలోచనః
రసాతలా దుత్పల పత్ర సన్నిభః

సముత్థితో నీల ఇవాచల మహాన్

స్వామి తన కోరలతో పాతాళాంతర్గత అయిన భూమిని పైకి సముద్ధరించాడట. విశాలంగా వికసించిన పద్మాల్లా ఉన్న నేత్రాలతో మహావరాహరూపి అయిన స్వామి, భూమిని పైకెత్తుతూ నల్లని కలువవంటి దేహచ్ఛాయ కలిగి ఒక మహా వినీలగిరిలా పైకి లేచినాడట.

పైకి లేస్తూ తన ముఖంనుండి ఆవిర్భవించిన వాయువులతో జలాలను పైకి చిమ్ముతూ ఉంటే, ముఖ వాయు సముత్థితమైన జలం పైనున్న జనలోక వాసులపై పడిందట. పై లోకాలలో ఈ సన్నివేశాన్ని సానందంగా దర్శిస్తున్న సనకసనందనాది మహర్షుల స్వాభావిక పరిపూరితులైన వారిని పరమ పావనులుగా చేసిందట ఆ జలం. స్వామియొక్క కాలిగిట్టల తాకిడికి లోతైన రంధ్రాలు భూమి పైభాగం నుండి రసాతలం వరకూ ఏర్పడగా, ఆ రంధ్రాలలోనికి జలం ధ్వని చేస్తూ వేగంగా ప్రవేశించసాగిందట. ఇక స్వామియొక్క నిఃశ్వాస వాయువులు సిద్ధజనులున్న దిక్కులవైపున నలువైపులా ప్రసరించసాగాయి. ఇలా పైకి లేస్తూ, ఒక్కసారి తన జలార్ద్రమైన శరీరాన్ని ఇటూ అటూ వేగంగా విదిలించగా, గుహాకూపాలలో నెలవులు ఏర్పరచుకొన్న మహర్షులు స్తుతించసాగారట. జనాది లోకాల్లో ఉన్న సనందనాది మహర్షులు శ్రీభూవరాహస్వామిని ఇలా స్తుతించారు.

1740 కాలపు చిత్రం. శ్రీవరాహమూర్తి. వికీపిడియా నుండి



జయేశ్వరాణాం పరమేశ! కేశవ!
ప్రభో! గదా శంఖ ధరాసి చక్రధృక్!
ప్రసూతి నాశ స్థితి హేతురీశ్వరః
త్వమేవ నాన్యత్ పరమం యత్పదమ్
పాదేషు వేదాస్తవ యూప దంష్ట్రా
దన్తేషు యజ్ఞాః చితయశ్చ వక్త్రే!
హుతాశ జిహ్వోసి తనూరుహాణి
దర్భాః ప్రభో యజ్ఞపుమాంస్త్వమేవ

ఈశ్వరులకు పరమేశ్వరుడైన కేశవా! ప్రభూ! గదా-శంఖ ధారీ! ఖడ్గ చక్రాలను ధరించినవాడా! సమస్త జగత్తుయొక్క పుట్టుక, ఉనికి, నాశనాలకు కారణమైన నీవే పరమ ప్రాప్యమైన 'పరమపద' స్థానానివి. నీ పాదాల్లో వేదాలున్నాయి. నీ కోరలేయూపస్తంభాలు. నీ దంతాలలో యజ్ఞాలున్నాయి. నీ ముఖమే హవిర్ద్రవ్యాలనుంచే యజ్ఞస్థలము. హుతాశనుడు (అగ్ని) నీ నాలుక. నీ రోమాలు దర్భలు. కనుక నీవు ఇలా యజ్ఞపురుషుడవే.

రాత్రింబవళ్ళు నీకన్నులు. ఓ మహాత్మా! నీ శిరస్సు సమస్తానికీ ఆశ్రయమైన ప్రణవము. సమస్త వైదిక సూక్తాలు నీ శిరస్సు పైనున్న జడలు. నీ ముక్కు సమస్త హవిర్ద్రవ్యాలు. నీ తుండము 'స్రుక్' అనే హవిఃప్రక్షేపణ సాధనం. నీ నాదము నాదస్వరము. నీ శరీరము ప్రాగ్వంశము. నీ సంధులు సమస్త యాగములు. ధర్మకార్యములు నీ శ్రవణేంద్రియములు. ఓ సనాతన స్వరూపుడా! ప్రసన్నుడవు కమ్ము!

పదమాక్రాన్త భువమ్ భవన్తమ్
ఆదిస్థితం చాక్షర విశ్వమూర్తే ।
విశ్వస్య విద్మః పరమైశ్వరోసి
ప్రసీద నాథోసి పరావరస్య।

274. శిపివిష్టః

- కిరణముల స్వరూపమున వ్యాపించియున్నవాడు.
- యజ్ఞపశువునందు ఆవహించియున్నవాడు.

ఓం శిపివిష్టాయ నమః

'శిపి' అను పదమునకు రెండు అర్థములున్నవి – కిరణములు, జంతువులు.

సూర్యుడు, చంద్రుడు, అగ్ని వంటివాని కిరణముల రూపములలో అంతట వ్యాపించినవాడు. ఆయనే వెలుగు, జ్ఞానము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **శిపయః - రశ్మయః, తాన్ సంప్రవిష్టః, వ్యాప్తవాన్ ఇతి శిపివిష్టః** – కిరణములయందు వ్యాపించియున్నవాడు శిపివిష్టుడు. ఇందుకు ప్రమాణముగా యాస్క ముని నిరుక్తమున చెప్పినది – **శిపయో రశ్మయః ఉచ్యంతే, తై ఆవిష్టః**

శ్రీ భట్టుల వ్యాఖ్యానమును సంగ్రహముగా ఒక రచయిత (పేరు తెలియదు) 'నిరుక్తి' అను గ్రంథములో పొందుపరచినారు. అందులో చెప్పబడిన అర్థము –
శిపయో రశ్మయః ప్రోక్తా వ్యాప్త తేష్వపి వర్తనాత్
శిపివిష్ట స్సమాఖ్యాతః సూర్యేన్ద్వగ్న్యాది రూపవత్

శిపివిష్టేతి యచ్చాస్య పీతం రోమ చ యద్భవేత్
తేనాపి విష్టం యత్కించిత్ శిపివిష్టం హి తత్స్మృతమ్ - మహాభారతము – శాంతిపర్వము 343.41
(పచ్చ) బంగారు వర్ణములో ఉండే ఇతని రోమములకు శిపివిష్టములని పేరు. అట్టి శరీరముతో సమస్తమును వ్యాపించియున్నందున ఇతనిని 'శిపివిష్టుడు' అందురు.

ఉద్యోగ పర్వములో ఇలా చెప్పబడినది – **రోమ కూపేషు చ తథా సూర్యస్యేవ మరీచయః** – సూర్యకిరణముల వలె శరీరమున ప్రతి రోమ రంధ్రమున ప్రవేశించువాడు శిపివిష్టుడు.

శ్రీ లింగాయత సూరి తమ అమరకోశ వ్యాఖ్యానములో ఇలా చెప్పారు – **శిపిషు పశుషు జనేషు విష్టో వ్యాప్త ఇతి శిపివిష్టః** – అన్ని జంతువులు, మనుష్యులందు వ్యాపించినవాడు శిపివిష్టుడు.

శ్రీ కైవల్యసారధి నుండి - **యజ్ఞో వై విష్ణుః పశవః శిపి ర్యజ్ఞ ఏవ పశషు ప్రతితిష్ఠతి** – యజ్ఞమే విష్ణువు. పశువులు 'శిపి' అనబడును. అంటే పశువులయందు యజ్ఞము అనే రూపముతో నారాయణుడు ప్రవేశించియుంటాడు. శ్రీమహావిష్ణువు తానే యజ్ఞరూపమున పశువులయందు ప్రవేశించి, యజ్ఞములకు సమగ్రత కలిగించి, వాటిని ఫలవంతము చేస్తూ వాటి యజమానులకు ఫలదానము చేస్తున్నాడు.

275. ప్రకాశనః

- తన (విశ్వ) రూపమును దర్శించు భాగ్యమును తన భక్తులకు ప్రసాదించువాడు. (శ్రీ భట్టుల వ్యాఖ్య).
- సమస్తమును ప్రకాశింపజేయువాడు (శ్రీ శంకరుల వ్యాఖ్య)

ఓం ప్రకాశనాయ నమః

దివ్యరూపం దిదృక్షుభ్యః పార్థాదిభ్యో విశేషతః
రూపం ప్రకాశయతి యః స ప్రకాశన ఈరితః
తన దివ్యరూపాన్ని చూడగోరే అర్జునుడు మొదలైనవారికి తన దివ్య (విశ్వ) రూపమును ప్రకాశింప జేసినవాడు (చూపినవాడు) కనుక 'ప్రకాశనః'

న తు మాం శక్యసే ద్రష్టుం అనేనైవ స్వచక్షుషా
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ – గీత
అర్జునా! చర్మచక్షువులతో నా ఈ రూపమును నీవు చూడజాలవు. కనుక నీకు దివ్యదృష్టిని ప్రసాదించుచున్నాను. ఆ దివ్యదృష్టితో నా ఈశ్వరీయ దివ్య యోగశక్తిని (స్వరూమును) చూడుము.

ప్రకాశయతీతి ప్రకాశనః – సర్వేషాం ప్రకాశన శీలం అస్య – భగవంతుడు సమస్తమును ప్రకాశింపజేయును.

జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ – గీత 13.17
ఆ పరబ్రహ్మ అన్ని జ్యోతులకును జ్యోతి (పరం జ్యోతి). మాయాతీతుడును, జ్ఞాన స్వరూపుడును, తెలిసికొనదగినవాడును, తత్వ జ్ఞానము ద్వారా ప్రాప్యుడును అతడే. సర్వ ప్రాణుల హృదయముల యందు విశేషముగా ఉండువాడును అతడే.

యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత
అర్జునా! ఒక్క సూర్యుడే ఈ సమస్త జగత్తును ప్రకాశితము ఒనర్చుచున్నట్లు, ఒకే ఆత్మ సర్వ ప్రాణులయందును స్థితమై వానినన్నింటిని ప్రకాశింజేయుచున్నది (చైతన్యవంతులుగా చేయుచున్నది).

ధర్మచక్రము రచయిత – భగవంతుడు ప్రసాదించు వెలుగే ఆయనను తెలిసికొనుటకు ఉపయోగపడు మార్గము.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః |
ఋద్ధః స్పష్టాక్షరో మంత్రశ్చంద్రాంశుర్భాస్కరద్యుతిః || (30)

266. ఓజస్తేజోద్యుతిధరః

పరిపూర్ణమగు ఓజస్సు (బలము), తేజస్సు (శత్రువులను ఓడించు శక్తి), ద్యుతి (కీర్తి, కాంతి) కలిగినవాడు.

ఓం ఓజస్తేజోద్యుతిధరాయ నమః

అసాధారణ సామర్థ్యం బల యోజః ప్రచక్షతే
పరాభి భవ సామర్థ్యం తేజశ్చ పరిపఠ్యతే
కీర్తిర్వా ద్యుతి రౌజ్వల్యం తాని దత్తే యస్సదా
ఓజస్తేజోద్యుతిధరోహ్యేక నామ ప్రకీర్తితః

ఓజస్సు అనగా అసాధారణమైన బలము. తేజస్సు అనగా శత్రువులను ఓడించు శక్తి. ద్యుతి అనగా ఉజ్వలమగు కీర్తి. ఈ మూడు గుణములను విశేషముగా (అనంతముగా) కలిగియున్నందన శ్రీనివాసుడు ఓజస్తేజోద్యుతిధరుడు.

స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యనురజ్యతే చ
రక్షాంసి భీతాని దిశో ద్రవంతి సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః – భగవద్గీత 11.36

ఓ అంతర్యామి! కేశవా! నీ నామ గుణ ప్రభావములను కీర్తించుచు జగత్తు హర్షాతిరేకముతో, అనురాగముతో ఉప్పొంగి పోవుచున్నది. ఇది సముచితము. భయగ్రస్తులైన రాక్షసులు నలుదిక్కులకు పారిపోవుచున్నారు. సిద్ధగణముల వారెల్లరును ప్రణమిల్లుచున్నారు.

ఇక్కడ భగవంతుని ఓజస్సు, తేజస్సు, ద్యుతి వర్ణితములు. అట్లే విశ్వరూపతేజస్సు వేలకొలది సూర్యుల తేజస్సుకంటె అధికము – అని సంజయుడు ధృతరాష్ట్రునకు తెలిపినాడు. ఈ మూడు గుణములు వేరువేరుగా కూడ గీతలో ప్రస్తావింపబడినవి.

బలం బలవతా చాహం కామరాగ వివర్జితమ్ – బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్

యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవ వా

తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజో అంశ సంభవమ్

విభూతి యుక్తమైన, అనగా ఐశ్వర్యయుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము ఐన వస్తువేదైనను నా తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినదిగా తెలిసికొనుము.

విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్ – ఈ సంపూర్ణ జగత్తును నా యోగశక్తియొక్క ఒక్క అంశతోడనే ధరించుచున్నాను.

277. ప్రకాశాత్మా

ప్రకాశవంతమగు స్వరూపము గలవాడు. (మూర్ఖులు కూడా అంగీకరించేట్లుగా) గొప్పగా ప్రకాశించేవాడు.

ఓం ప్రకాశాత్మనే నమః

అంధుడు అయిన ధృతరాష్ట్రుడు (చూపు లేనివాడు, వివేకము లేనివాడు) కూడా శ్రీకృష్ణుడు పరమాత్ముడని గుర్తించి ప్రార్థించెను.

త్వమేవ పుండరీకాక్ష సర్వస్య జగతః ప్రభుః

తస్మాత్మే యాదవశ్రేష్ఠ ప్రసాదం కర్తుమర్హసి – మహాభారతము. ఉద్యోగపర్వము

పుండరీకాక్షా! సకల జగములకును నీవే ప్రభువువు. రక్షకుడవు. యాదవశ్రేష్ఠా! కనుక నీవు నాపై కరుణ చూపవలెను.

ప్రకాశ స్వరూప ఆత్మా యస్య సః – ప్రకాశవంతమగు ఆత్మ కలిగినవాడు. గీతయందు భగవంతుని ఉజ్వల స్వరూపము ఎన్నోచోట్ల కీర్తింపబడినది.

దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా (గీత 11.2) – **తేజస్తేజస్వినామహమ్** (గీత 10.36)

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్

యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకమ్ – గీత 15.12

సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నాతేజస్సేయని యెఱుంగుము.

అనాదిమధ్యాన్త మనన్తవీర్య మనన్తబాహుం శశిసూర్యనేత్రమ్

పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపన్తమ్ – గీత 11.19

ఆదిమధ్యాంతరహితుడవు, అపరిమిత శక్తిశాలివి, అసంఖ్యాకములైన భుజములు కలవాడవు. సూర్యచంద్రులు నీ నేత్రములు. అగ్నివలె నీ ముఖము ప్రజ్వరిల్లుచున్నది. నీ తేజస్సుతో ఈ జగత్తును సంతప్తమొనర్చుచున్నావు. అట్టి నిన్ను నేను చూచుచున్నాను.

నభఃస్పృశం దీప్తమనేకవర్ణం వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్

దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా ధృతిం న విన్దామి శమం చ విష్ణో – గీత 11.24

ఓ విష్ణో! నీ రూపము అంతరిక్షమును తాకుచున్నది. అది అనేక వర్ణములతో దేదీప్యమానమై వెలుగుచున్నది. కాంతులను విరజిమ్ము విశాల నేత్రములతో, విస్తరించిన ముఖములతో అద్భుతముగా ఒప్పుచున్నది. అట్టి నీ రూపమును చూచిన నా మనస్సు తత్తరపడుచున్నది. అందువలన నా ధైర్యము సడలినది. శాంతి దూరమైనది.

278. ప్రతాపనః

- (శ్రీ శంకరులు) సూర్యునివంటి రూపములతో జగత్తును తపింప (వేడి) చేయువాడు.
- (శ్రీ భట్టులు) తన ఉగ్ర రూపమున జగత్తును తపింపజేయు కాలస్వరూపుడు.
- (శ్రీ రాధాకృష్ణ శాస్త్రి) ప్రళయాగ్నియై జగత్తును లయమొనర్చువాడు.

ఓం ప్రతాపనాయ నమః

ప్రళయాగ్ని జ్వాలలవలె ప్రజ్వలించు ముఖముతో, కరాళ దంష్ట్రలతో, లోకములను కబళించుటకు విజృంభించిన కాలస్వరూపుని ప్రతాపనుడని శ్రీ భట్టులు కీర్తించారు.

దంష్ట్రాకరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని

దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస – గీత 11.25

ఓ జగన్నివాసా! కరాళ దంష్ట్రలతో (భయంకరమైన కోరలతో) ఒప్పుచున్న నీ ముఖములు ప్రళయాగ్ని జ్వాలలవలె భీతిగొల్పుచున్నవి. వాటిని చూచిన నాకు దిక్కు తోచకున్నది. నెమ్మది (శాంతి) శూన్యమైనది. ఓ దేవేశ! ప్రసన్నుడవు కమ్ము.

అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః సర్వే సహైవావనిపాలసఙ్ఘైః

భీష్మో ద్రోణః సూతపుత్రస్తథాసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః – గీత 11.26

వక్త్రాణి తే త్వరమాణా విశన్తి దంష్ట్రాకరాలాని భయానకాని

కేచిద్విలగ్నా దశనాన్తరేషు సన్దృశ్యన్తే చూర్ణితైరుత్తమాఙ్గైః – గీత 11.27

యథా నదీనాం బహవోఽమ్బువేగాః సముద్రమేవాభిముఖా ద్రవన్తి
తథా తవామీ నరలోకవీరా విశన్తి వక్త్రాణ్యభివిజ్వలన్తి – గీత 11.28

యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గా విశన్తి నాశాయ సమృద్ధవేగాః
తథైవ నాశాయ విశన్తి లోకాస్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః – గీత 11.29

ఈ ధృతరాష్ట్రపుత్రులు ఇతర రాజన్యులతోసహా నీలో ప్రవేశించుచున్నారు. భీష్మపితామహుడు, ద్రోణుడు, కర్ణుడు, అట్లే మన పక్షమందలి ప్రధాన యోధులును అందఱును భయంకరములైన కోరలతో గూడిన నీ ముఖములయందు అతివేగముగా పరుగులు తీయుచు కనిపించుచున్నారు. కొందరి తలలు నీ కోరలమధ్య పడి నుగ్గునుగ్గై పోవుచుండగా వారు దంతములలో చిక్కుకొని వ్రేలాడుచున్నారు. నదీనదములు సముద్రమున కభిముఖముగా ప్రవహించి అందు ప్రవేశంచుచున్నట్లు, ఈ శ్రేష్టులైన సమర యోధులు కూడ జ్వలించుచున్న నీ ముఖములయందు ప్రవేశించుచున్నారు. మిడతలు మోహవశమున తమ నాశనము కొరకు అగ్నిలో ప్రవేశించుచున్నట్లుగా ఈ వీరులందరును తమ నాశనముకై అతి వేగముగా పరుగెత్తి నీ వక్త్రములందు ప్రవేశించుచున్నారు.

లేలిహ్యసే గ్రసమానః సమన్తాల్లోకాన్సమగ్రాన్వదనైర్జ్వలద్భిః
తేజోభిరాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో – గీత 11.30

ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో నమోఽస్తు తే దేవవర ప్రసీద
విజ్ఞాతుమిచ్ఛామి భవన్తమాద్యం న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ – గీత 11.31

హే విష్ణో! ప్రజ్వలించుచున్న నీ ముఖములతో సమస్త లోకములను కబళించుచు అన్నివైపులనుండి మాటిమాటికిని ఆస్వాదించుచున్నావు. నీ ఉగ్రతేజస్సులు అంతటను నిండి జగత్తును తపింప జేయుచున్నవి. ఓ పరమాత్మా! నీకు నా నమస్కారములు. ప్రసన్నుడవు కమ్ము. ఉగ్రరూపుడవైన నీవు ఎవరో దయతో నాకు తెలుపుము. ఆదిపురుషుడవైన నిన్ను విశదముగా తెలిసికొనగోరుచున్నాను. ఏలనన నీ ప్రవృత్తిని ఎఱుంగలేకున్నాను.

అర్జునుని కోరిక మేరకు భగవానుడు తన ఉగ్ర (విశ్వ) రూప ధారణకు గల కారణమును తెలిపెను.
కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో లోకాన్సమాహర్తుమిహ ప్రవృత్తః
ఋతేఽపి త్వాం న భవిష్యన్తి సర్వే యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః – గీత 11.32
నేను లోకములన్నింటిని తుదముట్టించుటకు విజృంభించిన మహాకాలుడను. ఇప్పుడు ఈ లోకములను

రూపుమాపుటకై పూనుకొనియున్నాను. కనుక నీవు యుద్ధము చేయకున్ననూ ప్రతిపక్షమున ఉన్న ఈ వీరులెవ్వరును మిగలరు.

నేపాల్ చాంగునారాయణ మందిరంలో విశ్వరూప శిల్పం. వికీపీడియానుండి.

ఆ విశ్వరూపుని అర్జునుడు ఇలా ప్రస్తుతించాడు.

త్వమాదిదేవః పురుషః పురాణస్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్

వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనన్తరూప – గీత 11.38

వాయుర్యమోఽగ్నిర్వరుణః శశాఙ్కః ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ

నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే – గీత 11.39

నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ

అనన్తవీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః – గీత 11.40

ఓ అనంత రూపా! నీవు ఆదిదేవుడవు. సనాతన పురుషుడవు. ఈ జగత్తునకు పరమాశ్రయుడవు. సర్వజ్ఞుడవు. సర్వవేద్యుడవు. పరంధాముడవు. ఈ జగత్తు అంతయును నీచే పరిపూర్ణమైయున్నది. నీవే వాయుదేవుడవు. యముడవు. అగ్నివి. వరుణుడవు. చంద్రుడవు. ప్రజాపతియైన బ్రహ్మవు. బ్రహ్మకును జనకుడవు. నీకు వేలకొలది నమస్కారములు. మఱల మఱల నమస్కారములు. అనంత సామర్థ్యము కలవాడా! నీకు ఎదురుగా ఉండియు, వెనుకనుండియును నమస్కరించుచున్నాను. ఓ సర్వాత్మా! నీకు

అన్నివైపుల నుండియు నమస్కారములు. ఏలనన అనంత పరాక్రమశాలివై నీవు జగత్తంతటను వ్యాపించియున్నవాడవు. అన్ని రూపములు నీవియే.

279. ఋద్ధః

అన్ని ఉత్తమ గుణములు సమృద్ధిగా కలిగిన పరిపూర్ణుడు.

ఓం ఋద్ధాయ నమః

30వ శ్లోకము. 279వ నామము. ఋద్ధః – **ఋద్ధః స్పష్టాక్షరో మంత్రః చంద్రాంశుః భాస్కరద్యుతిః**
38వ శ్లోకము. 353వ నామము. ఋద్ధః – **మహర్ధిః ఋద్ధో వృద్ధాత్మా మహాక్షో గరుడధ్వజః**

ఋధ్ – వృద్ధౌ – పొంగుట, సంపన్నమగుట, వృద్ధియగుట.

పార్వణో జలధిర్యద్వత్ వృద్ధిమాన్ ఋద్ధ ఉచ్యతే – అన్నికాలములందు పొంగుతూ ఉండే సముద్రములాగా ఎప్పుడూ సమృద్ధిగా ఉండేవాడు. ధర్మము, జ్ఞానము, వైరాగ్యము మొదలైన ఉత్తమ గుణములు సమృద్ధిగా కలిగినవాడు.

సుందరకాండము (34-28, 29, 30) – హనుమంతుడు సీతాదేవితో శ్రీరాముని ఇలా వర్ణించాడు. శ్రీరామచంద్రుడు తేజస్సునందు సూర్యుడు. సకల లోకాధిపత్యమున కుబేరుడు. పరాక్రమ వైభవమున అతడు సర్వలోక విఖ్యాతుడైన శ్రీమహావిష్ణువు. సత్యముగా మధురముగా మాట్లాడుటలో సాక్షాత్తు బృహస్పతియే. అతడు రమణీయ రూప సౌభాగ్యములు గలవాడు. మహాతేజశ్శాలి. మధురాకృతిలో మన్మధుడు. దండింపదగిన వారియెడ అనువైన సమయమున కోపము చూపువాడు. దండించువాడు. సర్వలోక శ్రేష్టుడు. మహారధుడు. మహాత్ముడైన శ్రీరాముని బాహుచ్ఛాయను ఆశ్రయించి లోకము మనుగడను సాగించును.

సుందరకాండము (37-14, 15, 16, 17, 18) – సీతాదేవి వచనములు.
ఓ కపీశ్వరా! నా స్వామి నన్ను త్వరలోనే చేరగలడు. ఇది నా పరమ విశ్వాసము. నా అంతరాత్మ పవిత్రమైనది. శ్రీరామునిలో ఉత్సాహము, పౌరుషము, బలము, కరుణ, కృతజ్ఞత, పరాక్రమము, శక్తి మొదలగు సకల సద్గుణములు కలవు. శ్రీరాముడు తానొక్కడే పదునాలుగు వేలమంది రాక్షసులను హతమార్చెను. అట్టి మహావీరునకు ఏ శత్రువు భయపడడు? ఎట్టి క్లిష్ట పరిస్థితులును ఆ మహాపురుషుని చలింపజేయజాలవు. దేవేంద్రుని శక్తి శచీదేవికి తెలిసినట్లు ఆయన ప్రభావము నాకు తెలియును. సూర్యుడు తన తీవ్ర కిరణములతో నీటిని పూర్తిగా ఇంకింపజేసినట్లు, శూరుడైన శ్రీరాముడు తన బాణపరంపరలచే శత్రురాక్షస సమూహములను నుగ్గునుగ్గు గావింపగలడు.

సుందరకాండము (37-6,67) – సీతాదేవి వచనములు.

శ్రీరాముడు అద్భుతమైన ధనుస్సు గలవాడు. మహాబలశాలి. పరాక్రమమున దేవేంద్రుని మించినవాడు. వాయువు తోడై మహాజ్వాలలతో మీదికెగియు అగ్నివలె, లక్ష్మణుడు తోడై తేజరిల్లుచుండెడి ఆ మహావీరుని జూచి సంగ్రామమున ఎదురుగా నిలబడగలవాడెవ్వడు? ఓ వానరోత్తమా! యుద్ధమున శత్రువులను మర్దించు శ్రీరాముడు లక్ష్మణ సహితుడై, బాణములనెడి కిరణములను విరజిమ్ముచు ప్రళయకాల సూర్యునివలె తేజరిల్లుచు, కదన రంగమున మదించిన దిగ్గజమువలె నిలిచియున్నపుడు ఆ వీరుని ఎదుర్కొనగల యోధుడెవ్వడు?

శ్రీ తులసీదాస కృత శ్రీరామచంద్ర స్తుతి

శ్రీరామచంద్ర కృపాళు భజ మన హరణ భవభయ దారుణం
నవకంజలోచన, కంజముఖ, కరకంజ, పదకంజారుణం --1--

కందర్ప అగణిత అమిత ఛబి నవ నీల నీరద సుందరం
పట పీత మానహు తడిత రుచి శుచి నౌమి జనకసుతావరం --2--

భజ దీన బంధు దినేశ దానవ దైత్యవంశ నికందనం
రఘునంద ఆనందకంద కోసల చంద దశరథ నందనం --3--

సిరముకుట కుండల తిలక చారు ఉదారు అంగ విభూషణం
ఆజానుభుజ శర-చాప-ధర సంగ్రామ జిత ఖర-దూషణం --4--

ఇతి వదతి తులసీదాస శంకర శేష-ముని-మనరంజనం
మమ హృదయకంజ నివాస కురు, కామాదిఖల-దల గంజనం --5--

తాత్పర్యము:

ఓ మనసా! వికసించిన కమలముల వంటి కన్నులు, ముఖము, చేతులు, పాదములు కల, అమితమైన కృప కలిగిన, ఈ జీవనములోని భయాలను పారద్రోలే శ్రీ రామచంద్రుని భజించుము.

కోటి మన్మథుల కన్నా అందమైన వాడు, క్రొత్తగా ఏర్పడిన నీలి మేఘమువలె సుందరుడు, ఎల్లప్పుడూ శుచియైన పీతాంబరములు (పచ్చని పట్టు వస్త్రములు) ధరించి అందముగా ఉండేవాడు, సీతాదేవి వరుడు అయిన రామునికి నమస్కారములు.

దీన బంధువు, సూర్యవంశమున జన్మించిన వాడు, రాక్షస వంశములను నిర్మూలనము చేసిన వాడు, రఘు కులమునకు ఆనందకారుడు, కోసల రాజ్యానికి చంద్రుని వంటి వాడు, దశరథుని పుత్రుడు అయిన శ్రీ రాముని భజించుము.

ఆ శ్రీరాముడు శిరసుపై కిరీటమును ధరించిన వాడు, కుండలములు ధరించిన వాడు, ఎన్నో ఆభరణాలతో శోభిల్లే శరీరము కలవాడు, మోకాళ్ళ వరకు ఉన్న చేతులకు ధనుస్సు, శరములు కలిగిన వాడు, యుద్ధములో ఖర దూషణ రాక్షసులను సంహరించిన వాడు.

"నా హృదయ కమలములో నివసించే ఓ రామచంద్రా! నాలోని కామాది దుష్ట గుణముల సమూహమును నాశనము చేసే ప్రభూ! " - అని శంకరుడు, ఆది శేషుడు, ఇతర మునుల మనసు రంజిల్ల చేసే తులసీ దాసు ఈ విధంగా నుతిస్తున్నాడు.

(http://prasad-akkiraju.blogspot.com శ్రీఅక్కిరాజు ప్రసాదు బ్లాగునుండి కాపీ చేయబడినది.)

280. స్పష్టాక్షరః

- స్పష్టమైన వేదాక్షరములు కలవాడు. అనగా వేదమునందలి అక్షరముల ద్వారా స్పష్టమైనవాడు (శ్రీ భట్టులు)
- దివ్యమగు ప్రణవ శబ్దము ద్వారా తెలియవచ్చువాడు (శ్రీ శంకరులు).
- విశ్వమును కలిపి పట్టియుంచువాడు (శ్రీ సత్యదేవో వాసిష్ఠ)

ఓం స్పష్టాక్షరాయ నమః

స్పష్టీకృతాశ్చ వేదార్ణాః యస్మాత్ స్పష్టాక్షరో మతః. వేదముల (అక్షరముల) ద్వారా తెలియవచ్చువాడు. కనుక స్పష్టాక్షరుడు.

ప్రణవము (ఓం) అను అక్షరము ద్వారా ప్రస్ఫుటమైనవాడు – ఈ వివరణలో శ్రీ చిన్మయానందగారు గీత (8-12,13)నుండి ఉదాహరించారు.

సర్వ ద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ
మూర్ధ్న్యాధ్యాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణమ్
ఓమిత్యేకాక్షరమ్ బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాంగతిమ్

సర్వేంద్రియములను నిగ్రహించి, మనస్సును హృదయమునందే స్థిరముగా నిలిపి, అట్లు వశమైన మనస్సు ద్వారా ప్రాణములను మూర్ధస్థానము (సహస్రారము)నందు స్థిరమొనర్చి, పరమాత్మ ధ్యానమునందే నిమగ్నుడై, అక్షర బ్రహ్మ స్వరూపమైన ఓంకారమును ఉచ్చరించుచు, ఆ ఓంకారమునకు

అర్ధస్వరూపుడును, నిర్గుణ బ్రహ్మను ఐన నన్ను చింతించుచు దేహత్యాగమొనర్చువాడు పరమగతిని (మోక్షమును) పొందును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు వైవిధ్యమైన వివరణ చెప్పారు –
స్పృష్ – బంధనే – కలుపుట, కట్టియుంచుట.
అక్షర – నాశనము లేనివి, మరల మరల ఉద్భవించునవి.
నక్షత్రాది సమస్త మండలములను ప్రళయకాలము వరకు కలిపియుంచెడువాడు గనుక శ్రీమహావిష్ణువు స్పృష్టాక్షరుడు.

281. మంత్రః (మన్త్రః)

- తన నామమును మననము చేయువారిని రక్షించువాడు.
- వేద స్వరూపుడు. మంత్రమూర్తి.

ఓం మన్త్రాయ నమః

తన్మన్త్రం త్రాయతే ఇతి మన్త్రః – తనను స్మరించేవారిని రక్షించును గనుక మంత్రము.
మననాత్ త్రాయతే ఇతి మన్త్రః – మననము చేసినందువలన రక్షించును గనుక మంత్రము.
దైవాధీనమ్ జగత్ సర్వమ్ మన్త్రాధీనమ్ తు దైవతమ్ – జగత్తంతా దైవమునకు అధీనమై యుండును. ఆ దైవము మంత్రమువలన ప్రసన్నమగును.

బ్రహ్మపురాణమునందు భగవానుడు ఇలా చెప్పెను –
తృష్ణాతోయ సమాకీర్ణాత్ ఘోరాత్ సంసార సాగరాత్
అపారాత్ పారమాప్నోతి యో మామ్ స్మరతి నిత్య సః
నిత్యమును నన్ను స్మరించువాడు కామ, మోహ భరితమైన ఘోర సంసారమును దాటుట తథ్యము.

శ్రీభట్టులు వరాహపురాణమునందలి వరాహ చరమశ్లోకమును ఉదాహరించారు –
స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యో నరః
ధాతు సామ్యే స్థితే స్మర్తా విశ్వరూపమ్ చ మమాऽజమ్
తతస్తమ్ మ్రియమాణమ్ తు కాష్ఠః పాషాణ సన్నిభమ్
అహమ్ స్మరామి మద్భక్తమ్ నయామి పరమాంగతిమ్
మనస్సు సుస్థితముగాను, శరీరము దృఢముగాను, దేహధాతువులు సమముగాను ఉన్న సమయమున ఎవరైతే భక్తులు విశ్వరూపుడను, జన్మరహితుడను అయిన నన్ను స్మరింతురో అట్టివారి

అంత్యకాలమున, వారి దేహము మొద్దువలె పడియున్నపుడు, వారిని నేను గుర్తుంచుకొని, అట్టి భక్తులను పరమపద మార్గమున నడిపింతును.

మూడు వేదములు మూర్తీభవించినస్వరూపము కలిగినందున పరమాత్ముడు 'మన్త్రము' అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు.

ధర్మచక్రము రచయిత – స్నానాదికముల వలన శరీరము పరిశుభ్రము అగునట్లే మంత్రములు మనస్సును పరిశుద్ధము చేయును. మంత్ర జపము, భగవద్ధ్యానము, శ్రీహరి కీర్తనము, శ్రీనివాసుని భజనము ఇందుకు మార్గములు.

శ్రీ తిరుమంగై ఆళ్వార్ – పెరియ తిరుమైమొళి 1.1.9 – **నలమ్ తరుమ్ సొళ్ళై నాన్ కణ్డుకొణ్డేన్ నారాయణా ఎన్నుమ్ నామమ్.**

డా. క్రోవి పార్థసారథి గారి 'శ్రీకైవల్య సారథి' నుండి –

ఓంకారము ఉన్నవి వైదిక మంత్రములు. ఓంకారము లేనివి తాంత్రిక మంత్రాలు. 'స్వాహా' అనే పదము చివర కలిగినవి స్త్రీ మంత్రాలు. 'హుం ఫట్' అనే పదము చివర గలవి పురుష మంత్రాలు. 'నమః' అనే పదము చివర కలిగినవి (పురుష? / నపుంసక?) మంత్రాలు. పురుష దేవతలను ఉపాసించే వాటిని మంత్రాలని, స్త్రీ దేవతలను ఉపాసించే వాటిని 'విద్య' అనీ అంటారు.

నారాయణోపనిషత్తులోనుండి –

ఓమిత్యగ్రే వ్యాహరేత్, నమ ఇతి పశ్చాత్, నారాయణాయే త్యుపరిష్టాత్, ఓమిత్యేకాక్షరమ్, నమ ఇతి ద్వే అక్షరే, నారాయణాయేతి పంచాక్షరాణి, ఏతద్వై నారాయణస్యాష్టాక్షరం పదమ్, యోహ వై నారాయణస్యాష్టాక్షరమ్ పద మధ్యేతి, అనపబ్రువస్సర్వ మాయురేతి, విందతే ప్రాజాపత్యమ్, రాయస్పోషం గౌపత్యమ్, తతో – మృతత్వ మశ్నుతే తతోఽమృతత్వ మశ్నుత ఇతి, ఏతత్సామ వేద శిరో – ధీతే.
ముందుగా 'ఓం' అని అనాలి. తరువాత 'నమో' అనాలి. ఆ తరువాత 'నారాయణాయ' అనాలి. ఇది అష్టాక్షరీ మహామంత్రము. ఈ మంత్రాన్ని శ్రద్ధాసక్తులతో, విశ్వాసముతో, ప్రీతితో జపం చేసేవాడు పూర్ణాయువు అవుతాడు. అతడు స్వర్గాధిపత్యము పొందుతాడు. ధనధాన్యాలు, సిరిసంపదలు, భోగభాగ్యాలు – అన్నీ పొందుతాడు. చివరకు అమృతత్వాన్ని పొందుతాడు. మృత్యుంజయుడౌతాడు.

తారసారోపనిషత్తు –

ఓం – ఆత్మ స్వరూపము.

నమః – ప్రకృతి స్వరూపము.

నారాయణాయ – పరబ్రహ్మ స్వరూపము.

నృసింహ తాపిని ఉపనిషత్తులో నృసింహ మంత్రము, రామరహస్యోపనిషత్తులో రామమంత్రము, గోపాల తాపిని ఉపనిషత్తులో గోపాల మంత్రము చెప్పబడ్డాయి. అవన్నీ పరమేశ్వరుని ప్రతిరూపాలే. అందుచేతనే శ్రీమన్నారాయణుడు 'మన్త్రః' అనబడుచున్నాడు.

282. చంద్రాంశుః

చంద్రుని కిరణములవలె (వెన్నెలవలె) చల్లగానుండి, ఆహ్లాదము కలిగించి, సంసార తాపమును శమింపజేయువాడు.

ఓం చంద్రాంశవే నమః

క్షమహారి మహాహ్లాద తేజస్కరత యాపి చ
మంత్రూణామేవ చంద్రాంశు ఆహ్లాద ఫలదో మనుః

భగవంతుడు వెన్నెలవలె చల్లనైనవాడు. తనను స్మరించు భక్తులకు ఆహ్లాదము కలిగించును. తాపమును శమింపజేయును. ఈ నామమును మహామంత్రముగా జపిస్తే వారికి మహదానందము కలుగుతుంది.
ఓం చంద్రాంశవే నమః.

యదాదిత్య గతం తేజో జగద్భాసయతేఽఖిలమ్
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ – గీత 15.12

గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా
పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః – గీత 15.13

సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నా తేజస్సేయని ఎఱుంగుము. పృథ్వియందు ప్రవేశించి, నేను నా శక్తి ద్వారా సకల భూతములను ధరించి, పోషించుచున్నాను. రస స్వరూపుడనై – అనగా అమృతమయుడైన చంద్రుడనై ఓషధులకు, అనగా వనస్పతులన్నింటికి పుష్టిని చేకూర్చుచున్నాను.

283. భాస్కరద్యుతిః

సూర్యునివంటి తేజస్సు గలవాడు. శత్రుదుర్నిరీక్ష్య పరాక్రముడు. సూర్యునికి కాంతిని ప్రసాదించువాడు.

ఓం భాస్కరద్యుతయే నమః

పరప్రభావాభి భవ లక్షణ ద్యుతి మాంశ్చయః

స భాస్కరద్యుతిః ప్రోక్తో నేత్ర వైమల్యదో మనుః

శత్రువుల ప్రభావాన్ని అరికట్టే సూర్యునికాంతి వంటి కాంతి గలవాడు. ఈ నామమును మంత్రముగా జపిస్తే కన్నులకున్న రోగాలు తగ్గిపోతాయి. ఓం భాస్కరద్యుతయే నమః.

భగవంతుని చంద్రునివలె, సూర్యునివలె ప్రస్తావించిన సందర్భములు అనేకములు. ఆయన వెన్నెలవలె తాపమును హరించును. ఎండవలె శత్రువులను సంహరించును.

సుందరకాండము 35.8,9 – **రామః కమలపత్రాక్షః సర్వసత్త్వ మనోహరః** – ఓ జానకీ! శ్రీరాముడు కమల పత్రములవంటి కన్నులు గలవాడు. తన నిరుపమాన కాంతిచే సమస్త ప్రాణులకును ఆనందమును కూర్చువాడు. **తేజసాऽऽదిత్య సంకాశః** – అతడు తేజస్సున సూర్యునివంటివాడు.

సుందరకాండము 34.28 – **ఆదిత్య ఇవ తేజస్వీ లోకకాంత శ్శశీ యథా** – శ్రీరామచంద్రుడు తేజస్సునందు సూర్యుడు. లోకమునకు ఆహ్లాదము కూర్చుటలో చంద్రుడు.

సుందరకాండము 37.18 – **శర జాలాంశుమాన్ శూరః కపే రామ దివాకరః శత్రు రక్షోమయం తోయమ్ ఉపశోషం నయిష్యతి** – ఓ కపీశ్వరా! సూర్యుడు తన తీవ్రకిరణములచే నీటిని పూర్తిగా ఇంకింపజేసినట్లుగా, శూరుడైన శ్రీరాముడు తన బాణపరంపరలచే శత్రురాక్షస సమూహములను నుగ్గునుగ్గు గావింపగలడు.

గీత 15.12 – **యదాదిత్య గతం తేజో ..... యచ్చన్ద్రమపి....**

తిరుప్పావై మొదటి పాశురము (మార్గళిత్తింగళ్.....) – మార్గశిరమాస వ్రతమును ఆచరించుటకు గోదామాత (ఆండాళ్ళు తల్లి) గోపకాంతలను పిలిచిన విధము –

ఇది మార్గశిర మాసము. వెన్నెల నిండిన దివ్యమైన రోజు. ఐశ్వర్యము, ఆరోగ్యము కలిగి, అందమైన ఆభరణములుగల ఓ చెలులారా! ఈ స్నాన వ్రతమును ఆచరించదలిస్తే రండి. యశోదయొక్క కిశోరసింహం మనందరికీ ఏ ఆపదా రాకుండా రక్షిస్తుంది. గోపకుమారుడు, అందమైన కనుదోయివాడు, నీలమేఘ శరీరుడు, సూర్యునివలె వెలుగు – చంద్రునివలె చల్లదనము ఏకకాలంలో ఈయగల తేజోవంతమైన ముఖమండలము గలవాడు – శ్రీమన్నారాయణుని అవతారమైనవాడు ఆ యశోదైయిళగం. అతడిని పొందగోరువారు ఈ వ్రతము చేయ రారండి (శ్రీ భమిడిపాటి రాధాకృష్ణమూర్తి 'తిరుప్పావై – తెలుగు వ్యాఖ్యానము' నుండి.)

ఇలా 'చంద్రాంశుః', 'భాస్కరద్యుతిః' అనే నామములు ప్రక్కప్రక్కనే చెప్పబడడాన్ని గురించి డా. వి.వి.రామానుజన్ గారు తమ సహస్రనామభాష్యంలో ఇలా చెప్పారు – చంద్రునివలె ఆహ్లాదము కలుగజేయుట, సూర్యునివలె మాడ్చివేయుట – రెండును భగవానుని విశిష్ట లక్షణములు. ఆయన

భక్తులకు అమృతమూర్తి. దుష్టులకు ప్రచండభాను తీక్షణుడు. శ్రీనృసింహమూర్తి ప్రహ్లాద మానస రంజనుడు. హిరణ్యకశిపు భంజనుడు. అర్జునుడు దర్శించిన విశ్వరూపములో కేశవుని నామగుణ ప్రభావములను కీర్తిస్తూ జగత్తు హర్షాతిరేకముతో, అనురాగముతో పులకించుచున్నది. భయగ్రస్తులైన రాక్షసులు నలుదిక్కులకు పారిపోవుచుండిరి. సిద్ధగణములు ప్రణామములు చేయుచున్నవి.

ఇంకా – భగవంతుడు సూర్యుని తేజస్సునకు, అన్ని తేజస్సులకు ఆది కారణము. సూర్యుని తేజమును మనము తెలిసికొనవచ్చును. శ్రీమన్నారాయణుని తేజము ఊహింపరానిది.

దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా
యది భాః సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః – గీత 11.12
ఆకాశమున వేలకొలది సూర్యులు ఒక్కుమ్మడిగా ఉదయించినచో వచ్చు కాంతి పుంజములును ఆ విరాట్-రూప తేజస్సునకు సాటి రావు.

కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తాద్ దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్ – గీత 11.17
హే విష్ణో! కిరీటమును, గదను, చక్రమును ధరించి, అంతటను తేజఃపుంజములను విరజిమ్ముచున్న నిన్ను దర్శించుచున్నాను. ప్రజ్వలితాగ్నివలెను, జ్యోతిర్మయుడైన సూర్యునివలెను వెలుగొందుచున్న నీ అప్రమేయ రూపము దుర్నిరీక్ష్యమైయున్నది.

దేవీభాగతము – సప్తమ స్కంధము – పరమేశ్వరి వర్ణన –
చతుర్దిక్షు చతుర్వేదమూర్తి మద్భిరభిష్టుతమ్
కోటిసూర్య ప్రతీకాశం చంద్రకోటి సుశీతలమ్
విద్యుత్కోటి సమానాభమరుణం తత్పరం మహః
నైవచోర్ధ్వం నతిర్యక్చ న మధ్యే పరిజగ్రభత్

ఆ పరమేశ్వరి తేజము రూపుదాల్చిన నాలుగు వేదమలచేత స్తుతింపబడుచున్నది. కోట్లకొలది సూర్యకాంతులతో వెలుగుచున్నది. కోట్ల చంద్రులవలె చల్లనైనది. ఆ రూపము కోట్ల మెరుపుతీగెలు ఒక్కసారిగా తళుక్కున మెరిసినట్లున్నది. ఆ రూపమునకు పైన, క్రింద, మధ్య, అడ్డము అనే తేడాలు లేవు. ఆద్యంతములు లేవు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ సీతారామ స్తోత్రము.

అయోధ్యాపుర నేతారం మిథిలాపుర నాయికాం
రాఘవాణామలంకారం వైదేహీనామలంక్రియాం

రఘూణాం కులదీపం చ నిమీనాం కులదీపికాం
సూర్యవంశ సముద్భూతం సోమవంశ సముద్భవాం

పుత్రం దశరథస్యాద్యం పుత్రీం జనక భూపతేః
వసిష్ఠాను మతాచారం శతానంద మతానుగాం

కౌసల్యా గర్భ సంభూతం వేదగర్భోదితాం స్వయం
పుండరీక విశాలాక్షం స్ఫురదిందీవరేక్షణాం

చంద్రకాంతాననాంభోజం చంద్రబింబోపమాననాం
మత్త మాతంగ గమనం మత్త హంసవధూ గతాం

చందనార్ద్ర భుజామధ్యాం కుంకుమార్ద్ర కుచస్థలీం
చాపాలంకృత హస్తాబ్జం పద్మాలంకృత పాణినాం

శరణాగత గోప్తారం ప్రణిపాత ప్రసాదికాం
కాలమేఘనిభం రామం కార్తస్వర సమప్రభాం

దివ్య సింహాసనాసీనం దివ్య స్రగ్వస్త్ర భూషణాం
అనుక్షణం కటాక్షాభ్యాం అన్యోన్యేక్షణ కాంక్షిణౌ

అన్యోన్య సదృశాకారౌ త్రైలోక్య గృహదంపతీ
ఇమౌ యువాం ప్రణమ్యాహం భజామ్యహమ్ కృతార్థతాం

అనేన స్తౌతి యః స్తుత్యం రామం సీతాంచ భక్తితః
తస్య తౌ తనుతాం పుణ్యాస్సంపదః సకలార్థదాః

ఏవం శ్రీరామచంద్రస్య జానక్యాశ్చ విశేషతః
కృతం హనుమతాం పుణ్యంస్తోత్రం సద్యో విముక్తిదం
యః పఠేత్ప్రాతరుత్థాయ సర్వాన్ కామానవాప్నుయాత్
ఇతి శ్రీ సీతారామ స్తోత్రం సంపూర్ణమ్